ప్రజాశక్తి
గుంటూరు
శుక్రవారం
జనవరి - 5
2018
16 పేజీలు

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గుంటూరు బస్టాండ్ వద్ద, గడ్డిపాటి కళ్యాణమండపంలో 6, 7వ తేదీల్లో నిర్వహిస్తున్న సిపియం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభల ప్రారంభ సభ ఉదయం 10గంటలకు జరుగుతుందని, ఈ మహాసభల ప్రారంభ సూచికగా పార్టీ సీనియర్ నాయకులు పోపూరి రామారావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. ప్రారంభ సభకు పార్టీ సభ్యులు, అభిమానులు హాజరు కావాలని కోరారు. మహాసభల్లో పార్టీ రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య, వై.వెంకటేశ్వరరావు, సి.హెచ్.బాబురావు, డి.రమాదేవి పాల్గొంటారని తెలిపారు.

కాగితాల్లోనే!

- అమరావతి పోలీసు కమిషనరేట్‌పై సందిగ్ధం
- అర్బన్ పోలీసులపై భారం - సిబ్బంది లేక ఇబ్బంది
- సిఎం నివాసం, పరిసరాలకే ప్రాధాన్యం



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అమరావతి కేంద్రంగా మెగా పోలీసు కమిషనరేట్ ఏర్పాటు ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. విజయవాడ, గుంటూరు నగరాలతో పాటు పరిసర మండలాలను కలుపుతూ హైదరాబాద్ మాదిరిగా పెద్ద కమిషనరేట్ ఏర్పాటు చేయాలని రెండేళ్ల కిందటే అధికారులు ప్రతిపాదించారు. దీనిపై రాజకీయ పరంగా అభ్యంతరాలు రావడంతో మరుగున పడింది. ఆ తర్వాత రాజధాని 29 గ్రామాలకు ఒక పోలీసు సబ్ డివిజన్‌ను ఏర్పాటు చేశారు. సచివాలయం, అసెంబ్లీకి సంబంధించి స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్సు అధికారులను 6లో

ఆటలకు బ్రేక్



- జన్మభూమితో పాఠశాలల్లో గందరగోళం
- జోనల్ స్కూల్ గేమ్స్ వాయిదా
- పరీక్షలు సమీపిస్తుండడంతో ఆందోళనలో విద్యార్థులు



సమస్యల పరిష్కార వేదికలుగా నిలవాల్సిన 'జన్మభూమి-మాఊరు' ఇప్పుడు పాఠశాలల్లో తీవ్ర గందరగోళానికి సృష్టిస్తోంది. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల్నీ జన్మభూమి సభలకు హాజరు పర్చాలని ప్రభుత్వం నిర్దేశించటం, పాఠశాలల్లో ప్రతి రోజూ ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించటంతో స్కూల్స్‌లో అకడమిక్ షెడ్యూలు మొత్తం దెబ్బతింటోంది. మరోవైపు జనవరిలో నిర్వహించాల్సిన పాఠశాల స్థాయి జోనల్ గేమ్స్‌నూ జన్మభూమి సభల కోసం వాయిదా వేయటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి-గుంటూరు

క్రీడాకారుల్ని తీర్చి దిద్దటంలో పాఠశాల స్థాయి జోనల్ గేమ్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. భావి భారత క్రీడాకారులుగా ఎదగటానికి ఈ గేమ్స్ మొదటి మెట్టుగా నిలుస్తాయి. చదువుతోపాటు, క్రీడలపై ఆసక్తి పెంచటంలో ఎంతో స్ఫూర్తిగా నిలుస్తాయి. వీటి కోసం విద్యా సంవత్సరం ప్రారంభం నుండి ఒక ప్రణాళిక ప్రకారం జోనల్ గేమ్స్‌లో పాల్గొనే క్రీడాకారుల్ని ఎంపిక చేసి, వారికి ప్రత్యేక తర్ఫీదు ఇస్తారు. ప్రతి ఏడాది డిసెంబర్, జనవరిలో జోనల్ గేమ్స్‌ను నిర్వహించి తర్వాత పరీక్షలకు వెళ్లటం ఆనవాయితీ. అయితే ఆ సంప్రదాయానికి ఈ ఏడాది జన్మభూమి సభలతో విఘాతం ఏర్పడింది. అకడమిక్ షెడ్యూలుపై ప్రభావం చూపటంతోపాటు, జోనల్ గేమ్స్‌నూ వాయిదా వేయటంతో మొత్తంగా పాఠశాలల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రతి ఏటా గుంటూరు జిల్లాలో హైస్కూల్స్‌ను 14 జోన్‌లుగా విభజించి జోన్‌కేంద్రాల్లో పోటీలు నిర్వహిస్తారు. బాలికలకు ప్రత్యేకంగా జోనల్ గేమ్స్ నిర్వహిస్తారు. జిల్లాలో తొలుత ఈ పోటీలను జనవరి 7వ తేదీ నుండి నిర్వహించాలని అధికారులు 6లో



దళిత ప్రజా సంఘాల నాయకులు

అరెస్ట్

పెదగొట్టిపాడు వెళ్లకుండా నియంత్రణ

వార్త మెయిన్‌లో

సమస్యలపై సమరశంఖం

9లో

ప్రజలు తిరగటం కాదు..

అధికారులే పనిచేయాలి

- భవిష్యత్‌లో అర్జీ విధానం ఉండకూడదు..అర్హుల వద్దకే పథకాలు
- 1100కి ఫోన్ చేస్తే గ్రామస్థాయిలో సమస్యలు తక్షణ పరిష్కారం
- స్వచ్ఛగుంటూరు.. మనఊరు-మనపరువు లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి-తెనాలిటౌన్

అధికారులు చుట్టూ ప్రజలు తిరగటంకాదని, అధికారులే ప్రజలకు సేవ చేయాలని రాష్ట్ర ఐటీ, పంచాయతీరాజ్ శాఖామంత్రి నారా లోకేశ్ అన్నారు. కొల్లిపర మండలం అత్తోటలో గురువారం నిర్వహించిన జన్మభూమి మా ఊరు సభలో మంత్రి లోకేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత మంత్రుల జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. జన్మభూమి ప్రతిజ్ఞను రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి పత్తిపాటి పుల్లారావు చేయించారు. సర్పంచ్ కొండూరు దానియేలు అధ్యక్షతన నిర్వహించిన సభలో జన్మభూమి స్పెషలాఫీసర్ జి.బ్రహ్మయ్య నివేదకను వినిపించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.10 లక్షలు, 14వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైతే గ్రామంలో పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తవుతాయని సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ సిఎం 6లో

నరసరావుపేట కేంద్రంగా

కిడ్నీ రాకెట్

మెయిన్‌లో



మనఊరు, మనపరువు నినాదాన్ని ఆవిష్కరిస్తున్న లోకేశ్, తదితరులు

మరుగుదొడ్లతో ఆత్మగౌరవం

ప్రజాశక్తి-తెనాలి

ఆత్మగౌరవం కాపాడుకోవడానికి మరుగుదొడ్ల వినియోగం ఎంతో అవసరమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. వేమూరు మండలం జంపనిలో గురువారం నిర్వహించిన జన్మభూమి సభకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సునీత మాట్లాడుతూ పార్టీలకతీతంగా పథకాలను అర్హులకు చేర్చామని, అయినా ప్రతిపక్షం లేనిపోని రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. టిడిపియేతర ప్రభుత్వం అధికారంలోకి వస్తే తనకు మాదిరే ఎందరో మహిళల మాంగల్యం కోల్పోవాల్సిన రోజులొస్తాయని చెప్పారు. బాలికలను ఆదుకునేందుకు కిషోర వికాసం, సబల వంటి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ డెల్టాలో 70-80 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, పట్టిసీమ నీటిని డెల్టాకు అందించడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని చెప్పారు. తన నియోజకవర్గం 100 శాతం ఒడిఎఫ్‌గా గుర్తింపు పొందడం గర్వకారణంగా ఉందని పేర్కొన్న మంత్రి సంక్షేమ పథకాలపై 63 శాతం మంది సంతృప్తిగా ఉన్నారని, దీన్ని 80 శాతానికి పెంచుతామని చెప్పారు. ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తొలుత మంత్రులు గ్రామంలో రంగవల్లులను, ఐసిడిఎస్ స్టాళ్లను తిలకించారు. అనంతరం చిన్నారులను ఆశీర్వదించి గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా 32 గ్రూపులకు బ్యాంకు లింకేజీ కింద రూ. 97 లక్షల చెక్కును మంత్రులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గవిని అరుణారామకృష్ణ, ఎంపిపి చవ్వాకుల రాఘవరావు, ఎంపిటిసి మరియమ్మ, మార్కెట్‌యార్డు ఛైర్మన్ జొన్నలగడ్డ విజయ బాబు, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మైనేని మురళీకృష్ణ, డిఆర్‌డిఎ పిడి హబీబ్‌బాషా, స్పెషలాఫీసర్ జవహార్, ఆర్డీవో జి.నరసింహులు పాల్గొన్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న మంత్రులు

ఈసారీ బాయ్‌కాట్

ప్రజాశక్తి-పొన్నూరు

మండల పరిధిలోని మన్నవ సర్పంచ్, ఎంపిటిసి, ఐదుగురు వార్డు సభ్యులు 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమంలో పాల్గొనట్లేదని తెలిపారు. శుక్రవారం మన్నవలోని శ్రీ రాములవారి ధర్మసత్రంలో జన్మభూమి నిర్వహిస్తునట్లు అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. గతేడాదీ ఇదే తీరున గ్రామ సభను పంచాయతీ కార్యాలయంలో నిర్వహించని కారణంగా అప్పట్లో సర్పంచ్ బొనిగల నాగమల్లేశ్వరరావు, ఎంపిటిసి, ఐదుగురు వార్డు సభ్యులు బహిష్కరించారు. శుక్రవారం కూడా బాయ్‌కాట్ చేస్తున్నారా? అని సర్పంచ్‌ను 'ప్రజాశక్తి' వివరణ కోరగా, అవునని తెలిపారు. పంచాయతీ కార్యాలయం ఉన్నా ధర్మసత్రంలో కార్యక్రమాన్ని నిర్వహించటం ఏమిటని ప్రశ్నించారు. పంచాయతీ కార్యాలయంలేని గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నారని, మన్నవలో ప్రభుత్వ పాఠశాల ఉన్నా ధర్మసత్రంలో నిర్వహించటం అవమానంగా భావిస్తున్నామని పేర్కొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలేస్తున్న నరేంద్రవర్మ

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాటలో నడవాలి

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని మరుప్రోలువారిపాలెంలోని దాసరివారి కాలనీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని వేగేశన ఫౌండేషన్ చైర్మన్ నరేంద్రవర్మ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆయన బాటలో అందరూ పయనించాలన్న నరేంద్రవర్మ అంబేద్కర్ రచనలు సమాజంలో అసమానతలు రూపుమాపేందుకు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో అంటరానితనం కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జి.చార్వాక, పి.శ్రీరాములు పాల్గొన్నారు

పిచ్చి దుంపలు తిని విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి-అమర్తలూరు

పిచ్చి దుంపలు తిన్న విద్యార్థులు ఆస్పత్రి పాలైన ఘటన మండల కేంద్రమైన అమర్తలూరులో గురువారం చోటుచేసుకుంది. స్థానిక జెడ్‌పి పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న పి.నాగరాజు, టి.పవన్‌కుమార్, వై.గోపి మరి కొంత మంది విద్యార్థులతో కలిసి గురువారం సాయంత్రం పాఠశాల ఆట స్థలంలో సాయంత్రం ఆటలకు ఆడుకోవడానికి వెళ్లారు. ఆటలు ఆడుకుంటూ నాగరాజు, పవన్‌కుమార్, గోపిలు ఆట స్థలంలో ఆడుకుంటూ పిచ్చి దుంపలను చూశారు. వాటిని తినడంతో కొంత సేపటికి నోరు పొక్కిపోవడం, కడుపులో మంటలు రావడంతో వారు ఆ బాధను తట్టుకోలేక అల్లాడిపోతూ తోటి విద్యార్థులకు చెప్పడంతో వారు హైస్కూల్ సిబ్బందికి తెలిపారు. దీంతో 108ను రప్పించి చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు పంపించారు. ప్రస్తుతం విద్యార్థులకు ప్రమాదమేమీ లేదని వైద్యులు చెప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఊపిరి పిచ్చుకున్నారు.



తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థులు



షాపింగ్ మాల్‌లో మంత్రి పుల్లారావు

అమరావతి ఫ్యాషన్ షాపింగ్ మాల్ ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని గౌతమబుద్ధా రోడ్డులో టివిఎస్ షోరూమ్‌కు ఎదురుగా అమరావతి ఫ్యాషన్ షాపింగ్‌మాల్‌ను రాష్ట్రపౌరసరఫరాల శాఖామంత్రి పత్తిపాటి పుల్లారావు గురువారం ప్రారంభించారు. రాజధానికి అతి సమీపంలోని మంగళగిరి పట్టణంలో మెట్రో నగరాలకు దీటుగా ఈ షాపింగ్‌మాల్‌ను ఏర్పాటు చేశారు. మెన్స్‌వేర్, లేడీస్‌వేర్స్, కిడ్స్‌వేర్ బ్రాండెడ్‌ఐటమ్స్ లభిస్తాయి. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త మన్నవ సుబ్బారావు, స్థానిక టిడిపి నాయకులు సంకా బాలాజి గుప్తా, వల్లభనేని సాయిప్రసాద్, పోతినేని శ్రీనివాసరావు, రాయపాటి రంగారావు, కొమ్మా లవకుమార్, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి షేక్ లాల్ వజీర్, ఎండి.ఇబ్రహీం, షేక్ రియాజ్, చావలి ఉల్లయ్య, నందం అబద్ధయ్య, షేక్ ఇంతియాజ్, షేక్ నాగుల్‌మీరా, షేక్ హుస్సేన్, డికొల్లు గోవిందరాజు, అమరావతి సూపర్ మార్కెట్ మేనేజర్ అంచె శశిధర్, నన్నపనేని నాగేశ్వరరావు, మాదల సునీల్ చౌదరి, డి.వెంకటేశ్వరరావు, బొక్కా నరసింహారావు, విస్తళ్ళ రమేష్‌బాబు, ఎస్.బాలశౌరి, షాపింగ్‌మాల్ ప్రొప్రైయిటర్ ఎం.అనీల్‌కుమార్, ఎన్.ఉదయకృష్ణ, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దుగ్గిరాల యార్డు ఛైర్మన్‌గా శ్రీధర్

నేడు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - దుగ్గిరాల



దుగ్గిరాల వ్యవసాయ మార్కెటింగ్ యార్డు కమిటీ ఛైర్మన్‌గా కేశంనేని శ్రీధర్‌ను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆగస్టు 11, 2017న అప్పటి ఛైర్మన్‌గా ఉన్న వంగా సాంబిరెడ్డి పదవీకాలం ముగియడంతో ఐదు నెలల నుండి ఈ పదవి కోసం తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఎట్టకేలకు గురువారం వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్ జిఒ ఆర్‌పి నం.12 ప్రకారం కేశంనేని శ్రీధర్‌ను ఛైర్మన్‌గా, కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. చందు సాయిబాబు వైస్‌ఛైర్మన్‌గా, కమిటీ సభ్యులు మండు శివనాగేశ్వరరావు, చొప్ప ర రత్నకుమారి, అంకె హరనాథ్ బాబు, ఆరుమళ్ల నాగిరెడ్డి, ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి, ఆరె శేఖరరావు, మున్నంగి దావీదు, దేశబోయిన శివరామకృష్ణ, పీత సాంబయ్య, పాలడుగు సుబ్బారావు, మైలా వెంకట సుబ్బయ్య, షేక్ బాషా, చుండూరు ఉమామహేశ్వరరావు, పిఎసిఎస్ అత్తోట అధ్యక్షులు, అడిషినల్ డైరెక్టర్ మార్కెటింగ్ గుంటూరు, అగ్రికల్చరల్ ఎడిఎ తెనాలి, దుగ్గిరాల సర్పంచ్ మేఘావత్ పార్వతిభాయ్ కమిటీ సభ్యులుగా ఉంటారు. పదవీ బాధ్యతలను శుక్రవారం స్వీకరిస్తామని శ్రీధర్ తెలిపారు.

గురుకుల ప్రిన్సిపల్‌కు ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి -బాపట్ల

గిరిజన సంక్షేమ గురుకులాల్లో నైతిక విలువలుతో కూడిన విద్యను అందించాలని గిరిజన సంక్షేమ గురుకుల రాష్ట్ర కార్యదర్శి దేవర వాసు అన్నారు. రాష్ట్ర స్థాయిలో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్స్‌కు బాపట్ల మానవ వనరుల అభివృద్ధి సంస్థలో మూడ్రోజుల శిక్షనలో భాగంగా గురువారం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గురుకులాల్లో విద్యార్థులకు బోధించాల్సిన పాఠ్యాంశాలపై వివరించారు. విద్యా బోధనలో అనేక మార్పులొచ్చాయని, మారుతున్న పాఠ్యాంశాలపై నైపుణ్యం, ప్రావీణ్యంతో కూడిన బోధనా పద్ధతులను అవలంభించాలని చెప్పారు. గురుకులాల అభివృద్ధికి వారికున్న అధికారాన్ని వినియోగించి నిర్భయంగా బాధ్యతాయుతంగా వాటి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల కంటే రెట్టింపు పరిజ్ఞానాన్ని పెంపొందించేలా గురుకుల విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఇదిలా ఉండగా శిక్షణలో భారత రాజ్యాంగం, విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్, నూతన మార్పు అంశాలపై అవగాహన కల్పించారు. నూతన బోధనా పద్ధతులు, రాష్ట్ర ఫైనాన్స్ కోడ్ అకౌంట్స్ సిస్టం, క్యాష్ బుక్ నిర్వహణ అంశాలను వివరించారు. ప్రధానంగా గిరిజన బాలలకు విద్యా హక్కు అనే అంశాలతో పాటు సమాచార హక్కు ,చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని శిక్షణలో వివరించారు. కార్యక్రమంలో సంస్థ డిజి. డి.చక్రపాణి, గురుప్రసాద్, అనిల్ దత్త్, కె.శేషగిరి, నరసింహమూర్తి, భువనేశ్వరలక్ష్మి, వి.రామ్మోహనరావు, ఇమాన్యుయేల్ దాసరి పాల్గొన్నారు.





హాజరైన ప్రిన్సిపల్స్, మాట్లాడుతున్న దేవార వాసు (ఇన్‌సెట్)

రెండో రోజుకు ఎంఆర్‌పిఎస్ దీక్షలు

తెనాలి రూరల్ : ఎస్సీ వర్గీకరణ కోసంమాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్ష గురువారం రెండో రోజుకు చేరింది. బిసి నాయకులు టి.హరిప్రసాద్, టి.వెంకటేశ్వర్లు దీక్షను ప్రారంభించారు. పి.రమేష్, ప్రతాప్, ఆశీర్వాదం, మోదుకూరి మోహన్, చిన్ని, మరియదాసు, నవీన్, మస్తాన్ పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

చెరువు లీజు విషయంలో వివాదమే కారణమంటున్న మృతుని కుటుంబీకులు




వివరాలు సేకరిస్తున్న పోలీసులు, హత్య గురైన రాంబాబు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్, బాపట్ల

అర్ధరాత్రి అతికిరాతకంగా ఓ వక్తిని హతమార్చిన ఘటన నగరం మండల పరిధిలోని గట్టువారిపాలెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే నగరం మండలం గట్టువారి పాలెం గ్రామానికి చెందిన అచ్చుత రాంబాబు(40) అర్ధరాత్రి తన రొయ్యల చెరువు వద్ద నిద్రిస్తున్న సమయంలో బుధవారం రాత్రి సుమారు ఒంటి గంట సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు అతి కిరాతరంగా ముఖం, ఇరత శరీర భాగాలపై కత్తులలతో, కర్రలతో హతమార్చారు. అర్ధరాత్రి కేకలు గమనించిన రొయ్యల చెరువుల కాపలాదారులు సమీపంలోని స్థానికులను అక్కడకు చేరుకునే సమయానికే హంతకులు పరారయ్యారు. అనంతరం కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని కొన ఊపిరితో ఉన్న రాంబాబును పిట్లవానిపాలెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పొన్నూరులోని నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యంలోనే రాంబాబు మృతి చెందాడు. మృతుడు రాంబాబుకు భార్య ధనలక్ష్మి, గోపి సైదులు (18), పోలేశ్వరరావు (17) పిల్లలున్నారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం అల్లూరు గ్రామానికి చెందిన బేతాలం సోమరాజుకు చెందిన రొయ్యల చెరువులు 4 సంవత్సరాలు లీజు అగ్రిమెంటుకు రాంబాబు కుదుర్చుకున్నాడు. బేతాళసోమరాజు, అచ్యుత రాంబాబు మధ్య లీజు కాలపరిమితికి సంబంధించి విభేదాలు జరుగుతున్నట్లు బంధువులు తెలిపారు. సోమరాజు, కానిస్టేబుల్ సుబ్బారావు తన భర్తను హతమార్చారని భార్య ధనలక్ష్మి ఆరోపించారు. పొన్నూరు ప్రభుత్వాసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. సిఐ కోటేశ్వరారావు హత్యగావించిన వారిని పట్టుకొని కఠినంగా శిక్షిస్తామని, కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

కానిస్టేబుల్ కొట్టడంతో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

మద్యం తాగిన వ్యక్తిని కానిస్టేబుల్ కొట్టడంతో వ్యక్తికి తల పగిలి గాయాలు అయిన ఘటన పిడుగురాళ్ళ పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కారంపూడి మండలం మిర్యాల



గ్రామానికి చెందిన వ్యక్తి పిడుగురాళ్ళ పట్టణంలో నాగులు కొనుగోలు చేసేందుకు వచ్చాడు. అయితే సదరు వ్యక్తి మద్యం తాగి ప్రధాన రహదారిపై తిరగుతుండటంతో ఇద్దరు కానిస్టేబుళ్ళు వచ్చి ఆ వ్యక్తిని కొట్టడంతో కింద పడి తల డ్రైనేజికి తగలటంతో రక్తస్రావం అయింది. వెంటనే పోలీసులు క్షతగాత్రున్ని ఆటోలో పట్టణంలో ప్రవైటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు వైకరిపై స్థానికులు తీవ్రం అసంతృప్తి వ్యక్తం చేశారు.



లారీ కింద పడిన బైకు

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-నకరికల్లు

లారీ ఢీకొని వ్యక్తి గాయాలపాలైన ఘటన మండలకేంద్రంలోని నకరికల్లులో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం నర్సింగపాడు గ్రామానికి చెందిన ఆవుల నర్సింహరెడ్డి ద్విచక్రవాహనంపై నకరికల్లు నుండి నర్సింగపాడుకు బయలుదేరాడు. జైజంక్షన్‌లో లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. గాయాలపాలైన నర్సింహరెడ్డిని మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు.

ఆర్ఎంపి వైద్యుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - నరసరావుపేట

తంగెడుమల్లికి చెందిన ఆర్ఎంపి ప్రాక్టిషనర్స్ విప్పర్ల శ్రీనివాసరావు కొద్ది రోజుల కిందట గురవాయపాలెం గ్రామ శివారులో ప్రమాదవశాత్తు లారీ క్రింద పడి మృతి చెందాడు. ఎపి మెడికల్ ప్రాక్టిషనర్స్ అసోసియేషన్ నరసరావుపేట డివిజన్ వారి ఆధ్వర్యంలో వారి కుటుం బాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కో ఆర్డినేటర్ షేక్ బాజి మాట్లాడుతూ మీ కుటుంబానికి ఏదైనా సహాయం అవసరమైతే మా అసోసి యేషన్ ఎప్పుడు మీకు అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో షేక్ మౌలాలి, ఎ. నాగేశ్వరరావు, షేక్ మీరావలి, షరీఫ్, వలి, శ్రీను, అహమ్మద్, రాజు, మోహన్, వంకాయలపాటి రవి పాల్గొన్నారు.

'మా వైర్లు.. కత్తిరించి మాపై కేసులా..'

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

మా కేబుళ్ల కత్తిరించి మాపై కేసులు పెట్టడం దారుణమని పిడుగురాళ్ళ సిగ్మా కేబుల్ నిర్వాహకులు వాపోయారు. గురువారం స్థానిక సిగ్మా కేబుల్ కార్యాలయంలో కేబుల్ టివి నిర్వాహకులు మాట్లాడుతూ కావాలనే తమపై కుట్ర పూరితంగా కేసులు పెడుతున్నారన్నారు. వారు అడిగినంత వాటా ఇవ్వలేదని గతంలో మా కేబుళ్లను సుమారు 12 కిలో మీటర్ల కత్తిరించారని కనీసం కేబుళ్ల కూడ దొరకుండా దొంగలించారని అన్నారు. ఇప్పుడు వారి కేబుళ్ళను వారే కత్తిరించుకొని మాపై కేసులు పెట్టారని వారు తెలిపారు. అంతేకాక గ్రామాల్లో తమ సెట్‌ఆప్ బాక్సులను దొంగతనంగా తొలగించి వినియోగదారుడుకి మాయ మాటలు చెప్పి వారికి సంబంధించిన సెటాప్ బాక్సులు పెడుతున్నారన్నారు. తమకు అందిన సమాచారం ప్రకారం ఈ నెల 12,13వ తేదిలలో కొంత మందికి డబ్బులిచ్చి మా కేబుళ్ళను కత్తిరించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని వ్యాపారాన్ని నిలిపి వేయటానికి ఇలా చేస్తున్నారని అన్నారు. దీని వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు.

వివాదంపై కేసు

ప్రజాశక్తి-తెనాలి రూరల్

హఫ్‌పేట, తంగెళ్ళమూడి గ్రామాల మధ్య జరిగిన నూతన సంవత్సర వేడుకల వివాదంలో గ్రామంలో బైకులపై తిరుగుతూ అసభ్యంగా ప్రవర్తించిన 9 మంది తంగెళ్ళమూడి యువకులపై తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఎస్ఐటి అనీల్‌కుమార్ బుధవారం తెలిపారు. హఫ్‌పేట తాగు నీటి పైపులైను పగల కొట్టిన విషయంలో కూడా తంగెళ్ళమూడి యువకులపై పెదకాకానిలో పోలీసులు కేసు నమోదు చేశారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 61,513
మిర్చి ఎగుమతి	: 62,063
మిర్చి నిల్వ	: 4,151

మిర్చి ధరలు

	రూపాయలలో
334	2200-7800
నెం.5	4,000-9,000
273	4500-9000
341	3500-9,700
సూపర్-10	6400-6400
నాన్ ఏసి	
తేజ	4,000-10,800
బడిగి	2,500-13,000
దేవనూరు డీలక్స్	3000-12000
తాలుకాయలు	1,000-5,000
ఏసి	
334	3,000- 7200
నెం.5	3,500-8,800
273	5,400-6500
341	4,000-9,200
సూపర్-10	6,600-6,600
తేజ	3,500-9,200
బడిగి	3,500-8,100
దేవనూరు డీలక్స్	5000-10000
తాలుకాయలు	1,500-5,000

పోటాపోటీగా పెన్షనర్స్ సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి - నరసరావుపేట

నరసరావుపేట తాలుకా ప్రభుత్వ పించన్ దారుల సంఘం ఎన్నికలు గురువారం స్థానిక ఎన్‌జివో హోమ్‌లో ఎన్నికలు నిర్వహించారు. ఒక అధ్యక్ష పదవికి ఇద్దరు అభ్యర్థులు, 5 ఉపాధ్య పదవులకు 10 మంది, ఒక కార్యదర్శి పదవికి ముగ్గురు, 5 సంయుక్త కార్యదర్శి పదవులకు 10 మంది, ఒక కోశాధికారి పదవికి ఇద్దరు అభ్యర్థులు బరిలో నిలిచారు. ఉదయం నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ఈ పోటీల్లో కనపర్తి ఇమ్మానియేల్ ప్యానల్, మానవ సుబ్బారావు ప్యానల్ పోటీలలో నిలిచాయి. మొత్తం పెన్షనర్లు 2917 ఉండగా 999 ఓట్లు పోలయ్యాయి. ఈ కార్యక్రమాన్ని పోలింగ్ ఆఫీసర్ ఎమ్.ప్రసాద్, అసిస్టెంట్ ఆఫీసర్లు ఎస్ఎమ్.సుభాని, శేషగిరిరావు, పరిశీలకులుగా సోమేశ్వరరావు, టివిఎస్ఎస్ఎ శర్మ, కోటేశ్వరరావు పాల్గొన్నారు. గుంటూరు, చిలకలూరిపేట, పిడుగురాళ్ళ, గురజాల నుండి పోలింగ్ ఏజెంట్లుగా ఉన్నారు. ఫలితాలు లెక్కిస్తున్నారు.

క్రికెట్‌లో రాఘవేంద్ర టీమ్ విజయం

ప్రజాశక్తి - నరసరావుపేట

స్థానిక రెడ్డి కాలేజీలో గురువారం నిర్వహించిన పట్టణ పురోహిత టోర్న మెంట్‌లో ఉప్పల రాఘవేంద్ర టీమ్ విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో తంగిరాల గోపి, ఉప్పల రాఘవేంద్ర టీమ్ పోటీ పడ్డాయి. గెలుపొందిన టీమ్ కెప్టెన్‌గా ఉప్పల రాఘవశర్మ, వైస్ కెప్టెన్‌గా అనుమల శ్రీనివాసశర్మ పోటీల్లో పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుని మృతికి మాజీ మంత్రి కాసు సంతాపం

ప్రజాశక్తి - నరసరావుపేట

పట్టణంలోని ఇస్లాంపేటలో ఉన్నా ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు షేక్ మహ్మద్ ఖాశిం బడేబచ్చాగా పేరుపడ్డ వ్యక్తి కొద్ది రోజులుగా అస్వస్థతో ఉండి బుధవారం మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి, కాసు మహేశ్వరరెడ్డి వారి గృహానికి వెళ్లి భౌతికాయానికి నివాళు లర్పించారు. రాజకీయంగా తమకు ఎంతో సన్నిహితులని వారు తెలిపారు.



ఆర్టీసీ రిజర్వేషన్ సమాచారం

గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్ నుండి శుక్రవారం బయలుదేరే దూరప్రాంత బస్ సర్వీసులు, సీట్ల వివరాలను ఆర్టీసీ ఆర్ఎం జ్ఞానంగారి శ్రీహరి తెలిపారు. ముందస్తు రిజర్వేషన్ కోసం ఫోన్ నెం.08632221573లో సంప్రదించాలని పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం 4.00 గంటలకు బయలుదేరే బెంగళూరు సూపర్‌లగ్జరి 33, రాత్రి 9.45 గంటల ఇంద్ర ఎసి 39, రాత్రి 10.15 గంటల ఇంద్ర ఎసి 39, రాత్రి 11 గంటల కెపిహెచ్‌బి గరుడ ఎసి 46, రాత్రి 10.50 అమరావతి ఎసి 40, 11.15 గంటలకు కెపిహెచ్‌బి ఎసి 41, రాత్రి 8.30 గంటల చెన్నై సూపర్ లగ్జరీలో 34, విశాఖ సూపర్ లగ్జరీ రాత్రి 8 గంటలకు ఖాళీలు 21, రాత్రి 9.30 గంటలకు 32, తిరుపతి సూపర్ లగ్జరీ 6.45 గంటలకు 35 ఖాళీలు, 9.45 గంటలకు 34, 10.15 గంటలకు 31 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎంక్వయిరీ నెం. 9959061597.

జిజిహెచ్ సమాచారం



గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో శుక్రవారం అందించే ఓపి, ఐపి వైద్య సేవలు, వైద్యుల వివరాలు..

జనరల్ మెడిసిన్ : ఐదవ యూనిట్ డాక్టర్ శ్రీకాంత్
శస్త్రచికిత్సలు: డాక్టర్ భవాని
గైనకాలజీ: డాక్టర్ పి.చంద్రశేఖరరావు
ఆర్థోపెడిక్: డాక్టర్ రమణ యశశ్వి
కార్డియాలజీ(సూపర్ స్పెషాలిటీ): డాక్టర్ ఎం.శ్రీనివాసరావు
రేడియోథెరపీ: డాక్టర్ డిఎస్ రాజునాయుడు
గాస్ట్రోఎంటరాలజీ: డాక్టర్ ఎ.కవిత
యూరాలజీ: డాక్టర్ యు సూర్యకుమారి
ప్లాస్టిక్ సర్జరీ: డాక్టర్ ఎం.మార్కండేయులు
చర్మ వ్యాధులు: డాక్టర్ ఎస్.నాగేశ్వరమ్మ
మానసిక విభాగం: డాక్టర్ ఎన్.మురళీకృష్ణ
చెవి, ముక్కు గొంతు వ్యాధులు: డాక్టర్ ఎన్.శాంతయ్య
ఆప్తమాలజీ: డాక్టర్ ఉదయ్‌కుమార్
చిన్నపిల్లల విభాగం: ప్రొఫెసర్ డాక్టర్ యశోధర
యోగా నేచురోపతి: డాక్టర్ ఉమాసుందరి
జిజిహెచ్ ఫోన్ నెం: 0863-2220035
సూపరింటెండెంట్: డాక్టర్ డిఎస్ రాజునాయుడు - 9849903089
డిసిఎస్ఆర్ఎంఒ: డాక్టర్ కె.ఆదినారాయణ, ఎఎస్ **ఆర్ఎంఒ:** డాక్టర్ వైరమేష్
నర్సింగ్ సూపరింటెండెంట్ : పుష్పావతి
ఒపి సమయం: ఉదయం 8 గంటల నుండి 11.30 గంటల వరకు
ఉచితంగా గుండె ఆపరేషన్లు అవసరమైనవారికి డాక్టర్ పాదిల ప్రసాద్ మిలీనియం బ్లాక్‌లోని రెండో ఫ్లోర్‌లో ప్రతిరోజూ వైద్యపరీక్షలు చేస్తారు.

రోడ్డు లేక అవస్థ పడుతున్నాం

జన్మభూమిలో యువకులు, మహిళలు అధికారులపై ఆగ్రహం



దళితకాలనీలో రచ్చరచ్చగా ఉన్న బురదరోడ్డు

ప్రజాశక్తి-అమర్తలూరు

పెదపూడి దళితకాలనీలో రోడ్లు వేయలేదని కాలనీవాసులు జన్మభూమి కార్యక్రమంలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జన్మభూమి - మా ఊరు కార్యక్రమం గురువారం పెదపూడి గ్రామంలో నిర్వహించారు. సభలో అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు గురించి వివరించుచుండా గ్రామంలో సినిమా హాలు ఎదురుగా ఉన్న దళితకాలనీ యువకులు తమకు రోడ్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని వర్షాకాలం వస్తే మోకాలు లోతు బురదలో నడుస్తున్నామని, పిల్లలు బడికి వెళ్లాలంటే బురద రోడ్లలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గ్రామంలో అన్ని రోడ్లు వేశారు దళితకాలనీలో ఎందుకు రోడ్లు వేయలేదని సభా వేదిక దగ్గరకు వెళ్లి అధికారులను నిలదీశారు. కాలనీలో విద్యుత్ దీపాలు లేక నానా అవస్థలు పడుతున్నా ప్రజాప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. దీంతో జన్మభూమి మండల ప్రత్యేకాధికారి రామ్మోహన్ ఏదైనా సమస్యలు ఉంటే అప్లికేషన్లు ఇవ్వాలని సభా వేదిక దగ్గరకు వచ్చిన యువకులకు చెప్పారు. యువకులు గత నాలుగు సంవత్సరాలుగా ఎంతోమంది అధికారులకు, జన్మభూమి కార్యక్రమాల్లో ఎన్నోసార్లు లిఖిత పూర్వకంగా విన్నవించామని అయిన ఎవరూ పట్టించుకోవడంలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ప్రత్యేకాధికారి జన్మభూమి గ్రామ సభలో గొడవలు చేస్తే పోలీసుల చేత కేసులు పెట్టిస్తామని హెచ్చరించారు. దీంతో మండిపడ్డ కాలనీ యువకులు, మహిళలు ఎంతమంది మీద కేసులు పెడతారో.... ఎంతమందిని జైలులో పెట్టిస్తారో చూస్తామని కేకలు వేయడంతో సభలో గందరగోళం మొదలైంది. కొంతమంది నాయకులు సర్దిచెప్పడంతో యువకులు శాంతించారు. తరువాత ఎంపిడిఓ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ పెదపూడి గ్రామానికి రూ.50లక్షలు సబ్‌ప్లాన్ నిదులు మంజూరయ్యాయని కాలనీలో సిసి రోడ్లు నిర్మాణం వెంటనే ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమంలో పలువురు రైతులు మొక్కజొన్న, జొన్న పంటలకు నీరందించాలని కోరారు. స్పందించిన ఇరిగేషన్ ఎఇ మాట్లాడుతూ రబీ పంటలకు సాగునీరు అందించడం కష్టమని, మందులు పిచికారి చేసుకొవడానికి రెండు మూడు రోజుల్లో జాలుగా నీటిని కాల్వలకు విడుదల చేస్తామని చెప్పారు. జన్మభూమి సభకు ఎంపిటిసి పెదపూడి ఆనంద్ వచ్చి ఎదురుగా కూర్చొన్న అధికారులు పిలవకపోవడంతో అతను సభలో అటుఇటు తిరిగి సభావేదిక మీదకు ఆహ్వానించలేదని, జన్మభూమి కమిటీ సభ్యులకు ఉన్న గౌరవం ఒక ఎంపిటిసికి లేదని సభ మధ్యలోనే వెళ్లిపోయారు. అయితే ఎంపిడిఓ శ్రీనివాసులు తొలుత సభవేదిక మీదకు అందరిని ఆహ్వానించే సమయంలో ఎంపిటిసి ఆనంద్‌ను కూడా ఆహ్వానించామని ఆయన రాలేదని, తరువాత ఆయన సమావేశానికి వచ్చినట్లు గమనించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిపి బొంతా నాగమల్లేశ్వరి మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలోని దళితకాలనీల్లో సిసి రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని త్వరలో వాటిని పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పెదపూడి సమాధానం, ప్రత్యేకాధికారి రామ్మోహన్, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సభావేదిక మీద ఉండాల్సి ఎంపిటిసి వైద్య శిబిరాల దగ్గర నిలబడ్డ వైనం

ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలి

ప్రజాశక్తి-తెనాలి

బహిరంగ మల విసర్జనకు స్వస్తి చెప్పి పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ పెండేల వెంకట్రావు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని 9, 10, 11, 12 వార్డుల్లో జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటుకు పురపాలక సంఘం తీసుకుంటున్న చర్యలకు సహకరించాలని కోరారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీని స్థానిక రావి సాంబయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద నుండి విద్యార్థులు నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి మరుగుదొడ్లవాడకం, రోడ్ల పరిశుభ్రత, బాహ్య మల మూత్ర విసర్జన నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె శకుంతల, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ బివి రమణ, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పెదగొల్లపాలేన్ని దత్తత తీసుకున్న ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - కర్లపాలెం

పెద్దగొల్ల పాలెం గ్రామాన్ని దత్తత తీసుకున్నానని ఎంఎల్‌సి అన్నం సతీష్ అన్నారు. గురువారం దుండివారి పాలెం,పెద్ద గొల్లపాలెం గ్రామాల్లో మావూరు జన్మ భూమి కార్యక్రమం నిర్వహించారు. పెద్దగొల్లపాలెం గ్రామంలో జరిగిన జన్మభూమికి అన్నం ముఖ్య అతిథిగా విచ్చేసి. మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైసిపి నేత మండల పరిషత్ ఉపాధ్యక్షులు పి.సుబ్బారావును కలిసి రాజకీయ పార్టీలకు అతీతంగా అందరు సహకరించాలని కోరారు. జన్మభూమి కార్యక్రమాలను నోడల్ అధికారి మోహనరావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి వెంకటసుబ్బయ్య, ఏ. డి.ఎ శాస్త్రి, నక్కల వెంకట స్వామి, ఎం.పి.పి మాడ వెంకటరత్నం, శరత్ బాబు, నూనె ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మోటారు వాహన చట్ట బిల్లుకు వ్యతిరేకంగా నేడు నిరసన

ప్రజాశక్తి-తెనాలి

డ్రైవర్ల పాలిట ఉరితాడుగా మారే మోటారు వాహన చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం చేపట్టిన దేశవ్యాప్త నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని సిఐటియు డివిజన్ అధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి కోరారు. బాలాజీరావు పేటలోని మినీలారీ స్టాండు వద్ద షేక్ కరీముల్లా అధ్యక్షతన సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2015 రోడ్డు భద్రతా బిల్లును లోకసభలో ఆమోదించిందని, రాజ్యసభలో తగిన మెజార్టీ లేకపోవడంతో ఇప్పటి వరకు వాయిదా వేసిన ప్రభుత్వం శుక్రవారం బిల్లును ప్రవేశపెట్టనుందని తెలిపారు. ఈ ప్రమాదకర బిల్లు ఆమోదం పొంది చట్టంగా మారితే ఏ ఒక్క డ్రైవర్ రోడ్డు మీదకు రాలేడన్నారు. చిన్నచిన్న తప్పిదాలకు భారీ జరిమానాలు, జైలు శిక్షలను ఇందులో పొందుపర్చారని వివరించారు. ఈ క్రమంలో ఆ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం ఉదయం 11 గంటల నుండి మున్సిపల్ మార్కెట్ సెంటర్ వద్ద నుండి నిర్వహించే నిరసన ప్రదర్శనలో వాహనాల యజమానులు, డ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బొంతా శ్రీనివాసరావు, పఠాన్‌మీరాఖాన్, షేక్ ఖాసింపీరా, బి నాగేశ్వరరావు, షేక్ జాఫర్, కంచర్ల రమేష్, షేక్ జిలాని పాల్గొన్నారు.

'జన్మభూమి'లో రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి రూరల్ : మండలంలోని మల్లెపాడు, చావావారిపాలెం గ్రామాల్లో జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నూతనంగా మంజూరైన పెన్షన్ కార్డులు, రేషన్ కార్డులు, సభలో మంజూరు పంపిణీ చేశారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి వేదిక జన్మభూమి

ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-నగరం

సంక్షేమ పథకాలపై ప్రజలకు చైతన్యం కల్పించేందుకే జన్మభూమి మా-ఊరు సభలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం గ్రామాల్లో గురువారం నిర్వహించిన సభల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రజాసమస్యలను సత్వరం పరిష్కరించేందుకే జన్మభూమి మా-ఊరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజల సమస్యలు పరిష్కరించటానికి జన్మభూమి మా-ఊరు కార్యక్రమం ఒక వేదిక అని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం ద్వారా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వమే పూర్తి ఆర్థిక సహాయాన్ని అందిస్తుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు పసుపు కుంకుమను అందించారు. కార్యక్రమంలో ఐజీపి ఉజాలా, స్పెషల్ ఆఫీసర్ ధనుంజయ్, టిడిపి జిల్లా కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, నాయకులు పంతాని మురళీధరరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గర్భిణులకు పసుపు కుంకుమ అందజేస్తున్న ఎమ్మెల్యే అనగాని

ప్రచార జాతాలా జన్మభూమి

ప్రజాశక్తి-పెదకాకాని

మండలంలోని అగతవరపాడు గ్రామంలో గురువారం జన్మభూమి-మాఊరు కార్యక్రమం టిపిడి ప్రచార జాతాలా సాగింది. ప్రభుత్వంలోని పలు శాఖల అధికారులు పథకాలను వివరిస్తూ జన్మభూమి కార్యక్రమాన్ని కొనసాగించారు. మొత్తంగా జన్మభూమి సభలు అధికార పార్టీ ప్రచార వేదికలుగా మారాయని ప్రజలు మాట్లాడుకుంటున్నారు.

జన్మభూమి-మా ఊరు సభలు టిడిపి ప్రచార కార్యక్రమాలుగా సాగుతున్నాయని వైసిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు రావి వెంకటరమణ అన్నారు. రాష్ట్రంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమాల తీరు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నట్లుందన్నారు. జన్మభూమి సభల సాక్షిగా అధికారులే ప్రోటోకాల్ ఉల్లంఘనలను పాల్పడుతున్నారని ఆరోపించారు.ప్రజా ప్రతినిధులకు మాత్రం అడుగడుగునా అవమానాలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఎస్‌కె. నజీర్, పెండ్యాల సురేష్, పమిడిమళ్ల అనిల్, ఎస్‌కె.బాషిద్ తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని తహశీల్దార్ కార్యాలయానికి తాళం వేసి నిరసన

ప్రజాశక్తి- పెదకాకాని

మండలంలోని జన్మభూమి కమిటీని రద్దుచేసి సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ గ్రామంలోని అంబేద్కర్ కాలనీ నివాసి వరికుంట రోశయ్య అనే యువకుడు హఠాత్తుగా 10 గంటల సమయంలో తహశీల్దార్ కార్యాలయంలోకి ప్రవేశించి తాను తెచ్చుకున్న తాళం వేసి బైఠాయించి కూర్చున్నాడు. అంబేద్కర్ కాలనీ సమస్యలపై చిన్నచూపు చూపుతున్నారని, శ్మశానవాటికకు ప్రహరీ నిర్మాణం చేయాలని, కాలనీకి చెందిన పలువురికి ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఈ సందర్భంగా యువకుడు పేర్కొన్నారు. తనకు చెందిన చిన్న దుఖాణం నకు రూ.35 వేలు కరెంటు బిల్లు వచ్చిందని, ఇదేమిటని విద్యుత్ శాఖ స్థానిక అధికారిని అడిగితే ఇంతవరకు సమాధానం రాలేదన్నాడు. ఈ విషయాలన్నీ పై అధికారులకు తెలిసే వరకు తాళం తెరవనని చెప్పాడు. దీంతో ఎంపిడిఒ టి.శ్రీనివాసరావు, పెదకాకాని సిఐ, సర్పంచ్ ఆళ్ల వీర రాఘవమ్మ తదితరులు వచ్చి సమస్యలను పరిశీలిస్తామని సముదాయించేందుకు ప్రయత్నించారు. అయినా 'మీ వల్ల కాదు, మా సమస్య పరిష్కారం కాకపోతే నా చావుకు ప్రభుత్వం కారణమవుతుంది' అంటూ తనతోపాటు తీసుకొచ్చిన పెట్రోల్, కిరోసిన్ సీసాలను చూపుతూ బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో పోలీసులు కార్యాలయ దక్షిణం వైపు కిటికి గ్రిల్స్ తొలగించి లోపలికి ప్రవేశించి రోశయ్యను అరెస్టు చేశారు. అనంతరం ఎంపిడిఒ టి.శ్రీనివాసరావు అతని చెప్పిన సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళతానన్నాడు. రోశయ్యను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.





విద్యార్థులతో చర్చిస్తున్న ఎన్ఆర్ఐ హౌస్‌సర్జన్లు

అరవింద విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని అరవింద మోడల్ స్కూల్ విద్యార్థులను గురువారం స్థానిక ఎన్.ఆర్.ఐ. డాక్టర్లు, హౌస్ సర్జన్లు హెల్త్ చెక్ అప్ చేశారు. 6-7 వ తరగతి విద్యార్థినీ, విద్యార్థుల బరువు, ఎత్తు, కంటిచూపు తదితర పరీక్షలు చేశారు. నిత్యమూ ఆరోగ్యంగా ఉండటానికి కావాల్సిన జాగ్రత్తలు, జంక్ ఫుడ్ తినటం, శుభ్రంగా లేకపోవడం వల్ల కలిగే అనారోగ్యాలను పిల్లలకు చక్కగా వివరించారు. డాక్టర్ అనూష 14-16 వయస్సు విద్యార్థినులకు రుతుచక్రం గురించి చక్కగా వివరించారు. నెలసరి సమయంలో పిల్లలకొచ్చే సమస్యలు, అవి అధిగమించటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారం గురించి వివరించారు. కార్యక్రమాన్ని ఠాగూర్ పర్యవేక్షించారు. ప్రధానోపాధ్యాయురాలు అనురాధ కార్యక్రమ నిర్వాహణపై ధన్యవాదాలు తెలిపారు.

దళితులపై దాడులకు సిపిఎం ఖండన

ప్రజాశక్తి - తాడికొండ

దళితులపై పెత్తందారుల దాడులను సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ ఏరియా కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. గురువారం తాడికొండలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్‌డిఎ, టిడిపి ప్రభుత్వాలు వచ్చిన తరువాత వివిధ రాష్ట్రాల్లో హక్కుల గురించి మాట్లాడుతున్న దళిత యువకులపైన కులంపేరుతో దాడులు హత్యలు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని పెద్దగొట్టిపాడులో చిన్న విషయాన్ని ఆసరా చేసుకొని దళిత కాలనీపై మూకుమ్మడిగా పెత్తందారులు రాళ్లతో, కర్రలతో దాడిచేయగా అనేకమంది గాయాలకు గురై ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాసిన రాజ్యాంగం కుల, మతాలకు అతీతంగా మానవులు అంతా సమానంగా ఉండాలని కోరుకుంటే నేడు పాలక ప్రభుత్వాల అండతో మత, కుల ఛాందసవాదులు పేట్రేగిపోతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులు ఐక్యతతో ఇలాంటి దాడులను తిప్పికొట్టాలని కోరారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, కెవిపిఎస్ నాయకులు కె.యేషయ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో భాగంగా మూడో రోజు గురువారం పరిశుభ్రత, ఆరోగ్యం, బహిరంగ మల విసర్జన అనే అంశాలపై ఈమని హైస్కూల్లో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు తెలిపారు. అనంతరం జరిగిన ఆటల పోటీలను ట్రైనీ కలెక్టర్ స్వప్నిల్ తిలకించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులతో బహిరంగ మల విసర్జన, ఆరోగ్యం పరిశుభ్రతలపై చర్చించారు.

స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాలీ

ప్రజాశక్తి - మంగళగిరి

జన్మభూమి - మాఊరు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఎస్ఎల్ఎం చైతన్య హైస్కూల్ విద్యార్థులు గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీ, మానవహారం కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవి ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఉయ్యాల సత్యనారాయణ, పాఠశాల కరస్పాండెంట్ శింటె వెంకటేశ్వరరావు, ఎస్.బాలకృష్ణ, ప్రిన్సిపల్ సుభాషిణి, సుధాకర్, నజీమా, హైమావతి, మారుతిరావు, గణపతి పాల్గొన్నారు.

మంగళగిరిలో అన్న క్యాంటీన్, విలేజ్‌మాల్స్

మంత్రి పత్తిపాటి పుల్లారావు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో త్వరలో అన్న క్యాంటీన్, చంద్రన్న విలేజ్ మాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి పత్తిపాటి పుల్లారావు తెలిపారు. పట్టణంలోని వీవర్స్ కాలనీలోని హైస్కూల్లో గురువారం 9వ వార్డు జన్మభూమి కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవి అధ్యక్షత వహించారు. మంగళగిరి ప్రాంతాన్ని ఐటిగా అభివృద్ధి చేయడానికి సిఎం చంద్రబాబు కృషిచేస్తున్నారని చెప్పారు. మంగళగిరి పట్టణంలో హౌస్‌ఫర్ ఆల్‌కు స్థలం సమస్య ఉందని ఈ సమస్యను త్వరలో పరిష్కరించి అందరికీ ఇళ్ళు నిర్మించి ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వికలాంగుల సంక్షేమసంఘం చైర్మన్ కోటేశ్వరరావు మాట్లాడుతూ వికలాంగుల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం మంత్రి పుల్లారావు పదో తరగతి విద్యార్థులకు చంద్రన్న విద్యాజ్యోతి పుస్తకాలను, లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, ఫించన్లు పంపిణీ చేశారు. చెంబు శవయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి.నాగేశ్వరరావు, టిడిపి నాయకులు మన్నవ సుబ్బారావు, వార్డు కౌన్సిలర్ ఉడతా శ్రీను, టిడిపి నాయకులు జి.ధనుంజయరావు, నందం అబద్దయ్య, కె.రాజా, జెవి.సుబ్బారావు, వల్లభనేనిసాయిప్రసాద్, సంకా బాలాజీగుప్తా తదితరులు పాల్గొన్నారు. తొలుత పట్టణంలో 8, 10, 11 వార్డుల్లో జన్మభూమి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ గంజి చిరంజీవి, కమిషనర్ ఎన్‌వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

ప్రజల అర్జీలు క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని జన్మభూమి నియోజకవర్గ ఇన్‌చార్జి, రిజిస్ట్రేషన్ కో-ఆపరేటివ్ సొసైటీ కమిషనర్ జె.మురళి అన్నారు. మండలంలోని చింతలపూడిలో సర్పంచ్ రాయపూడి సాంబశివరావు అధ్యక్షతన జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని అందువల్ల ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు కృషిచేయాలన్నారు. పేరుకలపూడి గ్రామంలో సర్పంచ్ గడ్డం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ స్వప్నిల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. చింతలపూడిలో 73, పేరుకలపూడిలో 182 అర్జీలు వచ్చాయి. అనంతరం జరిగిన కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు ఎన్‌టిఆర్ గృహాలకు శంకుస్థాపన చేశారు. ఎంపిపి చల్లపల్లి భారతిదేవి, జెడ్‌పిటిసి ఏళ్ల జయలక్ష్మీ, రెండు గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాలకు హాజరయ్యారు. పేరుకలపూడి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజగోపాల్, ఎంపిటిసి రాంబాబులు పాల్గొనగా చింతలపూడిలో ఎంపిటిసి తాడిబోయిన రాజేశ్వరి, ఈఓపిఆర్‌డి నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరిలో మాట్లాడుతున్న మంత్రి పుల్లారావు

సమస్యలపై నిలదీసిన సిపిఎం

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని 2,3,5 వార్డుల్లో గురువారం జన్మభూమి సభలు నిర్వహించారు. చైర్ పర్సన్ కె.మహాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి జన్మభూమి పేరుతో ముద్రించిన కరపత్రాలను పంపిణీచేశారు. మెడికల్‌క్యాంపు, వెటర్నరీ క్యాంపులు నిర్వహించారు. 2వ వార్డులో 45 అర్జీలు, 3వ వార్డులో 60 అర్జీలు, 5వ వార్డులో 68 అర్జీలు అధికారులు స్వీకరించారు. సభల్లో వైస్‌చైర్మన్ డి.రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు బి.వేణుగోపాలసోమిరెడ్డి, దాసరి ప్రమీలరాణి, ఎఈ ఎస్‌ఎస్ఆర్.కృష్ణారెడ్డి, ఎలక్ట్రికల్ ఎఈ నాగ మల్లేశ్వరరావు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రంథాలయ అధికారి వేమూరి విజయకుమార్ పాల్గొన్నారు.

కాగా సమస్యలపై ఆయా వార్డుల్లో సిపిఎం నాయకులు అధికారులను నిలదీశారు. 2వ వార్డు జన్మభూమి సభలో కరకట్ట రోడ్డు, ఆశ్రమం రోడ్డు వేయాలని, అర్జీలు అందజేశారు. 3, 5 వార్డుల్లో జన్మభూమి సభలో సబ్‌ప్లాన్ నిధులతోవేసిన రోడ్లు, డ్రెయిన్లు నాసిరకంగా ఉన్నాయని, సిపిఎం నాయకులు



తాడేపల్లి పట్టణంలో 3వ వార్డులో మాట్లాడుతున్న సిపిఎం కార్యదర్శి వై.బర్నబాసు

వై.బర్నబాసు, ఎస్ఆర్.ప్రసాద్, ఐ.ఇస్సాకు, ఈ.రామకృష్ణ, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. డ్రెయిన్లు లెవల్‌లేకపోవడం వల్ల ఎక్కడికక్కడ మురుగు నిలబడి పోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. పుష్కరాల సందర్భంగా రోడ్డు వెడల్పు పేరుతో ఇళ్ళు తొలగించిన వారికి వెంటనే ఇంటిస్థలం, ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిలయన్స్ మాల్స్ వద్దని, చౌక ధరల దుకాణాల ద్వారానే సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆంధ్రరత్న పంపింగ్‌స్కీమ్ నుండి ఎఆర్.కాలనీ వరకు తాగునీరు అందించాలని ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించాలని అర్జీలు ఇచ్చారు. నిత్యవసర సరుకులతోపాటు కిరోసిన్ కూడా అందివ్వాలని కోరారు. గతంలో హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు తీసుకున్న పేదల ఇళ్ళపట్టాలు తిరిగి ఇవ్వాలని అర్జీ అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, దొంతిరెడ్డి విజయభాస్కరరెడ్డి, మోదుగుల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మెల్లంపూడిలో : మండలంలోని మెల్లంపూడిలో గురువారం జన్మభూమిసభలు నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్, తహశీల్దార్ ఎం.పద్మనాభుడు, ఎంపిడిఒ బాలునాయక్, తాడేపల్లి ఎంపిపి కత్తిక రాజ్యలక్ష్మి రాఘవరావు, జెడ్‌పిటిసి శైలజారాణి, జిల్లా నాయకులు పఠాన్ కాశింఖాన్, సర్పంచ్ తమ్మపూడి పుష్పారాని, ఎంపిటిసి ఈదులమూడి శేఖర్ బాబు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎస్సీలకు శ్మశానవాటికకోసం స్థలం ఏర్పాటు చేయాలని, కెఎల్ యూనివర్సిటీ నుండి రేవేంద్రపాడు వరకు డబల్ రోడ్డు నిర్మించాలని, తెనాలి- విజయవాడ బస్సులను రేవేంద్రపాడు మీదుగా కెఎల్‌యు,తాడేపల్లి, విజయవాడ మీదుగా బైపాస్ నడపాలని అర్జీలు అందజేశారు. స్థానిక కాలనీలో రోడ్లు సరిలేవని పేదలు విజ్ఞప్తిమేరకు అధికారులు వెళ్లి పరిశీలించారు.



ఎగుమతికి సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

పెరిగిన ధాన్యం ధరలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకన్నా ధాన్యం ధరలు 75కేజీల బస్తాకు దాదాపు రూ.265లు పెరిగింది. ప్రభుత్వం రూ.1162.50పై. మద్దతు ధర ప్రకటించగా ప్రస్తుతం వ్యాపారులు యంత్రాలతో నూర్పిడిచేసిన ధాన్యం రూ.1300లకు, కూలీలు నూర్పిడిచేసిన ధాన్యం రూ.1425లకు కొనుగోలుచేస్తున్నారు. మండల కేంద్రం దుగ్గిరాల నుండి ఇతర జిల్లాలోని ధాన్యంమిల్లులకు, తమిళ నాడుకు ఎగుమతి చేస్తున్నారు. ఇంకా ధరలు పెరగ వచ్చునని కొనుగోలు డిమాండ్ బాగా ఉందని తెలిపారు. ధరలు పెరగడం, దిగుబడి కూడా బాగానే ఉండటంతో ఈ సంవత్సరం ఖరీఫ్‌లో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టిడిపి సభలా? జన్మభూమి కార్యక్రమాలా?

మంగళగిరి : పట్టణంలోని 9వ వార్డులోని వీవర్స్ కాలనీలో గురువారం జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి పత్తిపాటి పుల్లారావు, మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవి, గుంటూరు మార్కెట్‌యార్డు చైర్మన్ మన్నవ సుబ్బారావు తదితరులు హాజరయ్యారు. ఇంకా వేదికపై పట్టణానికి చెందిన పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు. వేదికపై ఒక్క అధికారీ కూడా లేకపోవడంతో ఇది జన్మభూమి కార్యక్రమా....లేక టిడిపి సభా....అని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానించారు. ఉపన్యాసం కూడా అంతా పార్టీ గురించే మాట్లాడినట్లుగా ఉందని వారు పేర్కొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

గిరిజన శంఖారావం కరపత్రం ఆవిష్కరణ

తాడేపల్లి : బోయలను ఎస్‌టి జాబితాలోచేర్చే ప్రతిపాదనకు వ్యతిరేకంగా బోయ ఎస్‌టి వ్యతిరేక పోరాట కమిటీ గురువారం 'గిరిజన శంఖారావం' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. 29వ తేదీన గుంటూరులో నిర్వహించనున్న శంఖారావానికి బోయలు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో బోయ ఎస్‌టి జాబితా వ్యతిరేక కమిటీ కన్వీనర్లు మూడావత్ విష్ణునాయక్, శివనాయక్, అనుముల వంశీకృష్ణ, కె.సుబ్బారావు, శ్రీరామ అశోక్, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణ మాదిగ అరెస్టు అప్రజాస్వామికం

ప్రజాశక్తి-మంగళగిరి

మంద కృష్ణ మాదిగ అరెస్టు అక్రమమని, అప్రజాస్వామికమని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎం.నాగయ్య, యు.బ్రహ్మయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అరెస్టుకు నిరస నగా ఈ నెల 29వ తేదీన జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేయాలని వారు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు మాదిగల ఓట్లతో అధికారంలోకి వచ్చి నమ్మకద్రోహానికి పాల్పడ్డాయని ఆరోపించారు.

ఆటలకు బ్రేక్

భావించారు. అయితే జన్మభూమి సభలు ఈనెల 2వ తేదీ నుండి ప్రారంభమై 11వ తేదీ వరకూ జరుగుతుండటంతో ప్రభుత్వ ఆదేశాలతో స్కూల్ గేమ్స్ వాయిదా వేసి పిఇటిలు కూడా జన్మభూమి సభల్లో పాల్గొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక జన్మభూమి సభల్లో అక్కడ హాజరయ్యే ప్రజలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు.

పరీక్షలపై కొరవడిన పర్యవేక్షణ

జన్మభూమి నిర్వహించే ప్రతి రోజూ పాఠశాలల్లో వ్యాసరచన, ఆటల పోటీలు, వక్తృత్వం వంటి ఏదో ఒక కార్యక్రమం నిర్వహించి, స్థానిక తహశీల్దార్ నిర్ధారణకు ఫొటోలను పంపించాలి. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు స్థానిక జన్మభూమి సభల్లో పాల్గొనాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో పాఠశాలల్లో ప్రస్తుతం అందరి దృష్టి ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను విజయవంతం చేయటంపైనే ఉంది. మండల స్థాయి అధికారుల నుండి జిల్లా స్థాయి వరకూ అధికారుల దృష్టి మొత్తం జన్మభూమి సభలపైనే ఉంది. దీంతో మార్చి 15వ తేదీ నుండి ప్రారంభం కానున్న పదో పరీక్షలపై సర్వత్రా ఆందోళన నెలకొన్నది. ఇటీవల నెలన్నర రోజులుగా 9వ తరగతి విద్యార్థులతోపాటు, ఉపాధ్యాయులకూ మరుగుదొడ్ల సర్వే డ్యూటీలు వేశారు. ఇప్పుడు జన్మభూమి సభలతో చదువులకు ఆటంకం ఏర్పడింది. విద్యేతర కార్యక్రమాలతో టెన్త్ పరీక్షల సన్నద్ధతపై తగిన శ్రద్ధ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జనవరి 11వ తేదీ వరకూ జన్మభూమి సభల హడావుడి కొనసాగుతుంది. ఆ తర్వాత వెనువెంటనే పాఠశాలలకు ఈనెల 20వ తేదీ వరకూ సంక్రాంతి సెలవులు ఉంటాయి. సెలవుల అనంతరం జోనల్ గేమ్స్ ప్రారంభించి, ఫిబ్రవరి మొదటి వారం వరకూ నిర్వహించాలని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. గేమ్స్ ముగిశాక ప్రిపరేషన్‌కు 25 రోజుల సమయం కూడా ఉండదు. దీంతో గేమ్స్‌లో పాల్గొనాల్సిన విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలో, క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలో తెలియక సతమతం అవుతున్నారు. జన్మభూమి సభలు, క్రీడా వాయిదా తదితరాల ప్రభావం ఈ ఏడాది పరీక్షలపై అధికంగా ఉంటుందని ఆ శాఖలో చర్చ నడుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జన్మభూమి సభలకు విద్యాశాఖను మినహాయించాలని కోరుతున్నారు.

జన్మభూమిలో సమస్యల ఏకరువు



ప్రజాశక్తి-కొల్లూరు

మండలంలోని ముసుపాడు, రావికంపాడు, బొద్దులూరుపాడు, తరిగిడిపాడు, గ్రామాల్లో గురువారం జన్మభూమి-మావూరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను అధికారుల ముందు ఏకరువు పెట్టారు. అధికారులను ముసుపాడు గ్రామ సర్పంచ్ తమ గ్రామ సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. గత నెల్లో గట్టువల్లి శ్యాం ప్రమాదవశాత్తు మరణించగా అతని కుటుంబానికి ఇప్పటి వరకు చంద్రన్న బీమా సహాయం అందలేదని ఎపిఎం కృపాసాగర్‌ను నిలదీశారు. అలాగే రేషన్ కార్డులో తప్పుగా నమోదైన పేరును మార్పించు కోవడానికి దరకాస్తు చేసుకోగా ఇంతవరకు రాలేదని తెలిపింది. రావికంపాడు గ్రామస్తులు కొల్లూరు వెళ్లుటకు రోడ్డు సరిగా లేదని వెంటనే రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు, కొల్లూరు మండల ప్రత్యేకాధికారి బాలశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నిజాంపట్నం

జన్మభూమి 5వ విడత కార్యక్రమంలో పలు ప్రమాదాల్లో మృతి చెందిన కేసన సాంబయ్య, సిహెచ్.వినయ్ కుమార్‌ల నామినీలు కె.ధనలక్ష్మి, సిహెచ్ ఎస్తేర్‌రాణిలకు మృతులకు చెందిన చంద్రన్న బీమా కింద రూ. 20 వేలు అందచేశారు. అలాగే ఉపకార వేతనాల కింద 84 మందికి 1 లక్ష 8 వేల రూపాయలు పంపిణీ చేశారు. పసుపు-కుంకుమ పథకం కింద 503 మందికి 50 లక్షల 30 వేల రూపాయలు అందచేశారు.

అధికారులే పనిచేయాలి

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు నేతృత్వంలో సంక్షేమ పథకాలు సమర్ధవం తంగా అమలవుతున్నాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 70 లక్షలు పింఛన్లు ఉండగా, నవ్యాంధ్రలోనే 50 లక్షల పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామస్థాయిలో సమస్యలపై 1100 టోల్‌ఫ్రీ నంబరులో సమాచారం ఇస్తే, సమస్యలకు తక్షణ పరిష్కారం లభిస్తుందన్నారు. అత్తోట పంచాయతీలో 5.74 కిలో మీటర్ల సీసీరోడ్లు, 9 కిలో మీటర్ల మేర డ్రెయిన్ల నిర్మాణం చేయాల్సి ఉందని, ఆరు నెలల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పంచాయతీ భవని నిర్మాణాన్ని చేపడతామన్నారు. గ్రామంలో 1824 మందికి రూ.4.12 కోట్ల మేర రుణమాఫీ అమలైందని చెప్పిన మంత్రి 2019లో టీడీపీని గెలిపించాలని కోరారు. కలెక్టర్ శశిధర్ మాట్లాడుతూ జిల్లాను ఓడీఎఫ్ జిల్లాగా ప్రకటించాలనే లక్ష్యంతో 2.83 లక్షల వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. సాంఘిక, గిరిజన సంక్షేమశాఖా మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పీపుల్స్ ఫస్ట్ అనే నినాదంతో పాలన సాగుతోందన్నారు. అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనతరం పొదుపు సంఘాలు వడ్డీలేని రుణాలు, రేషన్ కార్డులు, దుల్హన్ పథకం లబ్దిదారుకు రూ.50 వేల చెక్కును పంపిణీ చేశారు. వివిధ సంఘాలకు చెందిన డైరీ, కాలండర్‌ను లోకేష్ ఆవిష్కరించారు.

స్వచ్ఛగుంటూరు..మనవూరు-మనపరువు నినాదం ఆవిష్కరణ

జిల్లాను ఓడీఎఫ్ జిల్లాగా ప్రకటించేందుకు చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'స్వచ్ఛ గుంటూరు, మనవూరు-మనపరువు నినాదాన్ని మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎఎస్ రామకృష్ణ, ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, మైనారిటీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ జానీమూన్, రూరల్ ఎస్పీ సీహెచ్ వెంకట అప్పలనాయుడు, ఆర్డీవో జి.నరసింహులు, డీఎస్పీ ఎం.స్నేహిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలాజినాయక్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ కె.విజయమ్మ, దుగ్గిరాల యార్డు చైర్మన్ వంగా సాంబిరెడ్డి, బి.చినకోటిరెడ్డి పాల్గొన్నారు.

కాగితాల్లోనే!

(మొదటి పేజీ తరువాయి)

బందోబస్తు నిమిత్తం నియమించారు. తుళ్లూరు పోలీసు స్టేషన్ ప్రస్తుతం గుంటూరు రూరల్ ఎస్‌పి పరిధిలో ఉండగా తాడేపల్లి, మంగళగిరి మండలాలు మాత్రం గుంటూరు అర్బన్ పరిధిలో ఉన్నాయి. సిఎం నివాసం గుంటూరు అర్బన్ పరిధిలో ఉండటం వల్ల వీరు బందోబస్తు బాధ్యతలు చూస్తున్నారు. సచివాలయం, తుళ్లూరు మండలం గుంటూరు రూరల్ ఎస్‌పి, ఇతర అధికారులు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సిఎం క్యాంప్ ఆఫీసు నుంచి పాలన వ్యవహారాలు, ఇతర కార్యక్రమాలన్నీ విజయవాడ కమిషనరేట్ పరిధిలో నడుస్తున్నాయి. సిఆర్‌డిఎ ప్రాంతం మొత్తం ఒక కమిషనరేట్‌గా చేయాలనే ప్రతిపాదనూ గతంలో ఉన్నతాధికారులు చేశారు. దీనిపైనా అభ్యంతరాలొచ్చాయి. దీంతో అమరావతి కేంద్రంగా కమిషనరేట్ ఏర్పాటు కోసం విజయవాడ, గుంటూరు నగరాలను మినహాయించి ఇతర మండలాలు, మునిసిపాలిటీలు కలిపి ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉన్నట్లు తెలిసింది. రెవెన్యూ శాఖ నుండీ కొన్ని అభ్యంతరం వ్యక్తమయ్యాయి. ఒకే రెవెన్యూ జిల్లా పరిధిలో కమిషనరేట్ ఉండాలని ప్రతిపాదనలూ వచ్చాయి. ఈ నేపథ్యంలో సిఎం నివాసం, పరిసర గ్రామాల్లో బందోబస్తు వ్యవహారం గుంటూరు అర్బన్ పోలీసులకు కత్తిమీద సాములా మారింది. పలువురు ఆందోళన కారులు, అన్యాయానికి గురైన వారు ఆత్మహత్య యత్నానికి పాల్పడుతున్న ఘటనలూ పెరుగుతున్నాయి. అంతేగాక సిఎం నివాసం నుంచి ప్రకాశం బ్యారేజి వరకూ, కనకదుర్గమ్మ వారధి వరకూ అర్బన్ పోలీసు పరిధిలో ఉండటం వల్ల అధికారుల దృష్టి అంతా ఈ ప్రాంతంపై ఉంటోంది. దీంతో గుంటూరు నగరంపై వారు దృష్టి సారించడం లేదు. గుంటూరు అర్బన్ పరిధిలో ప్రస్తుతం సిబ్బంది తక్కువగా ఉన్నారని, పెంచాలని అధికారులు ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిసింది. ప్రస్తుతం అర్బన్ పరిధిలో 1440 మంది ఉన్నారని మరో 800 మంది నియమించాలని అర్బన్ ఎస్‌పి ప్రతిపాదించినట్లు సమాచారం. మరో వైపు రూరల్ పోలీసులు తరచూ తుళ్లూరు మండలంలో సిఎం, ఇతర విఐపిల పర్యటనకు జిల్లా మొత్తం కదలి వెళ్లాల్సి వస్తోంది. కమిషనరేట్ ఏర్పాటైతే వీరిపై ఒత్తిడి తగ్గుతుందని భావిస్తున్నారు. కానీ కమిషనరేట్ ఏర్పాటుకు ఇప్పటికిప్పుడు ప్రభుత్వం ఆమోదించే పరిస్థితి లేదు. జిల్లాల పునర్విభజన తరువాతే కమిషనరేట్‌కు గ్రీన్‌సిగ్నల్ వస్తుందని ఆశిస్తున్నట్టు ఒ పోలీస్ అధికా వ్యాఖ్యానించారు.

అధికారులపై ఫిర్యాదుల వెల్లువ

ప్రజాశక్తి-ఫిరంగిపురం

మండల కేంద్రమైన ఫిరంగిపురంలో గురువారం నిర్వహించిన ఐదో విడత జన్మభూమి కార్యక్రమంలో గ్రామస్తులు అధికారులపై అనేక ఫిర్యాదులతో స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌కు అర్జీలు సమర్పించారు. ముఖ్యంగా విజ్ఞానపురంలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్ విషయాన్ని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పలుమార్లు పింఛన్లకు దరఖాస్తు చేసుకున్న పింఛన్లు మంజూరు చేయడం పలువురు వృద్ధులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఇళ్ల స్థలాలు కేవలం టిడిపి కార్యకర్తలకే ఇస్తున్నారని పేర్కొన్నారు. రేషన్‌బియ్యం తీసుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బయోమెట్రిక్ విధానంలో కొంతమంది వృద్ధుల వేలిముద్రలు పడకపోవడంతో రేషన్ డీలర్ సంవత్సరం నుంచి బియ్యం ఇవ్వడం లేదని తెలిపారు. మరికొంతమంది మహిళలు ఇళ్లస్థలాలు లేక అద్దె ఇళ్లల్లో నివసిస్తున్నామని, అద్దెలు కట్టలేక ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్యేకు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలో ముఖ్యంగా ఇళ్ల సమస్యలు, తాగునీటి సమస్య, డ్రెయినేజీ సమస్యలు ఉన్నట్లు గుర్తించామని, ఇటీవల నిర్వహించిన ఇంటింటికీ టిడిపి ప్రచార కార్యక్రమంలో గ్రామంలోని పలు సమస్యలు తెలుసుకున్నామని చెప్పారు. ముఖ్యంగా డ్రెయినేజీ



ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

సమస్యను తీర్చేందుకు రూ.3.75 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశామని వెల్లడించారు. ఫిరంగిపురంలో 153 ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఆరోగ్యనగర్‌లో రోడ్లు వేసేందుకు రూ.50 లక్షలు కేటాయించామన్నారు. పేదల కోసం అనేక నిధులు, సంక్షేమ కార్యక్రమాలు టిడిపి ప్రభుత్వం చేపట్టిందన్నారు. విఆర్‌ఒ సంస్థ వసంతనగర్‌లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నెలకొల్పేందుకు 60 సెంట్ల భూమిని ఇచ్చిందన్నారు. అలాగే పలువురికి వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం సహాయ నిధి నుంచి రూ.2-3 లక్షల చెక్కులను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ పి. లక్ష్మీనరసింహం, ఎంపిడిఒ బి.శ్యామలాదేవి, ఎంపిపి అన్నమ్మ పాల్గొన్నారు.



చీరలు అందిస్తున్న ఎస్ఐ ఆనందరావు, తదితరులు

వృద్ధులకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-ఫిరంగిపురం

మండల కేంద్రమైన ఫిరంగిపురంలోని కంద్రిక మహిళా వృద్ధాశ్రమంలో విజ్ఞానపురం యూత్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ ఆనందరావు వృద్ధులకు చీరలు, పంచెలు పంపణీ చేశారు. వృద్ధాశ్రమంలో మొత్తం 26 మంది ఉన్నారని, వారిలో మహిళలు 19, పురుగులు 7 గురు ఉన్నారని చెప్పారు. ఆడవారికి చీరలు, మగవారికి లుంగీ, టవల్ ఇచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆనందరావు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. సేవాదృక్పథంతో చేసే పనులను తాను ప్రోత్సాహిస్తానని పేర్కొన్నారు.



పాఠశాలలను సందర్శించిన ప్రాజెక్టు ఆఫీసర్

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని కొండేపాడు ఎల్ఇ పాఠశాలను గుంటూరు సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్ సత్యవతి గురువారం సందర్శించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. టియల్‌యమ్ మెటీరియల్ ఉపయోగించి ఎలా విద్య బోధించాలి అనే అంశాన్ని ప్రధానోపాధ్యాయులు జి.చంద్రశేఖర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి రమాదేవి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరాడితేనే సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - పెదనందిపాడు



మాట్లాడుతున్న డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు

పోరాటం లేనిదే ప్రభుత్వాలు రైతు సమస్యలు పట్టించుకునేలా లేవని రైతు సంఘ నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు అన్నారు. బుధవారం రాత్రి కొల్లా వెంకయ్య గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన రైతు సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించాలని కోరుతూ తాము రైతు యాత్ర చేపట్టి 50 గ్రామాలలో సందర్శించి తెలుసుకున్న రైతు సమస్యలను ముఖ్యమంత్రికి వివరించుకునేందుకు కూడా ఇంతవరకు అవకాశం ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఈ సందర్భంగా గుంటూరు ఛానల్ పొడిగింపు విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 10వ తేదిన నిరాహారదీక్షలు చేపట్టేందుకు రైతులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం, ప్రజా నాయకులు ఈ విషయంలో స్పందించి న్యాయం చేయకపోతే 50 గ్రామాలకు చెందిన ప్రజలు సాగునీరు, తాగునీరు లేక అల్లాడిపోతున్నారని అన్నారు. ఇప్పటికైన అధికారులు, నాయకులు ఈ ప్రాంత రైతుల ఇక్కట్లు గమనించి గుంటూరు ఛానల్ పొడిగింపు విషయంలో సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పలువురు రైతు సంఘ నాయకులు ప్రభుత్వ విధానాల పట్ల ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ రాజమోహన్‌రావు వారిని సమన్వయపరచి శాంతియుతంగా పోరాటం చేద్దామని వారికి నచ్చచెప్పారు. సమావేశంలో నల్లమడ రైతు సంఘ కార్యదర్శి యార్లగడ్డ అంకమ్మచౌదరి, ముద్దన రాఘవయ్య, వేణు, శౌరిబాబు, ఆచార్యులు, జగన్నాధరావు, నాగేశ్వరరావు, వెంకటశివరావు పాల్గొన్నారు.



గుండెపోటుతో అచ్చంపేట వైసిపి మండల అధ్యక్షులు సత్యం మృతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

అచ్చంపేట వైసిపి అధ్యక్షులు సందెపోగు సత్యం(60) గుండెపోటుతో మృతి చెందాడు. అచ్చంపేట నుండి హైదరాబాద్ వెళ్లేందుకు గురువారం ఉదయం సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌కు వచ్చిన సత్యం ఒక్కసారిగా గుండెనొప్పి రావడంతో రైల్వేస్టేషన్‌లో కుప్పకూలిపోయాడు. ఇది గమనించిన రైల్వే సూపరిండెంట్ భావసింగ్‌నాయక్ 108కి సమాచారం ఇచ్చి ఫిట్స్ వచ్చాయనుకుని సపర్యలు చేశారు. అప్పటికే సత్యం మృతి చెందాడు. సత్యం హైదరాబాద్‌లో నాబార్డు ఏజిఎంగా పనిచేసి రిటైర్ అయ్యారు. స్వగ్రామం అచ్చంపేట అయినా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత వైసిపిలో చేరారు. అచ్చంపేటలో ఉంటూ మండల అధ్యక్షునిగా పార్టీ కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. మృతునికి నలుగురు పిల్లలు ఉన్నారు. వీరందరూ అమెరికాలో ఉంటున్నట్లు బంధువులు తెలిపారు. మృతుని జేబులో లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా బంధువులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న వైసిపి నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు అంబటి రాంబాబు, పెదకూరపాడు నియోజకవర్గ సమన్వయకర్త కావటి మనోహర్‌నాయుడు, మండల అధ్యక్షులు ఆర్.పురుషోత్తం, మండల యూత్ కన్వీనర్ కె.భాస్కరరెడ్డి, జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షులు సయ్యద్ మాబు, ఎస్సీసెల్ నాయకులు కె.దేవదాసు, ప్రభాకర్ రైల్వేస్టేషన్‌కు చేరుకుని సత్యం మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం బంధువులు మృతదేహాన్ని అచ్చంపేటకు తీసుకువెళ్లారు.

జన్మభూమి ప్రజా కార్యక్రమం కాదు : బొల్లా

ప్రజాశక్తి-ఈపూరు



మాట్లాడుతున్న బొల్లా

జన్మభూమి-మాఊరు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాదని టీడీపీ నాయకుల కోసం నిర్వహిస్తున్న కార్యక్రమం అని వినుకొండ వైసిపి నియోజకవర్గ కన్వీనర్ బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. కార్యక్రమంలో సమస్యలపై మాట్లాడేందుకు వచ్చిన వైసిపి నాయకులను బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలు నిజమైన నిరుపేదలకు అందటం లేదన్నారు. మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెట్టడమే ఎమ్మెల్యే జీవీ నైజం అనిదానిలో భాగంగానే ఇళ్ల స్థలలా, రేషన్‌కార్డుల కోసం ధరఖాస్తు చేసుకోవాలంటు ఆర్భాటంగా ప్రచారం చేయించారని అందులో నిజం లేదని అన్నారు.మరుగుదొడ్ల పేరుతో నాయకులు గ్రామాలలో లక్షలు దోచుకున్నారన్నారు.ఫించన్ల కోసం వృద్ధులు కార్యాలయాల వద్దకు వెళుతుంటే మానవత్వాన్ని మరిచిన అధికారులు మాత్రం జన్మభూమి కమిటీల ఆమోదం ఉంటేనే ఇస్తామనాటం సిగ్గుమాలిన పనిగా భావించాలన్నారు. నాలుగేళ్లుగా మండల కేంద్రమైన ఈపూరు పంచాయతీ సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేసి గ్రామాభివృద్ధిని అడ్డుకోవటం హేయమైన చర్యగా భావించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పతకమూరి పుల్లమ్మ,మండల కన్వీనర్ శాఖమూరి బుచ్చయ్య, జిల్లా ఎగ్జిక్యూటివ్‌లు గోనుగుంట్ల వెంకట హనుమయ్య, కోపెల దేవరాజ్, మండల యువజన నాయకులు కుమ్మెత శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ అమరేశం గోవిందు పాల్గొన్నారు.

పేదరికాన్ని దూరం చేసేది విద్యే : ఆర్ఐఒ రామచంద్రారావు

ప్రజాశక్తి-మాచర్ల

పేదరికం దూరం కావాలంటే చదువు ఒక్కటే మార్గమని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యాశాఖ అధికారి ఎస్.రామాచంద్రారావు అన్నారు. స్థానిక ఎస్‌కెబిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 22వ వార్షికోత్సం కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలలకు దీటుగా విద్యాబోధన అందిస్తున్న ప్రభుత్వ కళాశాల్లో విద్యార్థులు చేరాల్సిన అవసరం ఉందని అన్నారు. కళాశాల అధ్యాపకులు బోధన ఒక్కటే కాకుండా విద్యార్థులను మానసిక పరిపక్వతకు కృషి చేయడం హర్షిందగ్గ విషయమని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ టివి కోటేశ్వరరావు మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో 1965లో స్థాపించిన ఈ కళాశాల విద్యాకుసుమాలను వెదజల్లిందని అన్నారు. డిగ్రీ కళాశాలగా పల్నాడు ప్రాంతంలో ఎంతో మంది పేద విద్యార్థులకు విద్యనందించిందని అన్నారు. సువిశాలమైన ప్రాంగణం అనుభవం గల అధ్యాపకులు విద్యార్థులతో కలిసి మెలిసి చేస్తున్న సమిష్టి కృషి వల్ల కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ర్యాంకులు సాధిస్తున్నారని అన్నారు. కళాశాల ఆవరణలో మౌలిక సదుపాయాల ఏర్పాటులో ప్రభుత్వం సకాలంలో స్పందిచకపోయిన సొంత డబ్బుతో అవసరాలను సమకూర్చుతూ విద్యార్థులకు మెరుగైన విద్యనందిస్తున్నామని చెప్పటానికి ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు చేస్తున్న సహాయ సహకారాలు హర్షిందగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పోతురాజు, రౌటరీ క్లబ్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్, ప్రయివేటు కళాశాలల ప్రతినిధులు సాయి మార్కొండారెడ్డి, వెంకట్రామయ్య, జిల్లా పరిషత్ బాలుర పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జునరావు పాల్గొన్నారు.

చెంబుతో వినూత్నంగా శవయాత్ర



సత్తెనపల్లిలో డబ్బాలతో శవ యాత్ర చేస్తున్న గ్రామస్తులు



పిడుగురాళ్లలో గుంతలో పూడ్చి పెడుతున్న చెంబులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ప్రతి ఒక్కరూ చెంబును వీడి వ్యక్తిగత మరుగుదొడ్లు వాడుకోవాలని జన్మభూమి మాఊరు రాష్ట్ర కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్ కజూరియా గ్రామస్తులకు సూచించారు. మండలంలోని రెంటపాళ్లలో స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా మరుగుదొడ్ల వాడకంపై అధికారులు గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వినూత్నరీతిలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చెంబుతో శవయాత్ర చేసి శ్మశానంలో పాతిపెట్టారు. బహిరంగ మలమూత్రాల విసర్జన వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా తయారై రోగాలభారిన పడడమే కాకుండా జలాలు కలుషితమవుతాయని గ్రామస్తులకు వివరించారు. కర్రకు చెంబు, ప్లాస్టిక్ వాటర్‌బాటిల్స్ కట్టి భాజ భజంత్రీలతో గ్రామంలో ఊరేగించి స్మశానంలో పాతిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఎం. రామచంద్రరావు, సర్పంచ్ ఎం.శ్యామల భాస్కర్, ఎంపిటిసిలు, ఎంఇఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పిడుగురాళ్ళ : ఆరు బయట మలవిసర్జనుకు స్వస్తి పలకాలని పట్టణంలోని లెనిన్ నగర్‌లో మున్సిపల్ కమిషనర్, కాలనీవాసులు నీళ్ల డబ్బాలతో శవయాత్ర నిర్వహించారు. కమిషనర్ శివరామి రెడ్డి మాట్లాడుతూ ఎవరైన మరుగుదొడ్డి లేకపోతే త్వరగా కట్టించుకోవాలని ఆరు బయట మలవిసర్జన చేస్తే ఇకపై వారి నుండి రుసుము వసూలు చేస్తామని తెలిపారు. అనం తరం డబ్బాలను పూడ్చి పెట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చిన్న, సాంబయ్య, అధికారులు సుబ్బారావు, ప్రవీణ్, ఫోర్షియా పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం మున్సిపల్ కార్మికులకు పట్టణంలో ఎక్కడా చెత్త చెదారం కనిపిం చకుండా చేయాలని వారికి అందాల్సిన జీతాలు విడతల వారీగా అందిస్తామని అన్నారు. యూనిఫాం, పని సామాగ్రి అందిస్తామని కార్మికులు తప్పని సరిగా పనిలో పాల్గొన్నాలని వారికి ప్రస్తుతం నిర్వహిస్తున్న నాలుగు పూట్ల మస్టర్ విధానం రద్దు చేసి గతంలో మాదిరిగానే మస్టర్లు వేస్తామని తెలిపారు.



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డునందుకుంటున్న జవహర్‌రాణి

జవహర్‌రాణికి అభినందనలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

కొత్తపాలెం ప్రాథమిక పాఠశాల్లో ప్రధానోపాధ్యాయురాలుగా పని చేస్తున్న మక్కెన జవహర్‌రాణి విశాఖపట్నంలోని ఆంధ్రవిశ్వవిద్యాలయంలో సావిత్రీబాయిపూలే రాష్ట్ర స్థాయి ఉత్తమ మహిళా ఉపాధ్యాయురాలి అవార్డును మంత్రి గంటా శ్రీనివాసరావు ద్వారా అందుకున్నారు. బంగారు పతకంతో పాటు రూ.10 వేలు నగదు, ట్యాబ్ జవహర్‌రాణికి అందజేశారు. ఈ సందర్భంగా జవహర్‌రాణిని మండల విద్యాశాఖాధికారి బాలసుబ్రహ్మణ్యం, ఎస్టీయు రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహన్‌రావు, జిల్లా కార్యదర్శి జొన్నకూటి సుబ్బారావు, భాగ్యరాజు, పలువురు విద్యావనరుల కేంద్ర సిబ్బంది జవహర్‌రాణిని గురువారం అభినందించారు.

దళితుల శ్మశాన అభివృద్ధి కోసం ధర్నా

ప్రజాశక్తి - నరసరావుపేట

ఉప్పలపాడులో దళితుల శ్మశానాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వై.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మాలలు, వడ్డెర కులాలకు చెందిన శ్మశానాలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ముళ్ళకంపలతో నిండి రహదారులు లేక అల్లాడుతున్నారని, వర్షాలు వస్తే శవాలను తీసుకువెళ్లే పరిస్థితి కూడా లేదని తెలిపారు. అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోవడం లేదని తెలిపారు. ఎఒకు అర్జీ ఇచ్చారు. కార్యక్రమంలో జి.రామకృష్ణ, నల్లపాటి రామారావు, దరియావలి, గోదా జాన్‌పాల్, శిఖినం బాలయ్య, బాదుగున్నల శ్రీనివాసరావు, ఉన్నం రాణి, సీతారామయ్య, బాలయోగి పాల్గొన్నారు.

కోటీశ్వరుల క్లబ్‌లుగా మారిన చట్టసభలు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల

ప్రజాశక్తి-వినుకొండ

చట్టసభల్లో అధికశాతం కోటీశ్వర్లు, వ్యాపారులు ఉన్నారని, దీని వల్ల చట్టాలు వారికి అనుకూలంగా మారుతున్నాయే తప్ప పేదల సంక్షేమానికి చట్టాలు చేయటం లేదని, గత 10ఏళ్లలో కోటీశ్వర్లు లోక్‌సభ, రాజ్యసభ, అసెంబ్లిలలో రంగ ప్రవేశం చేయటం వలన నేడు చట్టసభలు కోటీశ్వర్ల క్లబ్బుల్లా మారాయని సిపిఐ రాష్ట్ర సహాయకార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక షాధీఖానాలో పట్టణ అద్యక్షులు పఠాన్ లాల్‌ఖాన్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన పట్టణ మహాసభలో ఆయన మాట్లాడారు. 543 ఎంపిల్లో నేడు 440 మంది కోటీశ్వర్లు ఉన్నారన్నారు. దీనివలన పేదలకు అవసరమైన చట్టాలు రావని, కోటీశ్వరులకు అనుకూలంగా చట్టాలు వస్తున్నాయన్నారు. పేద వర్గాల రాజ్యాస్థాపన ద్వారానే సమాజంలో సమగ్రమైన అభివృద్ధి జరుగుతుందని, అది కమ్యూనిస్టుల ద్వారా మాత్రమే సాధ్యపడుతుందని అన్నారు. జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ నరేంద్ర, చంద్రబాబు జోడీతో పేదవర్గాలపై ఆర్థిక, సామాజిక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని కమ్యూనిస్టులు ముందుకు సాగాలన్నారు.



మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

ప్రజాశక్తి
గుంటూరు
శుక్రవారం
5 జనవరి 2018



పుస్తక ప్రియుల పాదయాత్రలో పాల్గొన్న యార్లగడ్డ, ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీనివాస్, అభిమానులు


పుస్తక ప్రియుల పాదయాత్రలో వివిధ కవుల వేషధారణలో విద్యార్థులు


సివి సాహిత్యవేదికపై పుస్తకావిష్కరణలో పాల్గొన్న శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్

చాణక్య తంత్ర పుస్తకం ప్రతి ఒక్కరికీ ఉపయోగం

కృష్ణాజిల్లా పూర్వ కలెక్టర్ ప్రభాకరెడ్డి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ బి.వి.పట్టాభిరామ్ రచించిన 'చాణక్య తంత్ర' పుస్తకం ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే విధంగా ఉందని జిల్లా మాజీ కలెక్టర్ ప్రభాకరెడ్డి అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని స్వరాజ్య మైదాన్‌లో జరుగుతున్న 29వ పుస్తక మహోత్సవంలో పట్టాభిరామ్ రచించిన చాణక్య తంత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం సాయంత్రం జరిగింది. ఈపుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రభాకరెడ్డి మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా డాక్టర్ పట్టాభిరామ్ ఎన్నో పుస్తకాలు రచించారన్నారు. ఆయన రచనల ద్వారా ఎంతో మంది ఉత్తేజితులయ్యారని, ఎంతో మంది ఉన్నత రంగాలకు వెళ్లారన్నారు. ఇప్పటివరకు యువతకు, విద్యార్థులకు ఉపయోగపడే విధంగా అనేక రచనలు చేసిన ఆయన మొదటిసారిగా సమాజంలోని ప్రతిఒక్కరికీ ఉపయోగపడే విధంగా చాణక్యతంత్ర పుస్తకరం రచించారని ఈసందర్భంగా పట్టాభిరామ్‌ను అభినందించారు. సభకు అధ్యక్షత వహించిన ఎమెస్కో బుక్ సెంటర్ అధినేత విజయకుమార్ మాట్లాడుతూ సమాజంలో వ్యక్తి పరిపూర్ణత సాధించాలంటే సమాజపు మూల తాత్వికధోరణులను అర్థం చేసుకోవాలన్నారు. గతేడాది గాంధీజీ ఆత్మకథ సత్యాన్వేషణ ఆధారంగా డాక్టర్ బి.వి.పట్టాభిరామ్ మేజిక్ ఆఫ్ మహాత్మా అనే గ్రంథాన్ని రచించారన్నారు. ప్రపంచ సమాజ నిర్మాణంలో చాణక్యుని అర్థశాస్త్రం నిర్వహించిన పాత్ర ఎంత ముఖ్యమైనదో చెప్పడానికి అనేక ప్రపంచ భాషల్లోకి ఆగ్రంథం అనువదించబడటమే నిదర్శనమన్నారు. రాజులు, రాజ్యాలు పోయినా మన చుట్టూ కొత్త వ్యవస్థలు ఏర్పడుతున్నాయన్నారు. ఆ వ్యవస్థలకు చాణక్యుని సూత్రాలు అన్వయింప చేస్తూ ఈగ్రంథరచనను పట్టాభిరామ్ చేశారన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ బి.వి. పట్టాభిరామ్ మాట్లాడుతూ పుస్తకంలో తాను వివరించిన తంత్రాలు, చాణక్యుని రచనల్లో కొన్ని మాత్రమేనన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరికీ పనికి వచ్చేవి తీసుకున్నారన్నారు. మహామహోపాధ్యాయ ఆచార్య పుల్లెల శ్రీరామ చంద్రుడు వ్యాఖ్యాన గ్రంథంలోని శ్లోకాలను తీసుకున్నట్లు తెలిపారు. చాణక్యనీతి, అర్థశాస్త్రం పుస్తకాలు చదువుతుంటే ఇవి వ్యక్తిత్వ వికాసానికి, శిఖర నైపుణ్యాలు పెంపొందించుకోవాడానికి, ఎమోషన్లకు సరైన రీతిలో ప్రదర్శించడానికి దోహదపడే గ్రంథాలన్నారు. ఇలాంటి గ్రంథాలను రాయాలని ప్రోత్సహించిన ఎమెస్కోబుక్ హౌస్ అధినేత దూపాటి విజయకుమార్‌కు అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో టుబాకో బోర్డు సెక్రటరీ శ్రీధర్, పలువురు పుస్తకాభిమానులు పాల్గొన్నారు.

పుస్తక మహోత్సంలో నేడు...

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని స్వరాజ్య మైదాన్‌లోని పుస్తక మహోత్సవ్ ప్రాంగణంలో శుక్రవారం జరిగే కార్యక్రమాలు

- మధ్యాహ్నం 3 గంటలకు సి.వి. సాహిత్య వేదికపై "కథ" అనే అంశంపై సదస్సు.
- సాయంత్రం 6 గంటలకు సి.వి. సాహిత్య వేదికపై 'రసాయన మూలకాల రహస్యాలు, కుప్పిలి పద్మ కథలు' పుస్తకాలు ఆవిష్కరణ.
- రాత్రి 7 గంటలకు సాహితీ మిత్రులు విజయవాడ వారి ఆధ్వర్యంలో 'ఇంటిపేరు ఇంద్రగంటి' పుస్తకావిష్కరణ
- రాత్రి 8 గంటలకు సి.వి. సాహిత్య వేదికపై మల్లెతీగ వారి 'లాకర్ నెంబర్ 369' పుస్తకావిష్కరణ
- సాయంత్రం 6 గంటలకు పుస్తక మహోత్సవ్ ప్రాంగణంలోని అబ్దుల్ కలామ్ ప్రతిభా వేదికపై క్విజ్ పోటీలు


చాణక్య తంత్ర పుస్తకావిష్కరణలో ప్రభాకరరెడ్డి, ఐఎఎస్ అధికారి శ్రీధర్‌బాబు

నాల్గోరోజూ ఉత్సాహంగా సాగిన పుస్తక సంబరాలు


పుస్తక ప్రియుల పాదయాత్రను ప్రారంభిస్తున్న సీనియర్ పాత్రికేయులు వెంకటనారాయణ, తదితరులు


మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు బివి.పట్టాభిరామ్

గ్రంథ పఠనంతోనే వికాసం

ప్రముఖ పాత్రికేయులు ఎస్.వెంకటనారాయణ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

గ్రంథ పఠనం ద్వారానే వికాసం, వివేకం కలుగుతాయనీ, పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని ప్రముఖ పాత్రికేయులు ఎస్.వెంకటనారాయణ అన్నారు. స్వరాజ్య మైదానంలో విజయవాడలో ఏర్పాటుచేసిన 29వ పుసక సంబరాల కార్యక్రమంలో సి.వి.సాహిత్య వేదికపై గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రయంలో ముఖ్యఅతిథిగా హజరైన ఆయన మాట్లాడారు. శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానం సంవత్సరానికి లక్ష కాపీలు అమ్ముడయ్యాయంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఏటేటా 300 పుస్తకాలు ప్రచురించడం ద్వారా తెలుగు భాషకు విశాలాంధ్ర ఎనలేని సేవలందిస్తోందన్నారు. పుస్తకాలు చదవటాన్ని పిల్లలకు అలవాటుగా మారేలా పెద్దలు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇంటర్నెట్ సోషల్ మీడియాలో దూసుకుపోతున్న ఈ కాలంలో ప్రచురణకర్తలు ఎంతో సాహసంతో కొత్త పుస్తకాలు వెలుగులోకి తీసుకురావటం అభినందించదగిన విషయమన్నారు. తెలుగు గ్రంథాల ప్రచురణలో విశాలాంధ్ర బుక్‌హౌస్ చాలా పెద్దదన్నారు. సభకు అధ్యక్షత వహించిన శాసనసభ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పుస్తక ప్రదర్శనలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సాంస్కృతికశాఖ ద్వారా రూ.50 లక్షలను ఇచ్చి ప్రోత్సహించిందన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఈ ప్రదర్శనలు ఏర్పాటు అలోచిస్తున్నామన్నారు. గత సంవత్సరం నుంచి పుస్తక వైపు ప్రజలను మళ్లించటానికి ఎన్టీఆర్ ట్రస్ట్ ముందుకు వచ్చి వారి సహాయ సహకారాలను అందిచటం అభినందించదగ్గ విషయమన్నారు. రకరకాల గ్రంథాలు చదవటం ద్వారానే మంచి వ్యక్తిత్వం, మేధస్సు వస్తాయన్నారు. ప్రతి సంవత్సరం మంచి గ్రంథాలు ముద్రితమవుతున్నాయన్నారు. అనువాత గ్రంథాలు వస్తున్నాయని ఇది శుభపరిణామమన్నారు. ఆంధ్రజ్యోతి పత్రిక సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పుస్తకానికి పర్యాయపదం విజయవాడ అని అన్నారు. భాషా, సాహిత్యాబివృద్ధికి ఉభయ తెలుగు రాష్ట్రాలు కృషి చేయాలన్నారు. భాషా, సాహిత్యాభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. సాహిత్య వేత్త పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ భాషా, సంస్కృతికి విశేష కృషి చేసినవారు మాత్రమే చరిత్రలో నిలిచివుంటారన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను పుస్తక మహోత్సవాలకు తప్పక తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త శ్రీనివాసులు, ఎన్టీఆర్ ట్రస్ట్ సభ్యులు పెద్ది రామారావు, ఎమ్మెస్కో అధినేత విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యలపై సమరశంఖం

జిల్లా సమగ్రాభివృద్ధిపై విస్తృత చర్చలు

రేపటి నుంచి సిపిఎం జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రజా సమస్యలపై నిరంతర పోరుబాటలో సుదీర్ఘ కాలంగా సాగుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) (సిపిఎం) గుంటూరు జిల్లా 23వ మహాసభలను శని, ఆదివారాల్లో నిర్వహించుకోనుంది. గుంటూరు నగరంలోని గడ్డిపాటి కల్యాణ మండపం (సింహాద్రి శివారెడ్డి నగర్) వేదిక కానుంది. ప్రతి మూడేళ్లకు ఒకసారి జిల్లా మహాసభలు నిర్వహిస్తారు. గత మూడేళ్ల కాలంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలను సమీక్ష చేసి భవిష్యత్ కర్తవ్యాలపై ఈ మహాసభల్లో చర్చిస్తారు. గత మూడేళ్ళలో ఏర్పడిన అననుకూల రాజకీయ పరిణామ నేపథ్యంలో పాలక వర్గాలు నూతన ఆర్థిక సంస్కరణలు అమలు ద్వారా ప్రజల్లో వస్తున్న అసంతృప్తిని బహిర్గతం కాకుండా సంక్షేమ పథకాలతో సరికొత్త ఆశలు రేకిత్తిస్తున్న నేపథ్యంలో ప్రజా సమస్యలపై పోరాటానికి ఈ మహాసభల్లో చర్చించనున్నారు. కులతత్త్వం, మతత్త్వం, ప్రాంతీయ తత్త్వం రెచ్చగొట్టడం పాలక పక్షాలకు పరిపాటిగా మారింది. ప్రజల్లో అసంతృప్తిని ఉద్యమ రూపంలో రాకుండా చూసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయినా సిపిఎం గత మూడేళ్లలో అనేక ఉద్యమాలు నిర్వహించింది.

పేదల భూములను రక్షించేందుకు పోరాటం

నీరు-చెట్టు పేరుతో అధికార పార్టీ నాయకులు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడి పేదల సాగుభూములను పెద్ద కొల్లగొట్టేందుకు ప్రయత్నించారు. భూమిలోని మట్టిని అమ్ముకుని కోట్లు గడించారు. అధికార పార్టీ నాయకుల ఆగడాలను అడ్డుకునేందుకు సిపిఎం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించింది. చిలకలూరిపేట నియోజకవర్గంలో ప్రారంభమైన ఉద్యమం, మంగళగిరి, పెదకూరపాడు, సత్తెనపల్లి ప్రాంతాల్లో కొనసాగింది. నాదెండ్ల మండలం గురిజవోలు గ్రామంలో 90 ఎకరాల చెరువును తవ్వేందుకు అధికార పార్టీ నాయకులు చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారు. తూబాటలోనూ చెరువు భూమిని కబ్జా యత్నాలను సిపిఎం నాయకులు అడ్డుకున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో అచ్చంపేట మండలం కొండూరు, బెల్లంకొండ మండలం నందిరాజుపాలెంలో టీడీపీ నాయకులు పేదల భూములను ఆక్రమించారు. కొండూరులో పేదల భూముల్లోనే టీడీపీ నాయకులు పంటలు వేయగా, వాటిని స్వాధీనం చేసుకుని పేదలు ఈ పంటలను కోసేవిధంగా సిపిఎం నాయకులు వెన్నుదన్నుగా నిలిచారు. నందిరాజుపాలెంలో 50 ఎకరాల్లో పేదలకు చెందిన భూముల్లోకి వెళ్లి సాగుకు సిద్ధం చేశారు. చిలకలూరిపేట మండలం యడవల్లిలో 416 ఎకరాలను 1975లో అప్పటి కలెక్టర్ కత్తి చంద్రయ్య పేదలకు ఏకపట్టాగా సాగు భూములను పంపిణీ చేశారు. ఈ భూముల్లో గ్రానైట్ నిక్షేపాలున్నాయని స్వాధీనం చేసుకునేందుకు టిడిపి నాయకులు ప్రయత్నించారు. సాగుదారుల సభ్యులుగా ఉన్న సొసైటీని రద్దు చేయించి, స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా సిపిఎం నాయకులు ఉద్యమాలు నిర్వహించి అడ్డుకున్నారు.

దళితుల సమస్యలపై అధ్యయనం

జిల్లాలో పలు సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. దళితుల సమస్యలపై గ్రామాల వారీగా అధ్యయనం చేశారు. వివిధ సామాజిక తరగతుల ప్రజలకు శ్మశాన స్థలాలు లేవని, గతంలో మంజూరు చేసిన స్థలాలు పల్లంలో ఉన్నాయని, వాటిని మెరక చేయాలని కోరుతూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దళిత వాడలో మౌళిక వసతలు, కులవివక్ష, అంటరాని తనం, శ్మశానాలు లేకపోవటం, ఉన్నా అవి ఆక్రమణలకు గురవటం తదితర అంశాలపై పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహించారు. గతేడాది ఆగస్టు 1 నుంచి 14 వరకు సామాజిక చైతన్య యాత్రలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక సమస్యలపై అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి కృషి చేశారు.

రైతుల కోసం ఆందోళనలు

ప్రత్యేక హోదా సాధన కోసం దశల వారీగా ఆందోళనలు నిర్వహించారు. అనంతపురం, అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం వల్ల భూములు కోల్పోయే వారికి 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని ఆందోళనలు నిర్వహించి, ప్రభుత్వంపై ఒత్తిడి చేసేందుకు రైతులను సమాయత్తం చేశారు. కౌల్దార్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సకాలంలో పంట రుణాలివ్వాలని పలుమార్లు ఆందోళనలు నిర్వహించి, బ్యాంకులను ముట్టడించారు. రాజధాని ప్రాంతంలో భూసమీకరణకు వ్యతిరేకంగా లంక భూములు, అసైన్డ్ భూములకు సాధారణ పట్టా భూముల రైతులతో సమానంగా ప్యాకేజి ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులకు రూ.9వేలు పెన్షన్ ఇవ్వాలని, బలవంతపు భూసేకరణ నిలిపివేయాలని దాదాపు రెండున్నరేళ్లు ఉద్యమించారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణాల తొలగింపులో విజయం

మద్యం విక్రయాలను నియంత్రించాలని, ప్రజల నివాసాల మధ్య దుకాణాలను ఎత్తివేయాలని డిమాండు చేస్తూ సుదీర్ఘ పోరాటం నిర్వహించారు. ఈ పోరాటంలో విజయం సాధించి నివాసిత ప్రాంతాల మధ్య మద్యం దుకాణాలను ఎత్తివేయించగలిగారు. దీంతో మహిళలు ఊపరిపీల్చుకున్నారు.



వివిధ అంశాలపై పోరుబాట

కార్మిక రంగంలో అసంఘటిత రంగ కార్మికులు, స్కీమ్ వర్కర్ల సమస్యలపై పలుమార్లు ఆందోళనలు నిర్వహించారు. స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు పెరిగాయి. వీటిపై ఆందోళనలు కొనసాగాయి. రవాణ, భద్రత, భవన నిర్మాణ కార్మికుల సంబంధించి వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగించారు. విద్యార్థుల సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటాలను నిర్వహిస్తున్నారు. విద్యార్థుల ఆత్మహత్యలపై తక్షణమే స్పందిస్తున్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆర్కిటెక్చర్ విద్యార్థిని రిషితేశ్వరి మరణంపై పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ ఎత్తివేతను విరమించుకోవాలని, మెస్ చార్జీలను పెంచాలని ఆందోళనలు కొనసాగించారు. నిరుద్యోగ సమస్యలపైనా పోరాటాలు కొనసాగాయి. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీలను కొనసాగించాలని కోరుతూ పెద్దఎత్తున ఉద్యమించారు. గుంటూరులో జ్యూట్‌మిల్లును తెరపించేందుకు సిపిఎం నేతలు రాజీలేని పోరాటాలను నిర్వహించారు.

సమస్యలపై చైతన్య యాత్రలు

ఇళ్ల స్థలాల సమస్యలపై జిల్లా వ్యాప్తంగా పలుమార్లు ఆందోళనలు నిర్వహించారు. జిల్లాలో రెండు లక్షల కుటుంబాలకు సొంత ఇల్లు లేక ఇళ్ల స్థలాల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మరో రెండు లక్షల మంది పట్టాలు లేక అల్లాడుతున్నారు. ఈ రెండు అంశాలపై పలుమార్లు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆందోళనలు నిర్వహించారు. 2015లో కలెక్టరేట్‌ను ముట్టడించారు.

కొనసాగుతున్న భూ పోరాట కేంద్రాలు

పలుప్రాంతాల్లో భూపోరాట కేంద్రాలు ఏర్పాటయ్యాయి. గుంటూరులో ప్రగతినగర్, సుందరయ్య నగర్, పెదకాకాని, పిడుగురాళ్ల, నంబూరు, వినుకొండ, మంగళగిరి తదితర ప్రాంతాల్లో భూపోరాట కేంద్రాలు కొనసాగుతున్నాయి. 2007లో భూ పోరాటం సందర్భంగా సిపిఎం అండదండలతో పది కేంద్రాల్లో భూ పోరాటాల ద్వారా ఇళ్ల స్థలాలను ఇప్పించారు. వాటిని నేటికి క్రమబద్ధీకరించలేదు.

భవన నిర్మాణ కార్మికులకు పరిహారం కోసం ఉద్యమం

సచివాలయంలో నిర్మాణాలకు దేవేంద్ర అనే కార్మికుడు మరణించగా సిపిఎం నాయకులు పెద్దఎత్తున ఉద్యమాలు చేశారు. గుంటూరులోని లక్ష్మీపురం జంక్షన్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్న స్థలంలో మట్టిపెళ్లలు విరిగిపడి ఏడుగురు కూలీలు దుర్మరణం పాలైన ఘటనలోనూ ఆందోళనలు నిర్వహించారు. ఈ రెండు ఘటనల్లో ఒక్కొక్కరికి రూ.20 లక్షలు పరిహారం వచ్చేలా కృషి చేశారు.

వామపక్ష ప్రజాతంత్ర, లౌకిక శక్తుల ఐక్యత కోసం కృషి

జిల్లాలో వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తుల ఐక్యత కోసం కృషి చేస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు తెలిపారు. సిపిఎం జిల్లా మహాసభల్లో జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రధానంగా చర్చిస్తామని ఆయన చెప్పారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన కార్యక్రమాలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.


పాశం రామారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి

అమ్మో... డంపింగ్ దుర్వాసన

ప్రజాశక్తి - తాడేపల్లి

సీడ్ క్యాపిటల్‌లో భాగమైన పెనుమాక ప్రాథమిక సహకార సంఘం సొసైటీలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదేదో పై అధికారుల నుండి వచ్చిన ఇబ్బంది అనుకుంటే తప్పులో కాలేసినట్లే. గ్రామంలోని చెత్తనంతా తీసుకొచ్చి సొసైటీ కార్యాలయం సమీపంలో చెరువు ఒడ్డున డంపింగ్ చేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతుందని సొసైటీ సిబ్బంది వాపోతున్నారు. దీనికితోడు అక్కడ డంపింగ్‌చేసిన చెత్తకు నిప్పు పెట్టడంతో వచ్చే పొగతో సొసైటీ కార్యాలయంలోకి ఖాతాదారులు రావడంలేదని చెబుతున్నారు. పొగ కార్యాలయంలోకి రావడంతో తాము విధులు నిర్వర్తించడానికి కూడా ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు. సొసైటీ సమీపంలోని పెద్దఎత్తున చెత్త పోగడంతో పందులు, కుక్కలు ఆ ప్రాంతంలో స్వైరవిహారం చేస్తున్నాయని అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. వీటితోపాటు కోతులు బెడదకూడా ఎక్కువైందని ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు ఉన్న సమయంలో అయితే తలుపులు వేసుకొని బిక్కుబిక్కుమంటూ కూర్చొని విధులు నిర్వర్తించాల్సి వస్తుందని అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని పెనుమాక సొసైటీ సమీపంలో వేస్తున్న చెత్తడంపింగ్‌ను నిలుపుదలచేయాలని కోరుతున్నారు.

భూసేకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణకు నిర్ణయం

ప్రజాశక్తి - తాడేపల్లి



మాట్లాడుతున్న కె.ఈశ్వరరెడ్డి

రాజధాని అమరావతిలో సీడ్ క్యాపిటల్‌లో భాగమైన ఉండవల్లిలో ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేయాలని భూపరిరక్షణ కమిటీ నిర్ణయించింది. ఈసందర్భంగా పరిరక్షణ కమిటీ నాయకులు కొర్రపోలు జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం బలవంతంగా రైతుల నుండి భూములు తీసుకోమని గతంలో చెప్పి నేడుమాట తప్పిందని విమర్శించారు. సారవంతమైన ఈ భూములను నమ్ముకొని చిన్నసన్నకారు రైతులే అధికంగా ఆధారపడి ఉన్నారని పేర్కొన్నారు. పరోక్షంగా ఈ భూములపై 2వేలమంది వ్యవసాయ కార్మికులు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. సిఆర్‌డిఎ చట్టంలోపేర్కొన్న వివిధ క్లాజుల ప్రకారం ఉండవల్లి, పెనుమాక గ్రామాల్లో మూడు పంటలు పండే భూములు తీసుకోవడానికి వీల్లేదని చట్టమే చెబుతుందని వివరించారు. ప్రభుత్వమే చట్ట ఉల్లంఘనకు పాల్పడితే తామేమి చేయాలని ప్రశ్నించారు. అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి ఇక్కట్ల పాలు కావద్దని కోరారు. ఇందుకోసం బాధిత రైతుల నుండి పెద్దఎత్తున సంతకాలు సేకరణ చేసి ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. అప్పటికైనా ఈ ప్రభుత్వం మంచిగా ఆలోచించి రైతులకు న్యాయం చేస్తుందని ఆకాంక్షించారు.

తీరిన చిరకాల స్వప్నం

ప్రజాశక్తి - దుగ్గిరాల



ప్రారంభమైన బస్సు సర్వీసు

మండలంలోని వీర్లపాలెం, పెదకొండూరు, గొడవర్రు గ్రామాలతోపాటు కృష్ణానది పరీవాహక ప్రాంతాల ప్రజల చిరకాల స్వప్నం తీరింది. విజయవాడ నుండి రేపల్లె వరకు కరకట్టమీదుగా బస్సులు వేయాలని, వారు అనేకసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తులు చేస్తున్నారు. గురువారం విజయవాడ నుండి రేపల్లె వరకు ఆర్‌టిసి బస్సు సర్వీసు ప్రారంభించారు. ప్రస్తుతం విజయవాడ నుండి పెదకొండూరు వరకు రూ.13, గతంలో విజయవాడ వెళ్ళాలంటే దాదాపు రూ.40ల వరకు ఖర్చు పెట్టవలసి వచ్చేది. ఇందుకు మూడు ట్రిప్పులు తిరుగుతుందని అధికారులు తెలిపారు.



లోకేష్‌కు చెక్కును అందిస్తున్న జెడ్పీటిసీ జయలక్ష్మి దంపతులు

రాజధానికి విరాళం

ప్రజాశక్తి-తెనాలిటౌన్

నవ్యాంధ్ర రాజధాని నిర్మాణానికి రూ.లక్ష చెక్కును విరాళంగా తెనాలి జెడ్పీటీసీ సభ్యురాలు అన్నాబత్తుని జయలక్ష్మి దంపతులు గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్‌కు అందించారు. కొల్లిపర మండలం అత్తోటలో గురువారం జరిగిన జన్మభూమి-మావూరు కార్యక్రమంలో చెక్కును అందించి, లోకేష్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, కావేటి సామ్రాజ్యం, వంగా సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరసనలు, నిలదీతల మధ్య 'జన్మభూమి'

- యర్రబాలెంలో సమస్యలపై అధికారులను నిలదీసిన ప్రజలు, సిపిఎం
- సమాధానం చెప్పకుండా వెనుదిరిగివెళ్లిన అధికారులు
- పెన్షన్ ఇవ్వడంలేదంటూ శాపనార్థాలు పెట్టిన మహిళలు



జన్మభూమి సభలో అధికారులను నిలదీస్తున్న సిపిఎం నేత ఎం.రవి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాజధాని గ్రామమైన యర్రబాలెంలో పేదలు నివసిస్తున్న బసవతారకనగర్ ఎస్‌సి ఎస్‌టి కాలనీలను అభివృద్ధి చేయకుండా వాటిపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని, పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, జన్మభూమి సభలు రాజకీయ ప్రచారానికా, సమస్యల పరిష్కారానికా అని రాజధాని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి ప్రశ్నించారు. గురువారం నాడు యర్రబాలెం గ్రామంలో మంగళగిరి తహశీల్దార్ వసంతకుమార్ అధ్యక్షతన జరిగిన జన్మభూమి సభలో సమస్యలపై ప్రజలు అధికారులను నిలదీశారు. సమాధానం చెప్పలేక అధికారులు వెనుదిరిగి వెళ్ళిపోయారు. సమస్యలు తెలిపేందుకు ప్రజలకు మైకు ఇవ్వడమేకాకుండా తెలుగుదేశం జిల్లా నేత మన్నవ సుబ్బారావు ప్రతిపక్ష పార్టీలపై అవాకులు, చావాకులు పేలారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఇవ్వాల్సిన సామాజిక పెన్షన్లను నిలిపివేశారని, గత జన్మభూమిలో ఇచ్చిన అర్జీలను ఎన్ని పరిష్కరించారో తెలపాలని డిమాండ్ చేశారు. యర్రబాలెం ప్రజలకిచ్చిన హెల్త్‌కార్డులు ఏ ఒక్కరికీ ఉపయోగపడటంలేదన్నారు. విజయవాడకు బస్సు సౌకర్యం ఎత్తివేయడాన్ని తప్పుబట్టాడు. యర్రబాలెం చెరువును సుందరీకరించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటుచేయాలన్నారు. రాజధానిలో భూములు కోల్పోయిన వారికి ఎటువంటి ఉపాధి చూపలేదన్నారు. అలాగే ఇళ్ల నిర్మాణంలో మోసపూరిత మాటలు చెబుతున్నారన్నారు.గ్రామంలో ప్రమాదాలకు కారణమవుతున్న ఇసుక లారీలను నియంత్రించాలని కోరినందుకు గ్రామస్తులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణం ఎత్తివేయాలని డిమాండ్‌చేశారు.

డివైఎఫ్ఐ రాజధాని డివిజన్ నాయకులు కె.సుందరయ్య, వైసిపి నేత బుజ్జి, మాట్లాడుతూ కేజీ టు పిజి వరకు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ మా గ్రామంలో ఒక్కరికైనా ఇచ్చారా సిఆర్‌డిఎ అధికారులను నిలదీశారు. ఇప్పుడు అప్పుడు అంటూ కాలయాపన చేయడం తప్పా ఫీజులు ఎందుకు చెల్లించరని అడిగారు. గ్రామంలో ఉన్న గ్రంథాలయాన్ని పడగొట్టి తిరిగి నిర్మించకుండా గ్రంథాలయ పన్ను ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు.

పెన్షన్లు, రేషన్‌కార్డులకొరకు అనేకసార్లు అర్జీలు పెట్టినా ఇదిగో అదిగో అంటూ తిప్పుతున్నారు గానీ తమకు ఎందుకు ఇవ్వడంలేదని ప్రజలు ఒక్కసారిగా వేదిక వద్దకు వచ్చి అధికారులను నిలదీయడంతో సమాధానం చెప్పలేక వెనుదిరిగి వెళ్ళిపోయారు. తెలుగుదేశం నాయకులు ఆకుల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ ప్రథమ పౌరుడు సభలోపాల్గొనపోవడం దురదృష్టకరమని అన్నారు. ఈ సభలో జెడ్పిటిసి ఆకుల జయసత్య, మండల ఉపాధ్యక్షులు మొసలి పకీరయ్య, చావలి ఉల్లయ్య, ఎంపిటిసిలు సుధాహనుమాయమ్మ, వార్డు సభ్యులు, ఇతర అధికారులు,సిపిఎం గ్రామ కార్యదర్శి అత్తలూరి వీరవెంకయ్య, నాయకులు గడ్డం కాంతారావు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో ధ్వంసమవుతున్న రోడ్లు

ప్రజాశక్తి-తుళ్ళూరు



శాఖమూరులో 'స్వచ్ఛసేవ' ర్యాలీ

రాజధాని రోడ్ల నిర్మాణం కారణంగా భారీవాహనాల రాకపోకలు పెరిగాయని. దీంతో మండల కేంద్రం తుళ్ళూరుకు అనుసంధానంగా నిర్మించిన రోడ్లు ధ్వంసమవుతున్నాయని శాఖమూరు గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. భారీ వాహనాల రాకపోకలకు ప్రత్యామ్నాయంగా పొలాల్లో రోడ్లు నిర్మించుకోవాలని కోరారు. గురువారం రాజధాని ప్రాంతం, తుళ్ళూరు మండలంలోని శాఖమూరు గ్రామంలో తహశీల్దార్ ఎం పూర్ణచంద్రరావు నేతృత్వంలో అధికారుల బృందం 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా గ్రామస్థులు పలు సమస్యలను ప్రస్తావించారు.గ్రామంలో మురుగునీటి సమస్య ఉందని, పరిష్కరించాలని కోరారు.గృహ అవసరాలకు వినియోగించే నీరు పాచిపట్టి దుర్గంధం వేస్తోందని చెప్పారు.వైఎస్సాఆర్‌సిపి యువజన విభాగం నాయకులు బెజ్జం రాంబాబు మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో విద్యార్థులకు ఫీజురీయింబర్సుమెంటు ఇప్పటివరకు అమలుచేయలేదన్నారు.చెరువునీటి వల్ల ఎలర్జీ వస్తోందని అనడంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది.రాంబాబుకు,టిడిపి ఎస్సీసెల్ నాయకులు తలతోటి సురేంద్ర మధ్య వాగ్వివాదం జరిగింది. గ్రామస్థులు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. తొలుత గ్రామంలో' స్వచ్ఛసేవ' ర్యాలీ జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంఈవో జి.కోటేశ్వరరావు,ఈవోపీఆర్‌డీ నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ తుమ్మూరు వరప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆర్దల సదాశివరావు,తుళ్ళూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి దివ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు. వెలగపూడిలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో 9,10,ఇంటర్, పాలిటెక్నిక్ విద్యార్థులు 115 మందికి రూ1200 చొప్పున ఉపకారవేతనాలు, డ్వాక్రా మహిళలకు రుణాలు పంపిణీ చేశారు.

7వ తేదీన 'సూర్యుడిని నెత్తికెత్తుకొని' గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి-కార్పొరేషన్

జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7న సాయంత్రం 6.30 గంటలకు డాక్టర్ రావి రంగారావు రచించిన 'సూర్యుడిని నెత్తికెత్తుకొని' గ్రంథావిష్కరణ జరుగుతుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.సుభాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బృందావనగార్డెన్స్‌లోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై గ్రంథావిష్కరణ సభ ఉంటుందన్నారు. సభకు కవి, రచయిత డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షత వహిస్తారని, ముఖ్య అతిథిగా సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. సాహితీవేత్త సోమేపల్లి వెంకటసుబ్బయ్య, విజయలక్ష్మీ దంపతులు గ్రంథ స్వీకరణ చేస్తారని, డాక్టర్ రెంటాల వెంకటేశ్వరరావు గ్రంథ సమీక్ష చేస్తారన్నారు. డాక్టర్ నల్లపనేని విజయలక్ష్మీ గ్రంథాన్ని విశ్లేషిస్తారని పేర్కొన్నారు.

నేడు తుళ్లూరులో విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-తుళ్ళూరు: విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం తుళ్ళూరు గ్రామంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ లక్ష్మీనారాయణ చెప్పారు.ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

జోసిల్ కంపెనీలో ప్రమాదం

కుడి చేతిని కోల్పోయిన కార్మికుడు

ప్రజాశక్తి-మేడికొండూరు

విధి నిర్వహణలో ఉన్న కార్మికునికి కుడిచేయి సగానికి పైగా కోల్పోయిన సంఘటన గురువారం మండలంలోని డొకిపర్రు జోసిల్‌కంపెనీలో చోటుచేసుకుంది. ఫిరంగిపురం శాంతిపేటకు చెందిన తెనాలి ఆనంద్ పదిహేను సంవత్సరాలుగా జోసిల్ కంపెనీలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం రెండోషిఫ్ట్‌లో టిఎన్‌డి విభాగంలో పని చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు మిషన్‌లో తన కుడి చేయి పడి సగానికిపైగా నుజ్జయింది. సమీపంలోని తోటి కార్మికులు ప్రమాద విషయాన్ని గమనించి వెంటనే మిషన్‌స్విచ్ ఆఫ్‌చేసి ఇరుక్కుపోయిన చేయిని బయటకుతీశారు. వెంటనే కంపెనీ అబులెన్స్‌లో గుంటూరులోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసకున్న సహచర కార్మికులు ఒక్కసారిగా విచారానికి గురయ్యారు.

బాధిత కార్మికునికి కంపెనీ అండగా ఉంటుంది

కంపెనీలో చోటుచేసుకున్న ప్రమాద సంఘటనలో చేయికోల్పోయిన కార్మికుడు ఆనంద్‌కు , అతనికుటుంబానికి కంపెనీ అండగా నిలుస్తుంది. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతోపాటు, కార్మికచట్టాలకు లోబడి అమలుచేస్తున్న బీమా పరిహారాలు అందేలాచర్యలు తీసుకుంటామని జోసిల్ ఎండి జాగర్లమూడి మెరళీమోహన్



ప్రమాదంలో చేయి కోల్పోయిన కార్మికుడు ఆనంద్

6,7 తేదీల్లో యువ కెరటాలు : మంత్రి రవీంద్ర



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - మచిలీపట్నం

రాష్ట్రంలో ఎక్కడా నిర్వహించని విధంగా యువ కెరటాలను పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. గురువారం హిందూ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6,7 తేదీల్లో యువకెరటాలు 2018 కార్యక్రమాలు యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. పండుగలా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. నాలుగు సంవత్సరాలుగా యువ కెరటాలు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది హిందూ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతకు విద్య, వైజ్ఞానిక, సృజనాత్మకత వెలికితీసి వారికి స్ఫూర్తిని కలిగించే విధంగా పెద్దఎత్తున కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. బందరు యువత అందరినీ ఒకేచోట చేర్చి కనివినీ ఎరుగని రీతిలో యువతరం అభ్యున్నతికి, బందరు నవనిర్మాణానికి ఈ యువకెరటాలు నిర్వహిస్తున్నామన్నారు. జనవరి 6వ తేదీ పాఠశాలల విద్యార్థుల కోసం, 7వ తేదీ కళాశాలల విద్యార్థుల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పాటలు, నృత్యాలు, చిత్రలేఖనం, క్విజ్, లఘునాటికలు, ఉత్తేజ ప్రంగాలు, ప్రఖ్యాత కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 6వ తేదీ ఉదయం 9.30 గంటలకు ప్రారంభ కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాద్, ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు, సాంఘిక సంక్షేమశాఖామంత్రి నక్కా ఆనందబాబు, ప్యానల్ స్పీకర్ కొనకళ్ల నారాయణరావు పాల్గొంటారన్నారు. సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు, కెరియర్ గైడెన్స్ విడియాల చక్రవర్తి వారిచే విద్యార్థులు-నిర్బంధ విద్య అంశంలో ప్రసంగాలు ఉంటాయన్నారు. విద్యార్థులకు గ్రూప్ సోలో డ్యాన్స్‌ల్లో పోటీలు ఉంటాయన్నారు. 70 పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. 7వ తేదీ జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ, ప్రముఖ మోటివేటర్ బి.ఆర్.షఫీ పాల్గొంటారన్నారు. సాయంత్రం 4 గంటల నుండి జరిగే కార్యక్రమాల్లో రవాణా శాఖామంత్రి అచ్చెన్నాయుడు, ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పాల్గొంటారన్నారు. పాడుతాతీయగా, బోల్‌బేబీ బోల్ కార్యక్రమం విన్నర్స్ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారని తెలిపారు. ప్రముఖ సినీనటులు కృష్ణ కుమార్తె మంజుల దర్శకత్వంలో నిర్మించిన మనసుకు నచ్చింది సినిమా ఆడియో రిలీజ్ ఈ వేదికపై జరగనుండటం శుభపరిణామమన్నారు. 30 కళాశాలల నుండి విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు పెద్దఎత్తున వేదికలు, లేటెస్ట్ సౌండ్ సిస్టమ్, ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఎగ్జిబిషన్ స్టాల్ ఉంటాయన్నారు. ఈ ఉత్సవాలను యువత అందరూ పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల జగన్నాథరావు మాట్లాడుతూ విద్య, వైజ్ఞానిక అంశాలపై యువతకు స్ఫూర్తినిచ్చే విధంగా ఇదొక చర్చావేదిక కాగలదని అన్నారు. మున్సిపల్ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ మాట్లాడుతూ యువతలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. ఈ సమావేశంలో వైస్‌ఛైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం, నారగాని ఆంజనేయప్రసాద్, గనిపిశెటి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రెవరెండ్ ఫాదర్ ఇన్నయ్య

ఆదర్శనీయులు జోసఫ్ తంబి

ప్రజాశక్తి-ఉంగుటూరు

బ్రదర్ జోసఫ్ తంబి తన సేవా కార్యక్రమాలతో అందరికీ ఆదర్శంగా నిలిచారని జానంపేట విజ్ఞాన నిలయం ప్రెసిడెంట్ రెవరెండ్ ఫాదర్ ఇన్నయ్య పొలిశెట్టి అన్నారు. బ్రదర్ జోసఫ్ తంబి 73వ వర్థంతి మహోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పెదఅవుటపల్లి తంబి ఆలయ ప్రాంగణంలో పతాకావిష్కరణ చేసి గురువారం సాయంత్రం నవదిన జపాలు కార్యక్రమం లాంఛనంగా ప్రారంభించి, దివ్యబలిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తంబి చేసిన సువిశేష బోధనలు అందరినీ ఆకట్టుకునేవన్నారు. ఆయన గడిపిన సామాన్య జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఈకార్యక్రమంలో తంబి ఆశ్రమం రెక్టర్ రెవరెండ్ పాదర్ దేవదాసు దుగుట, పాదర్ ఇన్నబాబు పొలిమరశెట్టి, పాదర్ జోసఫ్ పాలడుగు,సంఘపెద్దలు,సంఘస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జవాబుదారీగా పాలన : మంత్రి

మచిలీపట్నం : తమ ప్రభుత్వం దేశంలోనే ముందంజలో ఉందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. పట్టణ పరిధిలోని 9,10,11,12,13 వార్డుల్లో గురువారం జరిగిన జన్మభూమి గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. 9,12 వార్డుల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం మాట్లాడుతూ అందరూ సంతోషంగా ఉంటే అదే అసలైన జన్మభూమి అన్నారు. మున్సిపల్ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.విజయ, ఆర్‌డిఒ జె.ఉదయభాస్కర్, మండల ప్రత్యేకాధికారి పి.వి.రమేష్‌కుమార్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పి.కాశీవిశ్వనాథం, కమిషనర్ ఎం.జస్వంతరావు, అసిస్టెంట్ కమిషనర్ చంద్రిక, కౌన్సిలర్లు గౌసియాబేగం, లోగిశెట్టి వెంకటస్వామి, మొవ్వ పార్వతి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్లపై పలువురు ఉద్యోగుల సస్పెండ్

పెడన : పెడన పురపాలక సంఘం పరిధిలో అక్రమ లేఅవుట్లకు సంబంధించి ఇక్కడ పనిచేసిన పలువురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. 2015లో పెడన పురపాలక సంఘ పరిధిలో అక్రమ లేఅవుట్లపై వైసిపికి చెందిన ప్రస్తుత మున్సిపల్ ఛైర్మన్ బండారు ఆనందప్రసాద్, కౌన్సిలర్ కటకం ప్రసాద్ తదితరులు అక్రమ లేఅవుట్లకు సంబంధించి విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదుచేశారు. విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి మున్సిపల్ కమిషనర్ బి.సంగీతరావు, మన్నం గోపాలరావు, జూనియర్ అసిస్టెంట్ ఎం.వినోద్‌కుమార్, టిపిఎస్ గల్లా గోవిందకుమారి, టిపిబిఒ పడమట వెంకటేశ్వరరావు, టిపిఎస్ కె.హరిప్రసాద్‌లపై క్రైమ్ నెం.1241/వి అండ్ ఇ డి1/2015గా విజిలెన్స్ అధికారులు నమోదుచేశారు. అప్పటి నుంచి ఈ అక్రమ లేఅవుట్లపై విజిలెన్స్ అధికారులు విచారణ నిర్వహించారు. తనిఖీల్లో సర్వే ఆర్ఎస్ నెం.353, 28/11జి, 301/1, 2అండ్3 మరియు 479/6ఎ, ఆర్ఎస్ నెం.479/3,4,5, 482/1బి,3,4లో డెవలప్‌మెంట్ ఛార్జీలు 10 శాతం ఓపెన్ సర్వీస్ ఛార్జీలు మున్సిపాలిటీకి చెల్లించనట్లుగా విజిలెన్స్ నివేదిక రుజువైంది. దీంతో పై వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ప్రభుత్వం జారీచేసింది. అయితే టిపిఎస్ గల్లా గోవిందకుమారి పెడన పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తుండగా మిగతావారు వివిధ పట్టణాలకు బదిలీ అయ్యారు.

డైరీ ఆవిష్కరణ

గుడివాడ : నందమూరి తారకరామారావు క్రీడాప్రాంగణం కమిటీ ఆధ్వర్యంలో ప్రచురించిన 2018నూతన సంవత్సర డైరీను రాష్ట్ర యువజన, క్రీడా శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆవిష్కరించారు. గురువారం జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలోని మంత్రి కార్యాలయంలో ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతే ధ్యేయం : వంశీ

ప్రజాశక్తి-ఉంగుటూరు(హనుమాన్‌జంక్షన్)

రాష్ట్ర ప్రగతే ధ్యేయంగా సిఎం చంద్రబాబు నిరంతర కృషి చేస్తున్నారని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. బాపులపాడు మండలం కోడూరుపాడు, అంపాపురం, బండారుగూడెం, ఎ.సీతారామపురం గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు జరిగాయి. కోడూరుపాడు గ్రామసభలో ఆయన మాట్లాడారు. అనంతరం చంద్రన్న సంక్రాంతి కానుకలు, చంద్రన్న ఉపకారవేతనాలు, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని



రుణాల చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీ

రుణాలు, కొత్త రేషన్ కార్డులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తొలుత ప్రభుత్వ పథకాలు, మరుగుదొడ్డి వినియోగం గురించి జరిగిన సందేశాత్మక చిన్నారుల నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకర్షించాయి. గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రేమల్లె గ్రామానికి చెందిన తుమ్మల చంద్రశేఖర్‌కు రైతురథం పథకం కింద ట్రాక్టర్‌ను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పి.సత్యనారాయణ,ఎంపిపి తుమ్మల కోమలి,ఎంపిడివో ఆర్.కేశవరెడ్డి,గ్రామసర్పంచ్ వేమూరి అగస్టియమ్మ,ఎంపిటిసి,వలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.అంపాపురంలో జరిగిన గ్రామసభలో అధికారులు,సర్పంచ్ సంజయ్‌కుమార్,ఎంపిటిసి తదితరులు పాల్గొన్నారు.బండారుగూడెంలో జరిగిన గ్రామసభలో తహశీల్దారు కె.గోపాలకృష్ణ,సర్పంచ్ అబ్బూరి హేమలత,వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రజా సమస్యలు ప్రజలను అడిగి తెలుసుకున్నారు.ఎ.సీతారామపురంలో తహశీల్దారు కె.గోపాలకృష్ణ,సర్పంచ్ కె.శ్రీనివాసరావు,తదితరులు జన్మభూమి గ్రామసభల్లో పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యత : మంత్రి

కైకలూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సేవే ధ్యేయంగా పని చేస్తోందని, రైతు సంక్షేమమే లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, వైద్య విద్యా శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని రామవరంలో నిర్వహించిన జన్మభూమి గ్రామ సభలో ఆయన మాట్లాడారు. రుణమాఫీలోనూ ఇచ్చిన హామీ ప్రకారం మూడో విడత నగదును బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేశారన్నారు. డ్వాక్రా మహిళలకు రెండో విడత మూలధనం రూ.3 వేలు వారి ఖాతాల్లోకి వేశారన్నారు. రైతులను ఆదుకునేందుకు సిఎం చంద్రబాబు పట్టిసీమ ద్వారా నీరు అందించగలిగారని లేకుంటే తాగునీరు కూడా ఉండేది కాదన్నారు. రెండేళ్ళుగా కృష్ణాజలాలు లేవని, నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు నీరందని దృష్టిని ఏర్పడిందన్నారు వచ్చే ఏడాదికి పోలవరం పూర్తి చేసి రెండు పంటలకు తాగు,సాగునీరు అందిస్తామన్నారు. వరహాపట్నం-ఉప్పుటేరు ఆర్ అండ్ బి రహదారికి రూ.15 లక్షలు మరమ్మతులకు కేటాయించామన్నారు. 67 ఏళ్ళలో 550 ట్రాన్స్ ఫార్మర్లు ఉంటే ఈ మూడేళ్ళలో టీడీపీ ప్రభుత్వం 1100 ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేసిందని, నిరంతర విద్యుత్తును అందిస్తున్నామన్నారు. కాపు కార్పోరేషన్ ఛైర్మన్ చలమలశెట్టి రామానుజయ మట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ఎస్సీ,ఎస్టీ బీసీ, ఓసీ కార్పోరేషన్‌లతో పాటు కాపు కార్పోరేషన్ ఏర్పాటు చేసి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల ఆర్థిక చేయూత ఇచ్చి వారి అభివృద్ధికి తోడ్పడుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు మాట్లాడుతూ ప్రజలకు కావాల్సిన సమస్యలు తీర్చడానికి ప్రభుత్వం జన్మభూమి కార్యక్రమాలు నిర్వహించిందని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటిసి బొమ్మన బోయిన విజయలక్ష్మి, ఎఎంసీ ఛైర్మన్ సామర్ల శివకృష్ణ, ప్రత్యేకాధికారి ఆనందబాబు, సర్పంచి జి. కుమారి, తహసీల్దారు శ్రీనునాయక్, ఎమ్పీడీఓ దివాకర్, డిఎస్పీ మహేష్, వివిధ శాఖలధికారులు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని రామవరం మంచినీటి చెరువుకు తాగునీరు నింపేందుకు కలిదిండి మండలం కొండూరు వద్ద పోల్‌రాజ్ కెనాల్ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ నిధులు రూ. 38 లక్షలతో పైపులైన్ ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. దీనిని మంత్రి డా. కామినేని గురువారం ప్రారంభించారు. సంతృప్తి కరంగా సేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఈ సిహెచ్ రామారావు, సర్పంచి జి.కుమారి పాల్గొన్నారు.

కైకలూరు ఆసుపత్రి ఆదర్శంగా నిలవాలి : కామినేని

ప్రజాశక్తి-కైకలూరు

వైద్య సదుపాయాలు కల్పించడంలో కైకలూరు ఆసుపత్రి రాష్ట్రంలోనే ప్రథమంగా రూపుదిద్దుకుని ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య వైద్య విద్యా శాఖమంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం ఆయన నూతనంగా నిర్మిస్తున్న స్థానిక ఆసుపత్రిని ఆంధ్రప్రదేశ్ వైద్యసేవలు, మౌలిక సదుపాయాల సంస్థ ఎస్ఈ కె.శ్రీనివాస్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మరో రెండు నెలల్లో నూతన భవనం పూర్తవుతుందని, అన్ని హంగులతో ప్రారంభం కానున్నదన్నారు. 50 పడకల ఆసుపత్రి ప్రజలకు అన్ని సదుపాయాలతో అందుబాటులో ఉంటుందన్నారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మించే అన్ని పిహెచ్‌సీల కంటే కైకలూరు ఆసుపత్రి నూతన హంగులతో ఏర్పడి ఆదర్శంగా ఉండాలని ఆ విధంగా కాంట్రాక్టర్లు పని చేయాలని ఆదేశించారు. కొత్త ఆసుపత్రితో పాటు పాత భవనాన్ని రూ.1.15 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, రెండిటిని మార్చి నెలలో ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మౌలిక సదుపాయల సంస్థ ఈఈ ప్రవీణ్‌రాజ్, జేఈ కిషోర్, డి.ఈ నాగరాజు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎఎంసీ ఛైర్మన్ సామర్ల శివకృష్ణ, ముదునూరి సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

మహాపాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

గుడివాడ : రాష్ట్రానికి జీవనాధారమైన పోలవరాన్ని పూర్తి చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాపాదయాత్ర నిర్వహిస్తున్నట్లు పిసిసి సభ్యులు గానుగుల వీరనేతాజీ, డిసిసి ఉపాధ్యక్షులు శిష్టా దత్తాత్రేయులు అన్నారు. గురువారం స్థానిక గాంధీ మండపంలో పోలవరం కోసం కాంగ్రెస్ మహాపాదయాత్ర గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గానుగుల, శిష్టా మాట్లాడుతూ ఈ నెల 7,8,9 తేదీల్లో ధవళేశ్వరం నుండి పోలవరం ప్రాజెక్టు వరకు మహాపాతయాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తేదీన పోలవరం వద్ద సత్యాగ్రహం చేపట్టామన్నారు.


శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్ పతకమూరి పుల్లమ్మ

ఉచిత పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరులో గురువారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ పతకమూరి పుల్లమ్మ ప్రారంభించారు. పశువులకు చూడి, కృత్రిమ గర్భధారణ, ఎదురవటానికి పరీక్షలు నిర్వహించారు. దూడలకు నట్టలనివారణ, ఏలికపాముల మందులను ఇచ్చారు. పరీక్షల అనంతరం పశువుల యజమానులకు ఉచి తంగా మందుల ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎడిఎ మాధవరావు, విఎఎస్ సాయి, మోహనరావు, విజయ కుమార్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ అబ్బూరి గోవింద రాజులు, గోపాలమిత్రలు పరిపూర్ణచారి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

దళితుల గ్రామ బహిష్కరణ దుర్మార్గం

ప్రజాశక్తి -వినుకొండ

కర్నూల్ జిల్లా రుద్రవరం మండలం నామాల దిన్నె గ్రామంలో దళితులను గ్రామ బహిష్కరణ చేయడం దుర్మార్గమైన చర్య అని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం నరసరావుపేట డివిజన్ అధ్యక్షులు కొటికల చంద్రశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎట్టి పని చేయలేదని గ్రామ బహిష్కరణ చేయటం హేయమైన చర్య అన్నారు. చట్టాలను సక్రమంగా అమలు చేయకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. దళితులంతా ఏకమై సమిష్టిగా ఎదుర్కొవాలన్నారు. సమావేశంలో వినుకొండ అధ్యక్షులు పి.సునీల్ కుమార్, బొల్లాపల్లి, నూజెండ్ల, శావల్యాపురం మండలాల సభ్యులు, ఉన్నారు.


దీక్షలో కూర్చున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

రెండో రోజుకు ఎంఆర్‌పిఎస్ దీక్షలు

ప్రజాశక్తి-రొంపిచర్ల

ఎన్నికల ముందు ఎస్‌సి వర్గీకరణ చేసి పెద్ద మాదిగనవుతా అని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే హామీని విస్మరించారని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు బుదాల బాబురావు అన్నారు. ఎస్సి వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టబద్ధత కలిపించాలని డిమాండ్ చేస్తూ గురువారం రెండో రోజు నిరాహార దీక్ష కొనసాగించారు. ఈ కార్యక్రమానికి బెడుబుగ్గ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.వీరయ్య మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో హక్కుల సాధన కోసం శాంతియుతంగా ఉద్యమం చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులను అరెస్ట్ చేయడం దారుణమన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మాదిగల ఆగ్రహానికి గురి కాక తప్పదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గంటా లింగయ్య మృతికి నివాళి

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరులో అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎంపిటిసి, విశ్రాంత ఉద్యోగి గంటా లింగయ్య (77) మృతదేహాన్ని గురువారం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, వైసీపీ వినుకొండ నియోజకవర్గ కన్వీనర్ బొల్లా బహ్మనాయుడు సందర్శించి పూలమాలలతో నివాళు లర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సమస్యలపై జన్మభూమిలో నిలదీసిన సిపిఎం

ప్రజాశక్తి-రొంపిచర్ల

పరగటిచర్లలో గురువారం నిర్వహించిన జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాట్లాడుతున్న తనను అధికారులు టీడీపీ నాయకులు, పోలీసులు అడ్డుకున్నారని సీపీఎం నాయకులు కామినేని రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది సరైనది కాదన్నారు. గ్రామస్తులు ఎదుర్కుంటున్న మౌళిక సమస్యలైన గృహ నిర్మాణం, రక్షిత మంచినీటి సరఫరా పెద్ద సమస్యగా మారిందన్నారు. ,రుణమాఫీ 90 శాతం మంది గ్రామస్తులకు కాలేదన్నారు. సమస్యలు తెలిపేందుకు ప్రయత్నించిన తనను అడ్డుకోవడం దారుణమన్నారు. 17 ఏళ్ల కిందట 1400కె.వి విద్యుత్ లైను భూముల రైతులకు ఇప్పటికి నష్టపరిహారం అందలేదన్నారు. సుబాబుల్ రైతులకు ఫ్యాక్టరీ వారికి ప్రభుత్వం కుదిర్చిన టన్ను 4400 ధర అమలు కాలేదని ప్రస్తుతం టన్ను 2 వేలకు విక్రయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో సిపిఎం ఉద్యమం చేయాల్సి వస్తుందని డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం దేశంలో ఏ ముఖ్యమంత్రి పడని కష్టం చంద్రబాబు నాయుడు పడుతున్నారని స్పీకర్ కోడెల శివప్రసాదరావు అన్నారు. మండలంలోని పరగటిచర్లలో పర్యటించిన ఆయన కోటి రూ.60 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. అన్నవరపాడులో నిర్వహించిన సభలో నూజివీడు ఎమ్మెల్సీ జన్మభూమి డివిజన్ ప్రత్యేక అధికారి మహమ్మద్ షరీఫ్ హాజరై మాట్లాడారు. ఆలస్యంగా కార్యక్రమం మొదలుపెట్టడంతో గ్రామస్తులు రాక కుర్చీలు కాలిగా దర్శనమిచ్చాయి. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి చంద్రమోహన్, ఎంపిపి రామారావు, మార్కెట్ యార్డు చైర్మన్ లింగా వెంకటేశ్వర్లు, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, చిరుమామిళ్ల బ్రహ్మయ్య, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ పచ్చవ కృష్ణ, ఎంపిటిసి పుట్టా సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు పచ్చవ కోటేశ్వరరావు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వినుకొండ : అబ్దుల్‌కలామ్ లాంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని 2,7,8,9 వార్డుల్లో జన్మభూమి - మా ఊరు సభలు నిర్వహించారు.దీనిలో భాగంగా 8వ వార్డు సభ స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని జాషువా కళాప్రాంగణంలో నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. సభల్లో ప్రజల వద్దనుంచి 63 అర్జీలు అందినట్లు కమిషనర్ డి.రవీంద్ర తెలిపారు. అనంతరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులచే స్వచ్ఛాంధ్రప్రదేశ్ ర్యాలీని ఎమ్మెల్యే జీవీ ప్రారంభించారు.

ఈపూరు : ప్రజ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జన్మభూమి-మాఊరు కార్యక్రమం చేపట్టిందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు.మండలంలోని అంగలూరు, ఈపూరు గ్రామాల్లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్ ఎల్ విజయచందర్, సర్పంచ్‌లు గోగుల సుబ్బయ్య, పతకమూరి పుల్లమ్మ, ప్రత్యేకధికారి సుభాషిణి, ఎంపిపి రావర్ల రామాంజమ్మ, జడ్‌పిటిసి కన్నయ్య, తహశీల్దార్ టి ప్రశాంతి, ఎంపిడిఒ ఈపూరి బూసిరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నరసరావుపేట రూరల్ : ప్రభుత్వం, జెయన్‌టియు కాకినాడ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యూకేషన్ ఆదేశానుసారం స్థానిక సాయితిరుమల ఎన్‌విఆర్ ఇంజనీరింగ్ కళాశాల జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమంలో భాగంగా మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో ప్రత్యేక శ్రమదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

తిరుమల ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలింటీర్లు సాతులూరులో వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హెల్త్ వర్కర్స్, ఎఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లతో కలిసి ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం, సామాజిక సంక్షేమం, సామాజిక భద్రత పలు అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

పాలపాడులో స్థానిక ఎన్ఎస్ఎస్ కళాశాల ఎన్ఎస్-ఎస్ వాలింటీర్లు గ్రామాన్ని దత్తత స్వీకరించి మొదటి రోజు వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో స్వచ్ఛాంధ్ర - ఒడిఎఫ్ ర్యాలీ నిర్వహించారు.

నరసరావుపేట : లాల్‌బహదూర్ మున్సిపల్ స్కూల్లో 9వ వార్డులో నిర్వహించిన సభలో కోడెల హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మేనేజర్ కెవిఎస్ఎమ్.శర్మ, టిపిఒ టి.సాంబయ్య, డిప్యూటీ డిఇ జె.శివరామకృష్ణ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు : మండలంలోని కొండెపాడులో సర్పంచ్ జిలాని అధ్యక్షతన సభ నిర్వహించారు. సందర్భంగా పలువురు అధికారులు వారి వారి శాఖల పనితీరు గురించి వివరించారు.


మాట్లాడుతున్న జెడ్పీటీసీ సంతోషమ్మ

పథకాల అమలులో ఏకపక్షం తగదు

వినుకొండ రూరల్ : ప్రభుత్వ పథకాల మంజూరులో అధికారులు ఏకపక్షధోరణి అవలంభించడం సరికాదని బొల్లాపల్లి జెడ్పీటీసీ (వైసిపి) కిన్నెర సంతోషమ్మ నిలదీశారు. మండలంలోని గండిగనుమల గ్రామంలో గురువారం జరిగిన జన్మభూమి సభలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపికలో జన్మభూమి కమిటీల పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు తెలియకుండా పనులు చేయించడం, గ్రామాల్లో అనర్హులను, అధికార పార్టీకి చెందిన వారిని ఎంపిక చేస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. తాగు నీటి సమస్యను పరిష్కరించుటలో పాలకులు అసమర్థులు అయ్యారని, వాటర్ గ్రిడ్ అంటూ ప్రకటించి ఇప్పటికి పథకం ఊసే లేదని అన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు ఇటువంటి కార్యక్రమాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. పథకాల మంజూరులో పారదర్శకత పాటించాలని, అవకతవలు జరిగితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారమయ్యేంత వరకు పోరాటం చేస్తామన్నారు. సభలో ప్రత్యేకాధికారి, ఎంపిడిఒ , జన్మభూమి కమిటీ సభ్యులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

రుణమాఫీపై రైతుల్లో గందరగోళం

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

ప్రజాశక్తి-రొంపిచర్ల

జన్మభూమి మాఊరు ప్రజా సమస్యల పరిష్కారం కోసం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న జన్మభూమి సభలు జనం లేక వెలవెల బోతున్నాయని అర్హులకు కాకుండా జన్మభూమి కమిటీ వంకతో అనర్హులకు పెన్షన్లు ఇస్తున్నారని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. రుణమాఫీ విషయంపై గురువారం మండల కేంద్రమైన రొంపిచర్ల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకుకి వచ్చిన బ్యాంక్ అధికారులతో సమీక్షించారు. అనంతరం బాంక్ ఎదుట రైతులతో గోపిరెడ్డి మాట్లాడుతూ 3వ విడత రుణమాఫీ 2300 మంది రైతులకు 2.33 లక్షల రూపాయలు రావాల్సి ఉండగా 22 మంది రైతులకు 3 లక్షల 20 వేలు మాత్రమే రైతుల ఖాతాలకు జమ అయ్యాయన్నారు.3వ విడత రుణమాఫీ రూ.100 కోట్లు మంజూరు చేసిన వ్యవసాయశాఖ మంత్రి రూ.4 వేల కోట్లు మంజూరు చేశామని చెప్పడం రైతులను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. నీటి విడుదల విషయంలో స్పష్టమయిన ప్రకటన ఇవ్వకపోవడంతో పూర్తి స్థాయిలో రైతులు సాగుచేపట్టలేదన్నారు. స్పష్టమైన ప్రకటన విడుదల చేసినట్లయితే నార్లు పోసుకుని ఇప్పటి పూర్తి స్థాయిలో వ్యవసాయ పనుల్లో ఉండేవారని అన్నారు. పులివెందులకు నీరు ఇచ్చి జగన్మోహన్ రెడ్డిని అవమానించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి సాగర్ కుడి కాలువ రైతులకు ద్రోహం చేసారని అన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పిల్లి ఓబుల్‌రెడ్డి, మండల కన్వీనర్ పచ్చవ రవీంద్రబాబు, మాజీ జడ్‌పిటిసి జి.శ్రీనివాసరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట : ప్రజలు చెప్తున్న సమస్యలను పట్టించుకోకుండా, వారి చెప్పిందే వినడంగా జన్మభూమి కార్యక్రమం జరుగుతుందని ఈ తీరు బాగాలేదని వైసిపి ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. ప్రజలు తమకు కావాల్సిన పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ళ స్థలాల కోసం దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారని, అయితే గతంలో ఇచ్చిన అర్జీలను కనీసం పరిశీలన కూడా చేయలేదన్నారు. ఈ పరిస్థితులలో జన్మభూమి కార్యక్రమాలు నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. గృహ నిర్మాణాలకు మూడు సార్లు శంకుస్థాపనలు చేసిన నేటికి ప్రారంభానికి నోచుకోలేదన్నారు.సమావేశంలో మీరావలి, రెహమాన్, మాడిశెట్టి మోహన్ పాల్గొన్నారు.

ఎన్ఇసిలో ఫౌండర్స్ కాంక్లేవ్ -2018 ప్రారంభం

ప్రజాశక్తి - నరసరావుపేట రూరల్

విద్యార్థుల్లో ముఖ్యంగా యువతలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను గుర్తించి వారి ఆలోచనలను, వినూత్న విధానాలను పారిశ్రామిక రంగం వైపు ఎలా మళ్లించాలో డాక్టర్ మోహన్‌బాబు వివరించారు. స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఫౌండర్స్ కాంక్లేవ్ -2018 ప్రారంభించినట్లు వైస్ చైర్మన్ ఎమ్ఎస్ చక్రవర్తి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మోహన్‌బాబు మాట్లాడుతూ కళాశాల్లో ఏర్పాటు చేసిన ఇంకుబేషన్ సెంటర్ ద్వారా ఇలాంటి వారి ఆలోచనలను అభివృద్ధి పరచి అమలు పరచనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 150కు పైగా అంకుర పరిశ్రమలు ఈ కార్యక్రమంలో పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా రెడ్‌మెండ్ కాంక్లేవ్ ఫౌండర్ మాధవరెడ్డి, ఎన్‌డబ్ల్యూటిఎన్ వైస్ ప్రెసిడెంట్ నరేష్, హార్దిక్ గ్రూప్ ఎంటర్ ప్రైజెస్ సిఇఒ ఎడి.రావులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ రమేష్‌బాబు, డాక్టర్ కె.పౌన్నారి లక్ష్మి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌బాబు

సమస్యలపై నిలదీసిన సిపిఎం



రెంటపాళ్లలో అధికారులను నిలదీస్తున్న సిపిఎం నాయకులు



కారంపూడిలో ఖాళీగా ఉన్న కుర్చీలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఉపాధిహామీ కూలీలకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలని సిపిఎం నాయకులు రెంటపాళ్లలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో అధికారులను నిలదీశారు. మండలంలోని రెంటపాళ్ల, గోగులపాడు, గర్నెపూడి గ్రామాల్లో 5వవిడత జన్మభూమి మాఊరు కార్యక్రమం గురువారం నిర్వహించారు. రెంటపాళ్లలో జరిగిన జన్మభూమి గ్రామసభలో వివిధ సమస్యలపై అధికారులను గ్రామస్తులు, సిపిఎం నాయకులు నిలదీశారు. 40 కుటుంబాల వారికి వేలిముద్రలు పడడంలేదనే కారణంతో ఆరునెలలుగా ఉపాధివేతనాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే కూలీలకు ఉపాధివేతనాలు చెల్లించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. గతంలో కురిసిన అకాలవర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఇంత వరకు నష్టపరిహారం ఇవ్వలేదని వెంటనే నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. బిటి-2 పత్తి విత్తనాలు సాగుచేసి గులాబిరంగు పురుగుతో పంటనష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. అలాగే మూడోవిడత రుణమాఫీ రైతుల ఖాతాల్లో డబ్బులు జమకాలేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇంకుడుగుంతలు తీసుకున్న వారికి ఇంతవరకు నగదు జమకాలేదని డబ్బులు ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలని అధికారులను సిపిఎం మండల సహాయ కార్యదర్శి పెండ్యాల మహేష్, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు బొల్లిపల్లి రామారావు, సిపిఎం నాయకులు మక్కపాటి నరసింహరావు, దారా ప్రభాకరరావు, దుగ్గి వెంకయ్య, మక్కపాటి అరుణ, సిపిఎం మండల కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి నిలదీశారు. ఎంపిడిఒ పిఎస్ పద్మాకర్ మాట్లాడుతూ త్వరలో కూలీలకు బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే గర్నెపూడిలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో వివిధ సమస్యలపై జన్మభూమి అధికారులను నిలదీశారు. గ్రామంలో ఫిల్టర్‌బెడ్‌లు మరమ్మతులకు గురై నాలుగేళ్లైయిన ఇంతవరకు బాగుచేయలేదని ఎంపిటిసి కాశిమాల ఓబయ్య అధికారులను నిలదీశారు. మండల పరిషత్ సమావేశంలో ఎన్నిసార్లు సమస్యలు ప్రస్తావించినా అక్కడి నుంచి, ఇక్కడి నుంచి ఇసుక తెచ్చి ఫిల్టర్‌బెడ్‌లకు మరమ్మతులు చేస్తామని చెప్పిన అధికారులు ఇంతవరకు వాటి ప్రస్తావనే ఎత్తడంలేదని అన్నారు. గ్రామంలో గ్రౌండ్‌వాటర్ ఉప్పగా ఉంటాయని గ్రామంలో ఆర్‌ఒప్లాంట్ నిర్వాహకులు కెమికల్ ఎక్కువ మోతాదులో వాడడం వల్ల మినరల్‌వాటర్ తాగిన గ్రామస్తులు రోగాలబారిన పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మక్కెన-గర్నెపూడి తారురోడ్డు గుంతలు పడి నడవడానికి కూడా వీలులేకుండా ఉందని వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. మరుగుదొడ్ల బిల్లులు ఇంతవరకు రాలేదని అవి ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలని గ్రామస్తులు అధికారులను పట్టుబట్టారు. తహశీల్దార్ పి.శంకర్‌బాబు మాట్లాడుతూ ఫిల్టర్‌బెడ్‌లు త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని మరుగుదొడ్ల బిల్లులు వారంలో చెల్లించే ఏర్పాట్లు చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. జన్మభూమి కార్యక్రమాల్లో ఎఒ వి.నరేంద్రబాబు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరుతూ మండలంలోని రామకృష్ణాపురం బాలయోగి సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు.

కారంపూడి : మండలంలోని చిన కొదమగుండ్ల గ్రామంలో నిర్వహించిన గ్రామస్తులు లేక వెలవెల బోతుంది. ఈప్రతిజ్ఞను కార్యక్రమం ప్రారంభంలో 10గంటలకు చేయాల్సి ఉంది. అయితే అధికారులే 11.30 గంటలకు రావడంతో 12గంటలకు ఖాళీ కుర్చీలతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రజలు రాకపోవడంతో వచ్చిన అధికారులను ఖాళీ కుర్చీలు వెక్కిరిస్తున్నాయి. సమయం దాటి పోవడంతో వచ్చిన అరకొర ప్రజలు కూడా వెనుదిరుగుతున్నారు. సభకు వచ్చిన ఎవరిని కదిలించాని ఏముంది వాళ్లు చెప్పేది, ఏం ఒరిగిందంటూ నిట్టూరుస్తున్నారు.

మాచర్ల : పట్టణంలో 7,7,9 వార్డులో కార్యక్రమం నిర్వహించగా సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు అందజేశారు.

నకరికల్లు : మండలంలోని రూపెనగుంట్లలో నిర్వహించిన సభకు కోడెల హాజరై మాట్లాడారు.

రాజుపాలెం : మండలంలోని గణపవరంలో సభ జరిగింది. గ్రామస్తులు సమస్యలపై ఫిర్యాదులు ఇచ్చారు.

పెదకూరపాడు : మండలంలోని జలాలపురం, పాటిబండ్ల, అబ్బురాజుపాలెం గ్రామాల్లో నిర్వహించిన సభకు ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ హాజరై మాట్లాడారు.



బట్టలు పంపిణీచేస్తున్న డాక్టర్ మంత్రూనాయక్

రోగులకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

నెమ్మువ్యాధి గ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడుకుంటే త్వరగా వ్యాధి తగ్గిపోతుందని సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మంత్రునాయక్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏఎంజి ఇంటర్నేషనల్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో గుడ్డివారికి, నెమ్ము వ్యాధి గ్రస్తులకు నిత్యావసర సరుకులు, బట్టలు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి డాక్టర్ మంత్రునాయక్ ముఖ్యఅతిథిగా హాజరై వ్యాధిగ్రస్తులకు బట్టలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఏఎంజి సంస్థను అభినందించారు. 110 మంది టిబి రోగులకు, 44 మంది గుడ్డివారికి ఏఎంజి డైరెక్టర్ అరుణ్‌కుమార్ మహంతి ఆధ్వర్యంలో క్రిస్మస్, సంక్రాంతి సందర్భంగా నిత్యావసరసరుకులు, బట్టలు పంపిణీ చేస్తున్నామని. ఏఎంజి సిబ్బంది సుధాకర్‌బాబు తెలిపారు. జిల్లాలో ఎయిడ్స్, టిబి, లిప్రసీ, గుడ్డివారికి ప్రతినెల 4,300 మందికి నిత్యావసర సరుకులు ఏఎంజి తరుపున పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆనారోగ్యం దరిచేరదని మున్సిపల్ కమిషనర్ కాసు శివరామి రెడ్డి అన్నారు. క్రేంద్ర ప్రభుత్వం సమర్ధవంతంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం పిడుగురాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, అధికారులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ భవనాశి హైమావతి యల్లారావు, అద్దంకి రత్నబాబు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆనారోగ్యం దరిచేరదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ-2018 అవార్డుకు దేశంలోని 4041 పురపాలక సంఘాలతో పాటు మన పురపాలక సంఘం కూడా పాల్గొంటుందన్నారు. ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛ సర్వేక్షణ-2018 అవార్డు పొందుటకు తమ వంతు బాధ్యతగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు హైస్కూల్ నుండి ర్యాలీగా బయులుదేరి ఐలాండ్ సెంటర్ మీదుగా తిరిగి పాఠశాలకు చేరుకున్నారు.

తాంత్రిక పూజలపై సింగిల్‌జడ్జితో విచారణ చేయాలి : అంబటి



మాట్లాడుతున్న అంబటి రాంబాబు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

దుర్గగుడిలో తాంత్రిక పూజలపై సింగిల్‌జడ్జితో విచారణ చేయాలని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు అంబటి రాబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సత్తెనపల్లి వైసిపి కార్యాలయంలో అంబటి రాంబాబు గురువారం విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి తనయుడు నారా లోకేష్ ముఖ్యమంత్రి కావడం కోసం చంద్రబాబు సతీమణి భువనేశ్వరే దుర్గగుడిలో తాంత్రిక పూజలు నిర్వహించారని ఆరోపించారు. సింగిల్ జడ్జితో విచారణ చేయిస్తే మాదగ్గర ఉన్న సాక్ష్యాలు అందజేస్తామని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు జన్మభూమి మాఊరు కార్యక్రమాన్ని ఉపయోగించుకుంటున్నారే తప్ప ప్రజల యోగక్షేమాలు తెలుసుకోవడానికి కాదన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో కోడెల తనయుడు కోడెల శివరామ్ ఏ హోదాతో జన్మభూమి కార్యక్రమాల్లో పాల్గొన్నారని మండిపడ్డారు. కడపజిల్లా పులివెందులలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఎంపి అవినాష్‌రెడ్డిని రౌడీలచేత నెట్టివేయించడం ఏమిటని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు నియంతలా వ్యవహరిస్తూ ఎంపి మాట్లాడుతున్న మైకును లాక్కోవడంపై అంబటి రాంబాబు మండిపడ్డారు. సమావేశంలో పెదకూరపాడు నియోజకవర్గ సమన్వయకర్త కావటి మనోహర్‌నాయుడు, జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షులు సయ్యద్ మాబు, రాష్ట్ర పంచాయతీరాజ్ అధ్యక్షులు కట్టా సాంబయ్య పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి

ప్రజాశక్తి-రాజుపాలెం

మండలంలోని కోటనెమలిపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో సావిత్రిబాయి పూలే జయంతి, మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను యుటిఎఫ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ ఆదినారాయణ మాట్లాడుతూ బాలికావిద్యకు కృషి చేసిన సావిత్రిభాయి పూలే అందరికీ ఆదర్శమన్నారు. గొప్ప అభ్యుదయ వాది సంఘ సంస్కర్త అయిన సావిత్రిభాయి పూలేను తోటి మహిళలు ఆదర్శంగా తీసుకుని ఆమె ఆశయసాధనకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్ మల్లిఖార్జునరెడ్డి, జి.రామూర్తినాయక్, నిర్మల, బేగం, శ్రీనివాసరావు, జయపాల్, ఎస్‌కె కరిముల్లా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదినారాయణ

సత్తెనపల్లి ఎస్సైగా శేషాచార్యులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణ ఎస్సైగా ఎ.శేషాచార్యులు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు విఆర్‌లోఉన్న శేషాచార్యులు సత్తెనపల్లికి బదిలీపై వచ్చారు. గతంలో సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన శేషాచార్యులు ఏఎస్‌ఐగా పదోన్నతి పొంది యడ్లపాడులో పని చేశారు. అక్కడినుంచి ఎస్సైగా పదోన్నతి పొంది సత్తెనపల్లికి బదిలీ అయ్యారు. ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శేషాచార్యులుకు పట్టణ ప్రముఖులు నాయకులు, పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డిఎస్పీ కాలేషావలి, సిఐ సురేష్‌బాబులను ఎస్సై శేషాచార్యులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.



మందకృష్ణ అరెస్టు అవమానకరం

ప్రజాశక్తి-బెల్లంకొండ

మాదిగజాతి కోసం పోరాడుతున్న ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అద్యక్షులు మందాకృష్ణ మాదిగను అరెస్టు చేయటం జాతికి అవమానమని మండల సీనియర్ అధ్యక్షులు దుగ్గి మోషా మాదిగ అన్నారు. 24 సంవత్సరాల నుండి ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడుతున్నా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ అనుకూలతను ప్రకటించక పోవటం దురదృష్టకరమని అన్నారు. మందాకృష్ణను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.ఏడుకొండలు, ప్రభాకరరావు, సిహెచ్.ఏసోబు, దానియోలు పాల్గోన్నారు.

చంద్రన్న బీమా నగదు అందజేత

ప్రజాశక్తి-బెల్లంకొండ

పేదవాడిని ఆపదలో ఆదుకునేందుకే చంద్రన్న బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారని బీమామిత్ర పి.అరుణ అన్నారు. మండలంలోని నందిరాజుపాలెనికి చెందిన అరిగేపూడి రాజ్యం (49) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. చంద్రన్న బీమా కింద మృతురాలి కుమార్తె కీర్తికి జన్మభూమి కమిటీ సభ్యుల సమక్షంలో రూ.5 వేలు అందజేశారు.



నగదును అంద జేస్తున్న బీమామిత్ర



టిజెపిఎస్‌లో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్

అంధులకు కాంతి కిరణం బ్రెయిలీ లిపి

కార్పొరేషన్ : అంధులకు కాంతి కిరణంగా లూయీ బ్రెయిలీ లిపి ఉపయోగ పడుతుందని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు ఎన్.తిరుపతయ్య తెలిపారు. గురువారం స్థానిక బ్రాడీపేటలోని షిర్డీ సాయి అంధుల పాఠశాలలో లూయీ బ్రెయిలీ జయంతి సభని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున యూనివర్సిటలో ఎల్ఎల్ఎం ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడైన అంధుడు మల్లేశ్వరరావు, శాస్త్రీయ సంగీతంలో విశేష ప్రతిభ చూపుతున్న యల్లమందలకు ఘన సత్కారం చేశారు. తిరుపతయ్య మాట్లాడుతూ అంధులకు ప్రోత్సాహం అందిస్తే ఉత్తమ ఫలితాలను ఆయా విభాగాలలో చూపుతారని యల్లమంద, మల్లేశ్వరరావులు నిరూపించారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు పబ్బరాజు వెంకటేశ్వరరావు, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సుబ్బారెడ్డి, హరి పాల్గొన్నారు.

టిజెపిఎస్ కళాశాలలో

లూయిస్ బ్రెయిలీ జన్మదినం సందర్భంగా టిజెపిఎస్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.శివప్రసాద్ మాట్లాడుతూ బ్రెయిలీ పుట్టుకతో అంధుడు కాదని, తరువాత చూపు కోల్పోయిన, అంధుల కోసం లిపిని సృష్టించాడని, అదీ 'బ్రెయిలీ లిపి'గా ప్రాచుర్యం పొందిందని చెప్పారు. అనంతరం బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిహెచ్ శ్రీమన్నారాయణ, అధ్యాపకులు డాక్టర్ వివి రవీంద్ర, ఎ. భానుమురళి, పి కుమార్‌రాజు, జెవి. సుధీర్, పిడి నాగరాజు, రంగానాయకి, ఆర్. జయశైలజ తదితరులు పాల్గొన్నారు. కళాశాలలోని వికలాంగులైన విద్యార్థులకు ప్రిన్సిపల్ వై.శివప్రసాద్ పండ్లు అందజేశారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జెవి సుధీర్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు 2/12 బ్రాడీపేటలోని సాయి దీనజనసేవాసమితి ఆశ్రమంలో వికలాంగులకు పండ్లు అందజేశారు.

మహిళలకు ఆదర్శం సావిత్రిబాయిపూలే



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

వినుకొండ: సావిత్రి బాయి పూలే జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని టిడిపి నాయకులు షమీమ్ ఖాన్ అన్నారు సావిత్రి బాయి పూలే జయంతి వారోత్సవాలలో భాగంగా భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను జై భీమ్ పౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే మహిళలకు ఆదర్శనీయమన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముట్లూరి ఎలీషా బాబు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని బాలికలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో వార్డెన్ శ్యామల దేవి, బహుజన రచయిత వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సాబీర్ హుస్సేన్, న్యాయవాద సంఘం ఉపాధ్యక్షులు గంధం హరిప్రసాద్, ఇన్సాన్ జాతీయ కమిటి సభ్యులు ఎం.ఎ. సాలర్, లెక్చరర్ రాబర్ట్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు పేదలకు అందేలా చర్యలు

ఎమ్మెల్యే మోదుగుల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి

ప్రజాశక్తి-కార్పొరేషన్

ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అందేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని పశ్చిమ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి తెలిపారు. ఐదో విడత జన్మభూమిలో భాగంగా 24 వార్డు నగరంపాలెం కెకెఆర్ ఫంక్షన్ ప్లాజా వద్ద నిర్వహించిన సభలో పాల్గొని మాట్లాడారు. ప్రజా సంక్షేమం, మౌళిక సదుపాయాల కల్పనకు, ప్రజల నుండి స్పందనలు, ఫిర్యాదులు తీసుకొని రాష్ట్రాని అభివృద్ధి చేయడానికి జన్మభూమి మా ఊరు సభలను వాడ వాడలా చేపట్టామన్నారు. ప్రజలు జన్మభూమి కార్యక్రమంలో పింఛన్లు, రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు, స్థానిక సమస్యలపై అర్జీలు అందించాలని తెలిపారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి కృష్ణ చైతన్య మాట్లాడుతూ వార్డులలో ప్రజలు ఈ అవకాశంను వినియోగించుకొని వార్డు అభివృద్ధికి సంబందించిన అర్జీలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డి.మరియన్న మాట్లాడుతూ అర్హులైన వారికి రేషన్ కార్డులు, పింఛన్లు అందించినట్లు చెప్పారు. 22 వార్డు ఆర్.అగ్రహారంలో నోడల్ ఆఫీసర్ యం ఏసుదాసు, 34 వార్డు నేతాజి నగర్‌లో నోడల్ ఆఫీసర్ ఎస్.చక్రపాణిల ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమం జరిగింది.

నేటి షెడ్యూల్

పశ్చిమ నియోజకవర్గంలో 23 వార్డు నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్, 45 వార్డు వల్లూరి వారితోటలో, 15 వార్డు వడ్డెరగూడెం మున్సిపల్ హైస్కూల్‌లో జరుగుతుంది. తూర్పు నియోజకవర్గంలో 4 వార్డు పాత గుంటూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో, 17 వార్డులో చుట్టగుంట పోలేరమ్మ గుడి వద్ద, 57 వార్డులో గోరంట్ల బొడ్డు రాయి సెంటర్‌లో సభలు జరగనున్నాయి.

జనం జేబుకు చిల్లు

ప్రజాశక్తి-గుంటూరు అర్బన్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న జన్మభూమి సభకు వెళ్లి ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేసుకుని లబ్ధిపొందుదామనుకున్న పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల జేబుకు చిల్లు పడుతోంది. జన్మభూమి సభలో వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బంది ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వచ్చిన ప్రజలకు దరఖాస్తులు అందజేసి పూర్తి చేసేవిధానాన్ని తెలియపరచాల్సి ఉంటుంది. కానీ అధికారులు మాత్రం ఆర్భాటం, హంగామా, అధికార పార్టీ నేతల దాసోహాలకు ప్రాధాన్యత ఇవ్వటంతో జన్మభూమి సభలకు వచ్చే ప్రజలు రూ.2ల దరఖాస్తుకు రూ.40నుంచి 50 ల వరకు వదిలించుకోవల్సి వస్తుంది. గుంటూరు తూర్పు నియోజక వర్గంలో గురువారం 3వ డివిజన్ వినోభానగర్‌లో, ఐ.పి.డి.కాలనీలో జరిగిన జన్మభూమి సభలకు వచ్చే ప్రజలు దరఖాస్తులకు రూ.40లు ఇచ్చి దరఖాస్తును కొనుగోలు చేసి పూర్తిచేయించుకున్నారు. ఇవేమి పట్టని జీఎంసీ అధికారులు కనీసం దరఖాస్తులను విక్రయించే ప్రయివేటు వ్యక్తులను వారించకపోవటంతో సభలకు వచ్చే ప్రజలు అధికారులపై మండిపడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ఉచితంగా ఇవ్వాల్సిన దరఖాస్తులను అందజేసి పూర్తి చేయించాలని కోరుతున్నారు.

నాయకులు ఆలస్యంగా రావటంతో ప్రజలు అసహనం

తూర్పు నియోజకవర్గంలోని ఐపిడి కాలనీలో ఏర్పాటు చేసిన జన్మభూమి సభలకు అధికారులు ఆలస్యంగా రావడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. 3వ డివిజన్ వినోభానగర్‌లో కూడా మధ్యాహ్నం 2గంటలకు రావటంతో ప్రజలు కోపోద్రిక్తులయ్యారు. అనంతరం టిడిపి నేతలు మైనార్టీ చైర్మన్ హిదాయత్, మద్దాళి గిరిధర్, మాజీ ఎమ్మెల్యే జీయావుద్దిన్,స్థానిక నేతలు కందిమళ్ల హరిప్రసాద్, ఈర్ల గురవయ్య, సురే శ్రీను, తిరుపతయ్య, బ్రహ్మసాని శ్రీను తదితరులు పాల్గొని అర్హులకు రేషన్ కార్డులు, పింఛన్లు అందజేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై వార్డుల్లో పోటీలు

ప్రజాశక్తి-కార్పొరేషన్

గుంటూరు నగరం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు సాధనే లక్ష్యంగా జిఎంసి అనేక కార్యక్రమాలు చేపడుతుందని కమిషనర్ చల్లా అనురాధ తెలిపారు. గురువారం ఐదో విడత జన్మభూమిలో భాగంగా 22 వార్డులో పాల్గొన్న స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ వైస్ చైర్మన్ సిఎల్.వెంకట్రావు మాట్లాడుతూ గుంటూరు నగరంలోని 62 వార్డుల్లో స్వచ్ఛతతో పోటీ ఉండాలనే లక్ష్యంతో పరిశుభ్రతలో పోటీని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో మొదటి స్థానంలో నిలిచిన వార్డుని గోల్డెన్ వార్డుగా ఎంపికచేసి రూ.కోటితో ప్రత్యేక అభివృద్ధి నిధులు, ద్వితీయ స్థానంలో నిలిచన వార్డుకు రూ. 50 లక్షలు, తృతీయ స్థానంలో నిలిచిన వార్డుకి రూ.25 లక్షలు కేటాయిస్తామని తెలిపారు. నిధులను కేవలం వార్డులో అభివృద్ధి పనులకు మాత్రమే ఖర్చు పెడతామని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో అన్ని వార్డులలో ప్రజలు స్వఛ్ఛతపై జిఎంసి సిబ్బందితో సహకరించాలని కోరారు.

రేపు బండ్లమోటులో 'మీతో మీ ఎస్పీ'

ప్రజాశక్తి-గుంటూరు అర్బన్



మాట్లాడుతున్న రూరల్ ఎస్పీ

రూరల్ జిల్లా పరిధిలో ప్రజల వద్దకే ఎస్పీ వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవటానికే 'మీతో మీ ఎస్పీ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు రూరల్ ఎస్పీ అప్పలనాయుడు గురువారం తెలిపారు. ఈ నెల 6వ తేదీన బండ్లమోటు పోలీసు స్టేషన్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి హాజరయ్యే ఫిర్యాదిదారులు సరిగా పోలీసు వారి పరిధిలోని సమస్యలను తీసుకొని రావాలని, సివిల్ వివాదములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించరని తెలిపారు. జిల్లాలోని సుదూర ప్రాంతములలోని ప్రజలు ఏదైనా అన్యాయము జరిగి జిల్లా ఎస్పీ కార్యాలయమునకు హాజరు కాలేక తమ సమస్యలను పోలీసు స్టేషనుకు వెళ్ళి చెప్పుకోలేని వారు నిర్భంయంగా మీతో-మీ ఎస్పీ కార్యక్రమానికి హాజరై, తమ సమస్యలను చెప్పుకోవటానికి ఇదొక మంచి అవకాశామని రూరల్ ఎస్పీ పేర్కొన్నారు.

విద్యార్థులకు వితరణ

ప్రజాశక్తి-గుంటూరు అర్బన్

నగరంలోని బ్రాడీపేట3వలైనులో శ్రీశారదానికేతనలోని ఓరియంటల్ కళాశాల, పాఠశాల విద్యార్థులకు గురువారం దేవాదాయ శాఖ వారి ఆధీనంలోని అన్నసత్రము వారు ఉపకార వేతనాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మదాయ శాఖ పర్యవేక్షణాధికారి శివప్రసాద్, కార్యనిర్వాహణాధికారి మాధవీదేవి, ప్రిన్సిపల్ దేవయ్య, ప్రధానోపాధ్యాయులు దుర్గాభవాని పాల్గొన్నారు.

భూసారం పెంపునకు జీవమృతం దోహదం

ప్రకృతి వ్యవసాయ శిక్షణలో సుభాష్ పాలేకర్



మాట్లాడుతున్న పాలేకర్

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

ప్రకృతి వ్యవసాయ రథానికి నాలుగు చక్రాలున్నాయని, అవి జీవామృతం, బీజామృతం, ఆచ్ఛాదన, నీటి యాజమాన్యం అని , పంటలకు జీవామృతం కన్న తల్లిలాంటిదని ప్రకృతి వ్యవసాయ ఉద్యమదారుడు సుభాష్ పాలేకర్ తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న బైబిల్ మిషన్ ప్రాంగణంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయంపై రైతు శిక్షణా తరగతులు గురువారం ఐదోరోజు కొనసాగాయి. ఈ సందర్భంగా పాలేకర్ మాట్లాడుతూ జీవామృతం ద్వారా భూమిలో సూక్ష్మజీవులు, వానపాములు బాగా వృద్ధి చెందుతాయన్నారు. జీవామృతం ద్వారా భూసారం పెరగడానికి దోహదపడుతుందన్నారు. భూమిలోని పోషకాలను మొక్కలు నేరుగా వినియోగించుకునే రూపంలోకి మార్చి అందించటంలో వానపాములు, సూక్ష్మ జీవుల పాత్ర అసాధారణ మైనదన్నారు. సూక్ష్మజీవులకు నిలయం పశువుల పేడ, మూత్రం. ఈ రెండింటితో పాటు బెల్లం, పప్పుల పిండి, నీటిని కలిపినప్పుడు దీనిలోని సూక్ష్మజీవరాశి ప్రతి 20 నిమిషాలకు రెట్టింపు అవుతుందని తెలిపారు. జీవామృతం తయారీ విధానాన్ని, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సంయుక్త వ్యవసాయ సంచాలకులు ఎం.విజయభారతి, ఉప వ్యవసాయ సంచాలకులు సి.తిరుపతయ్య, ఎం.రామలింగయ్య, సహాయ వ్యవసాయ సంచాలకులు సి.పద్మావతి, హైమావతి, ఎస్.రామమోహన్, ఎఇఒ ఎం.జగన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు బుక్‌స్టాల్స్‌లో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన అనేక పుస్తకాలను అందుబాటులో ఉంచారు. సాగుబడి, సమగ్ర సేంద్రీయ వ్యవసాయ విధానం, చిరుధాన్యం సాగు, ఔషధ మొక్కలు, మన ఆరోగ్యం- మన చేతుల్లోనే, ఆయుర్వేదం-ఆహారం-ఔషద చికిత్సలు తదితర పుస్తకాలను కొనుగోలు చేసేందుకు శిక్షణార్థులు ఉత్సాహం చూపారు.

మంచు, చల్లటి గాలితో ఇబ్బందులు

శిక్షణా ప్రాంగణంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్లలలో శిక్షణార్థులకు విడిది ఏర్పాటు చేశారు. ఈ షెడ్లు ఊరుబయట ఏర్పాటు చేయటంతో అర్ధరాత్రి నుంచే మంచు కురవటం, చల్లటి గాలులు వీయటంతో చాలామంది ఇబ్బంది పడుతున్నారు. ఈ మంచుతెరలు ఉదయం 8 గంటలకు కూడా పూర్తిగా తొలగకపోవటంతో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. . ఆస్తమా పేషంట్లు, ఉబ్బసం, ఆయాసం, సైనసైటిస్ ఉన్నవారు మంచువల్ల ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంటోందని వాపోయారు. షెడ్డును మంచు రాకుండా తగిన ఏర్పాట్లు చేయకపోవటం వల్లే ఇటువంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైన అధికారులు మంచు, చల్లగాలి చొరబడకుండా తగిన ఏర్పాట్లు చేయాలని శిక్షణార్థులు కోరుతున్నారు.

రోడ్డు భద్రతా బిల్లుతో డ్రైవర్ల ఉపాధికి గండి



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శివాజీ

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రత పేరుతో మోటారు వాహనాల చట్ట సవరణ చేసి, డ్రైవర్లపై శిక్షలు కఠినతరం చేయాలనే కుట్ర పన్నుతుందని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి నన్నపనేని శివాజీ విమర్శించారు. గురువారం రాజ్యసభలో ఆమోదానికి రోడ్డు భద్రతా బిల్లు ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక బ్రాడీపేటలోని సిఐటియు కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా

ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

శివాజీ మాట్లాడుతూ చిన్న చిన్న పొరపాట్లకూ డ్రైవర్లకు శిక్షలు, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు, వాహన పర్మిట్లు రద్దు, కోర్టు నుండి బెయిల్ తీసుకునే నిబంధన వంటి బిల్లులో ప్రతిపాదించిన అంశాలు డ్రైవర్ల ఉపాధికి గండి కొడతాయన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకుమాను నాగేశ్వరరావు మాట్లాడుతూ వాహనాల పెరుగుదలకు అనుగుణంగా రోడ్ల విస్తరణ, అభివృద్ధి జరగట్లేదని, పాదచారులు రోడ్లపైనే నడుస్తున్నారన్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం బస్టాండ్ వద్ద జరిగే నిరసన ప్రదర్శనలో రవాణా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు నగర అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, వివిధ సంఘాల నాయకులు షేక్ ఖాసిం షహీద్, ఇ. అప్పారావు, బి.లక్ష్మణరావు, నాగబ్రహ్మాచారి, నికల్సన్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్సీ యువతకు కంప్యూటర్ శిక్షణ

గుంటూరు : రాష్ట్ర షెడ్యూలు కులాల ఆర్థిక సహకార సంస్థ సహకారంతో ఎస్‌కె అండ్ ఎస్‌వి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎస్సీ నిరుద్యోగ యువతకు ట్యాలీ, డిటిపి, ఎంఎస్ ఆఫీసు, ఆడియో, వీడియో ఎడిటింగ్, స్పోకెన్ ఇంగ్లీషులో శిక్షణ ఇస్తున్నట్లు సొసైటీ అధ్యక్షురాలు ఎ.వి. శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బి.టెక్, ఎంటెక్, డిప్లొమా, పిజి పాస్/ఫెయిల్ అయిన వారు, 18 ఏళ్ల నుండి 35 ఏళ్ల వయస్సు కలిగిన యువతీ, యువకులు శిక్షణలో పాల్గొనవచ్చన్నారు. రెండు నెలలపాటు జరిగే ఈ ఉచిత శిక్షణలో స్త్రీ, పురుష అభ్యర్థులకు వేర్వేరుగా ఉచిత హాస్టల్, భోజన వసతి కల్పించబడుతుందని పేర్కొన్నారు. స్టడీ మెటీరియల్‌తోపాటు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు కంప్యూటరైజ్డ్ ల్యాబ్ వసతి కలదన్నారు. ఈనెల 10వ తేదీలోగా అభ్యర్థులు బ్రాడీపేట 4/18లోని ఈ అకాడమీ శిక్షణా సంస్థలో తమ దరఖాస్తులతోపాటు, కుల, నివాస ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలు3, విద్యార్హత పత్రాల నకలుతో సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు 8885313156, 9398070686 నంబర్లలో సంప్రదించాలన్నారు.



ఎంపికైన వారితో డిఇఒ గంగాభవానీ

గణతంత్ర వేడుకలకు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు సిద్ధం : డిఇఒ

గుంటూరు అర్బన్ : ప్రభుత్వ ఆధ్వర్యంలో 26న నిర్వహించే గణతంత్ర వేడుకలకు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులను ఎంపిక చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి గంగాభవాని గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపికైన వారికి 14న ప్రభుత్వం ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వీరిని గణతంత్ర వేడుకలకు మార్చ్‌ఫాస్ట్ విభాగానికి కేటాయించి గవర్నర్, ముఖ్యమంత్రి సమక్షంలో వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతారని, వారి సేవలు అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ నిర్వాహక కమిషనర్ పి.శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిల్ మెంబరు శివనాగిరెడ్డి, మల్లేశ్వరి, శాంతకుమారి, నాగేశ్వరరావు, బ్రహ్మం, జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

23న అంగన్‌వాడీల సమ్మె



స్త్రీ, శిశుసంక్షేమ శాఖాధికారికి వినతిపత్రం అందచేస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర కార్మిక సంఘాల సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలకు కనీస వేతనం, ఐసిడిఎస్‌కు నిధులు పెంపు, పెన్షన్ వంటి సమస్యలపై జిల్లా వ్యాప్తంగా 23న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్, మినీ వర్కర్లు ఒక రోజు సమ్మెలో పాల్గొంటున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కె.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారులకు యూనియన్ నాయకులు గురువారం సమ్మె నోటీసు అందచేశారు. ఐసిడిఎస్‌కు కేంద్రం బడ్జెట్ తగ్గించిందని, 300 జిల్లాల్లో నగదు బదిలీ, మిక్స్‌డ్ ఫుడ్ ప్యాకెట్లు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఇది అంగన్‌వాడీ సెంటర్ల లక్ష్యానికి విరుద్ధమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకునేందుకు అంగన్‌వాడీ కేంద్రాలను గ్రామపంచాయితీలకు అప్పగిస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు, ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు, టిఎ బిల్లులు, గ్యాస్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. తొలగించిన లింకు, క్రచ్, న్యూట్రిషన్ కౌన్సిలర్లను తిరిగి విధుల్లోకి తీసుకొని ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలని కోరారు. సమ్మెకు అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నగర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాస్, శ్రామిక మహిళ నగర కన్వీనర్ షేక్ షకీల పాల్గొన్నారు.

చలమయ్య కళాశాల్లో ముగిసిన నైపుణ్యాభివృద్ధి సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు అర్బన్

మారుతున్న పరిస్థితులను బట్టి విద్యార్థులు కూడా నైపుణ్యం సంపాదించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య కర్నూరపు వెంకటనారాయణ కళాశాల కార్యదర్శి రామకృష్ణ ప్రభు అన్నారు. కళాశాల్లో డిసెంబరు 30వ తేది నుంచి జరుగుతున్న 'సాఫ్ట్ స్కిల్స్ డెవలప్‌మెంట్' సదస్సు ముగింపు సందర్భంగా గురువారం ఆయన మాట్లాడారు. హైదరాబాదుకు చెందిన ఐసిఎఫ్ఎఐ బిజినెస్ స్కూల్‌కు చెందిన ప్రతినిధులు వచ్చి ఆరు రోజులపాటు విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణా సదస్సులు నిర్వహించారని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగం వస్తుందనే ఎదురుచూడక, స్వయం ఉపాధితో ఎదగటానికి నైపుణ్యాభివృద్ధి సదస్సులు దోహదపడతాయని తెలిపారు. సంస్థ ప్రతినిధి రాధామోహన్ మాట్లాడుతూ ప్రస్తుతం ఏ కంపెనీ వారైనా చదువుతోపాటు అదనపు అర్హతలు చూస్తున్నారని, వ్యక్తిత్వ వికాసం, గ్రూప్ మేనేజ్‌మెంట్,




మాట్లాడుతున్న రామకృష్ణ ప్రభు

వాక్చతుర్యం, క్రమశిక్షణ వంటి అర్హతలు చూస్తున్న దృష్ట్యా విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వటం ముఖ్యమని తెలిపారు. కొందరు విద్యార్థులు మాట్లాడుతూ ఉద్యోగాకోసమైనా, స్వయం ఉపాధికైనా ఇంతటి శిక్షణలో విషయాలను తెలుసుకోగలిగామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు శ్రీధర్, రాజరాజేశ్వరి, సుధాకర్‌రెడ్డి, శ్రీలక్ష్మీ, ఆనంద్‌బాబు, భవానిదుర్గ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఎఫ్ఆర్‌డిఐ బిల్లు-ప్రభావాల'పై సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

పీపుల్ ఫర్ ఇండియా ఫోరం(పిఎఫ్ఐ) ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరమ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు బ్రాడీపేట 2/6లోని యుటిఎఫ్ కార్యాలయంలో ఎఫ్ఆర్‌డిఐ బిల్లు-ప్రభావాలపై సదస్సు నిర్వహిస్తున్నట్లు పిఎఫ్ఐ వైస్ చైర్మన్ వివికె సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో మాజీ ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు, ఆర్‌విఆర్‌అండ్ ఇంజినీరింగ్ కాలేజి ప్రొఫెసర్ యం.వెంకటేశ్వరరావు, బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొంటారన్నారు. సదస్సుకు పెద్దసంఖ్యలో ప్రజలు హాజరుకావాలని కోరారు.



పవన్ సందీప్



సాయిలక్ష్మీ



సుందర రామశాస్త్రి

బీఎస్సీ ఎంఎల్‌టి ఫలితాల్లో సిమ్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కార్పొరేషన్

డాక్టర్ ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ బుధవారం విడుదల చేసిన బిఎస్‌సి ఎంఎల్‌టి మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో స్థానిక సిమ్స్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ బి.శివశిరీష, డైరెక్టర్ బి.భరత్‌రెడ్డి తెలిపారు. మొదటి సంవత్సరం ఫలితాలలో సిహెచ్.పవన్ సందీప్, సృజన, కనకదుర్గ, మేరిస్టెల్లా సతీష్‌కుమార్, వెంకటలక్ష్మీలు డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ద్వితీయ సంవత్సరంలో పి.సుందర రామశాస్త్రి, ప్రియాంక, సాయిప్రదీప్తి డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నైపుణ్యం పెంచుకుంటేనే మనుగడ

ఎపిఎస్ఎస్‌డిసి ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి నైపుణ్యం పెంచుకుంటేనే మనుగడ సాధ్యమని ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగేశ్వరరావు అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో వివిధ అంశాలపై ఈనెల 11వ తేదీ వరకూ నిర్వహించనున్న శిక్షణా తరగతుల్ని గురువారం నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞాన్ యూనివర్సిటీతోపాటు, మరో 11 కేంద్రాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శిక్షణా తరగతుల్ని పేద విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ఆధునిక ప్రపంచంలో సాంకేతిక అంశాలపై నైపుణ్యం పెంపొందించుకుంటేనే ఉద్యోగాలు, ఇతర రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించి పాఠశాల స్థాయి నుండే సాంకేతిక అంశాలపై విద్యార్థులు పట్టు సాధించేలా కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ అసిస్టెంట్ సెక్రటరీ బి.శివరామయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇది సువర్ణావకాశమన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ మధుసూదనరావు, విసి డాక్టర్ ఎంవైఎస్ ప్రసాద్, మోపిదేవి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు ఆర్ఐగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-గుంటూరు అర్బన్

గుంటూరు అర్బన్ పరిధిలో పనిచేస్తున్న ఆర్ఎస్ఐ కోటా చంద్రశేఖర్ ఉద్యోగన్నతిపై గురువారం ఆర్ఐగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా అర్బన్ ఎస్పీ విజయరావును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గతంలో ఎమ్‌టి, హెచ్‌జి, ట్రాఫిక్ విభాగాల్లో విధులు నిర్వర్తించారు.



పతకాలుసాధించిన లిఫ్టర్లను సన్మానిస్తున్న మంత్రి పుల్లారావు

జాతీయస్థాయి పతకాలు సాధించిన లిఫ్టర్లకు మంత్రి సన్మానం

ప్రజాశక్తి - మంగళగిరి

అండర్ -17, అండర్ -19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ పోటీల్లో పతకాలు సాధించిన లిఫ్టర్లను గురువారం వీవర్స్ కాలనీలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో మంత్రి పత్తిపాటి పుల్లారావు సన్మానించారు. షేక్ సాదియా ఆల్మాస్, పి.భరత్‌కుమార్, గండికోట కృష్ణబాబు, గండికోట శ్రీహరి, జన్మభూమి వేదికలో సత్కరించారు. కార్యక్రమంలో కోచ్ ఎస్‌కె.సందాని, మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి విజ్ఞాన్ మహోత్సవ్



మహోత్సవ్ కోసం వర్సిటీలో సిద్ధం చేసిన గ్రౌండ్

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ స్థాయి యువ సంగ్రామ సంరంభం శుక్రవారం నుంచి తమ యూనివర్సిటీలో ప్రారంభం అవుతుందని విజ్ఞాన్ యూనివర్సిటీ విసి డాక్టర్ ఎంవైఎస్ ప్రసాద్ తెలిపారు. వడ్లమూడి విజ్ఞాన్‌లో గురువారం పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మహోత్సవ్‌ను వినూత్నంగా రెండు విడతలుగా నిర్వహించబోతున్నట్లు చెప్పారు. తొలి విడతగా శుక్ర, శనివారంలో వివిధ రకాల క్రీడాంశాల్లో పోటీలుం టాయన్నారు. రెండో విడతగా సాంకేతిక, సాంస్కృతిక అంశాల్లో పెద్ద ఎత్తున యువతకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా విద్యార్థులు హాజరై రిజిస్ట్రేషన్ చేయించు కున్నారన్నారు. విజేతలకు రూ.25 లక్షలకుపైగా విలువైన నగదు బహుమతులు అందచేస్తామన్నారు. తొలి రోజు ముఖ్య అతిథులుగా ద్రోణ అవార్డు గ్రహీత అరికపూడి రమణారావు, విజయవాడ ఆదాయ పన్ను శాఖ ప్రధాన కమిషనర్ ఎం.భూపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు. ముగింపు రోజున ఒలంపిక్ పతక విజేత కరణం మల్లేశ్వరి, తదితరులు వస్తారన్నారు.

ఒమెగా ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

మహిళ ఉదరం నుంచి నాలుగున్నర కిలోల కణితి తొలగింపు

ప్రజాశక్తి-కార్పొరేషన్



మాట్లాడుతున్న డాక్టర్ నాగకిషోర్

స్థానిక కాకాని రోడ్‌లోని ఒమెగా హాస్పిటల్‌ల్లో రిట్రో పెరిటోనియల్ ట్యూమర్ కల్గిన మహిళకు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించామని డాక్టర్ ఎంజి.నాగకిషోర్ తెలిపారు. గురువారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా యుద్దనపూడి గ్రామానికి చెందిన 51 సంత్సరాల మహిళ ఉదరం నుండి నాలుగున్నర కిలోల కణితిని తొలగించామన్నారు. ఉదరం ఉబ్బరం, ఆయాసంతో బాధపడుతూ బాధితురాలు హాస్పిటల్‌కి వచ్చిందని రెండు వారాలు వివిధ పరీక్షలు చేసి రిట్రో పెరిటోనియల్ ట్యూమర్‌గా నిర్ధారించామన్నారు. ఈ ట్యూమర్ పేగులకు వెనుక రక్తనాళాలలో మొదలూ ఉబ్బటం జరుగుతుందన్నారు. దీనితో పేగులు, యూరినరీ బ్లాడర్, గర్భసంచి కిడ్నీ నుంచే మూత్ర నాళాలు ఉబ్బయాని చెప్పారు. నాలుగున్నర కిలోల కణితిని శస్త్ర చికిత్స చేసి విజయ వంతంగా తొలగించామని తెలిపారు. ఒమెగా హాస్పిటల్‌లో ఉన్న అత్యాధునిక పరికరాలతో అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్సని విజయవంతంగా పూర్తి చేసినట్లు చెప్పారు. శస్త్ర చికిత్సలో తనతో పాటుగా డాక్టర్ నగేష్, డాక్టర్ తేజ పాల్గొన్నారు.



పశుసంపదతోనే సిరి సంపదలు

మంత్రి పత్తిపాటి పుల్లారావు

ప్రజాశక్తి - పత్తిపాడు



సేద్యపు విభాగంలో బండలాగుతున్న ఎడ్ల జత

ఎడ్లు పందేలతో రైతుల కళ్ళల్లో ఆనందం కనపడుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. పత్తిపాడులో గింజపల్లి బాపయ్యచౌదరి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఒంగోలు జాతి పశు ప్రదర్శన పోటీలను గురువారం మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో తాను వ్యవసాయశాఖామంత్రిగా ఉన్న తరుణంలో ఒంగోలు జాతి పశు బలప్రదర్శన పోటీలకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. రైతులు పశు సంపద అభివృద్ధి చేసుకోవాలని, పశు సంపదతోనే సిరిసంపదలు వనకూడతాయన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే రావెల కిషోర్‌బాబు మాట్లాడుతూ ఒంగోలు జాతి పశువులకు ప్రపంచంలోనే గుర్తింపు ఉందని తెలిపారు. రైతులు ఆరుగాలం కష్టించి సంక్రాంతి సమయంలో ఇలాంటి పోటీలు నిర్వహించుకోవడం ద్వారా మానసిక ఉల్లాసం చేకూరుతుందన్నారు. సేద్యపు విభాగం పోటీల్లో కృష్ణాజిల్లా కానూరుకు చెందిన డి.సుబ్బారావు ఎడ్ల జత 4684 అడుగులు, యమ్.కృష్ణమోహన్‌కు చెందిన ఎడ్ల జత 4346 అడుగులు, జి.రవిశంకర్‌కు చెందిన ఎడ్ల జత 3893 అడుగుల దూరం బండ లాగాయి. పోటీలను తిలకించేందుకు పలు జిల్లాల నుంచి రైతులు తరలివస్తున్నారు. కార్యక్రమంలో నాగార్జున కుడికాల్వ అధ్యక్షులు జి.భుజంగరాయులు, జిడిసిసి ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, జెడ్‌పిటిసి భాగ్యారావు, టిడిపి మండల అధ్యక్షులు శివరామప్రసాద్, టిడిపి నాయకులు నూతనపాటి పరమేశ్వరరావు, నిమ్మగడ్డలవారిపాలెం సొసైటీ అధ్యక్షులు కె.సురేష్, రైతులు పాల్గొన్నారు.



ప్రతిభా వైజయంతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విద్యాసాగర్, తదితరులు



అనంతానంతం నాటకంలోని ఒక సన్నివేశం

అప్పాజోస్యుల సాహిత్య సేవ అభినందనీయం

వివిఐటి విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

ప్రజాశక్తి-కార్పొరేషన్

అప్పాజోస్యుల సత్యనారాయణ గత 25 సంవత్సరాలుగా చేస్తున్న సాహిత్య సేవ అభినందనీయమని వివిఐటి విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అభో విభో కందాళం ఫౌండేషన్, సంస్కృతి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కథానాటికల పోటీల ప్రారంభ సభలో ఫౌండేషన్ ఆహ్వాన సంఘం కన్వీనర్ డాక్టర్ డిఎస్ఎన్.మూర్తి స్వాగత ఉపన్యాసం చేశారు. అంబటి మురళీకృష్ణ సభను ప్రారంభించగా, సంస్కృతి సంస్థ అధ్యక్షులు పిన్నమనేని మృత్యుంజయరావు అధ్యక్షత వహించారు. కరణం సురేష్ పోటీ నాటకాల పరిచయం చేయగా తెలుగు నాటకరంగంలో విశేష కృషి చేస్తున్న డిఎస్ఎన్.మూర్తికి సత్కారం చేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ అప్పాజోస్యుల సత్యనారాయణ అమెరికాలో ఉంటూ, గణిత శాస్త్రవేత్తగానే కాకుండా తెలుగు సాహిత్య పెద్ద దిక్కుగా వ్యవహరిస్తున్నారన్నారు. విశిష్టమైన తెలుగు సాహిత్యాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు సంస్కృతి సంస్థ చేస్తున్న కృషి పలువురికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అనంతరం కొల్లా రాధాకృష్ణ దర్శకత్వంలో కళాంజలి ప్రగతినగర్, హైదరాబాద్ వారి 'అనంతానంతం, ఏపూరి హరిబాబు దర్శకత్వంలో భూమి దుఃఖం నాటకాల ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో సర్రాజు బాలచందర్, మోదుగు రవికృష్ణ, బండ్ల పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

18 నుంచి ఎన్‌టిఆర్ టెన్నిస్ కప్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి, తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు రూరల్

ఎన్‌టిఆర్ అసోసియేషన్ అమరావతి వారి ఆధ్వర్యంలో 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఎన్‌టిఆర్ స్టేడియం టెన్నిస్ కోర్టుల్లో ఎన్‌టిఆర్ టెన్నిస్ కప్-2018 పోటీలను నిర్వహిస్తున్నట్లు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అండర్-12, 14,15 విభాగాల్లో బాల బాలికలు, పురుషుల విభాగంలో సింగిల్స్ ఈవెంట్‌లో, 35 ప్లస్ విబాగంలో డబుల్స్ ఈవెంట్‌లో పోటీలు జరుగుతాయని చెప్పారు. పోటీలకు చీఫ్ రిఫరీగా కుమార్ వ్యవహరిస్తారన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు రూ. 10 వేలు, ట్రోఫీ, ప్రశంసాపత్రం అందజేస్తామని చెప్పారు. పోటీలను విజయవంతంగా నిర్వహించడానికి టోర్నమెంట్ కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో టిడిపి నాయకులు వజ్జ రామకృష్ణ, కమిటీ అధ్యక్షులు ఎస్ఎన్ కమల్, కార్యదర్శి నల్లబోతు శ్రీనివాసరావు, కోశాధికారి అంకాల సుబ్బారావు, పి.కిరణ్‌కుమార్, ఎన్. అప్పారావు, వై.వి రమణ, ఎమ్. నరేంద్రకుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.